సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 249

గురువారం 30-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

4.85 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

- ఇంకా పుంజుకోని వరి నాట్లు
- వ్యవసాయ శాఖ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 4.85 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, 8.84 శాతం విస్తీర్ణంలో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. గత యాసంగి సీజన్‌లో ఇదే సమయానికి 5.21 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, అప్పటికంటే ఇప్పుడు తగ్గడం గమనార్హం. ఇప్పటివరకు అత్యధికంగా పప్పుధాన్యాల పంటలు సాగయ్యాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.82 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాటిల్లో శనగ 1.61 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఇక వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.43 లక్షల ఎకరాల్లో (51.54%) సాగైనట్లు పేర్కొంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.02 లక్షల ఎకరాల్లో, జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 1.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 11,866 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది వరి అధికంగా సాగవుతుందని అంచనా వేస్తున్నారు. వరి సాధారణ సాగు లక్ష్యం 40.50 లక్షల ఎకరాలు కాగా, ఇంకా నాట్లు పుంజుకోలేదని వ్యవసాయశాఖ తెలిపింది. ఇప్పటివరకు కేవలం 2,374 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయని పేర్కొంది.

చంద్రబాబు పీటీ వారంట్‌పై విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబుపై పిటీ వారంట్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు డిసెంబర్ 5కు వాయిదా వేసింది. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలకు పాల్పడటం ద్వారా భారీ భూ దోపిడీకి పాల్పడిన కుంభకోణంపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణతోపాటు పలువురిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో పీటీ వారంట్ దాఖలు చేయగా కోర్టు తదుపరి విచారణను పై తేదీకి వాయిదా వేసింది.

రుషికొండపై నిర్మాణాల నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

- కేంద్ర కమిటీ నివేదిక ఇచ్చాక ఏం చేయాలో చూస్తాం
- అనుమతులు, ఉల్లంఘనల గురించి కమిటీనే చూసుకుంటుంది
- పిటిషనర్లకు తేల్చి చెప్పిన ఏపీ హైకోర్టు ధర్మాసనం



సాక్షి, అమరావతి: విశాఖపట్నం రుషికొండపై జరుగుతున్న పర్యాటక శాఖ రిసార్ట్ పునరుద్ధరణ పనులను, నిర్మాణాలను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. నిర్మాణాలకు సంబంధించి ఉల్లంఘనలను పరిశీలించేందుకు ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ కమిటీ నివేదిక ఇచ్చిన తరువాత ఏం చేయాలో చూస్తామంది. ఉల్లంఘనలు ఏం ఉన్నాయో తాము కమిటీకి చెబుతామన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. కమిటీకి మీరు చెప్పాల్సిన అవసరం లేదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం తేల్చిచెప్పింది.

ఒక్క ఫోన్ కాల్ చాలు

సమస్యలన్నీ పరిష్కారం..

పారిశ్రామిక ప్రతినిధులకు ఏపీ సీఎం వైఎస్ జగన్ భరోసా

- పారిశ్రామిక అభివృద్ధి.. స్థానిక యువతకు ఉపాధి లక్ష్యంగా అడుగులు.. జీఐఎస్ ఒప్పందాలను వేగంగా అమల్లోకి తెస్తున్నాం
- గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందాల మేరకు ఇప్పటికే 33 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభం
- శరవేగంగా మరో 94 ప్రాజెక్టుల పనులు
- వివిధ దశల్లో మిగతావి.. పురోగతి సాధించేలా నిరంతరం సీఎస్ సమీక్షలు
- నాలుగున్నరేళ్లలో 130 భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.69 వేల కోట్ల పెట్టుబడులు
- 86 వేల మందికి ఉద్యోగాలు కల్పించగలిగాం
- మన ప్రభుత్వం వచ్చాక కొత్తగా 1.88 లక్షల ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు
- వీటి ద్వారా 12.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి.. ఫిబ్రవరిలో ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలు విడుదల
- రూ.1,100 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టులకు సీఎం వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా అన్ని రకాలుగా చేయి పట్టుకుని నడిపిస్తున్నట్లు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పారిశ్రామికవేత్తల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉందని గుర్తు చేశారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో కుదిరిన ఒప్పందాలను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ త్వరితగతిన అమల్లోకి తెస్తున్నామని, ఇందుకోసం కృషి చేస్తున్న అధికారులకు అభినందనలు తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా ఉపాధి కల్పించే ఎంఎస్‌ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వచ్చే ఫిబ్రవరిలో ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలను విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. రూ.1,100 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టులకు బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

విశాఖ ఒప్పందాలు వేగంగా సాకారం..

పారిశ్రామిక రంగంపై ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు కూడా దీనిపై దృష్టి సారించి పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలి. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఎంవోయూలు చేసుకున్నాం. వీటి ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులతోపాటు ఆరు లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాం. ఇవన్నీ సాకారమయ్యేలా నిరంతరం సమీక్షిస్తూ పురోగతి కోసం చర్యలు తీసుకున్నాం. ఇందులో 33 యూనిట్లు ఇప్పటికే ఏర్పాటై ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి. మరో 94 ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మిగిలిన వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో మరింత పురోగతి సాధించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలకు చేయూతనిస్తున్నాం. నెలకు కనీసం రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించడం ద్వారా వీటన్నింటినీ వేగంగా కార్యరూపంలోకి తెస్తున్నాం. కలెక్టర్లు కూడా ప్రతి అడుగులోనూ చేయి పట్టుకుని నడిపిస్తూ దీన్ని మరింత వేగవంతం చేయాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎంఎస్‌ఎంఈలతో 12.62 లక్షల మందికి ఉపాధి

ఈ నాలుగున్నర సంవత్సరాల్లో 130 భారీ, అతిభారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయగలిగాం. వీటి ద్వారా దాదాపు రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 86 వేల మందికి ఉద్యోగాలు కూడా ఇవ్వగలిగాం. ఎంఎస్‌ఎంఈ రంగంలో ఎప్పుడూ చూడని విధంగా అడుగులు వేశాం. కోవిడ్ సమయంలో ఎక్కడా, ఎవరూ కుప్పకూలిపోకుండా వారికి చేయూతనిచ్చాం. గత నాలుగున్నరేళ్లలో దాదాపు 1.88 లక్షల ఎంఎస్‌ఎంఈలు కొత్తగా వచ్చాయి. వీటి ద్వారా 12.62 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అందరం కలసికట్టుగా బాధ్యత తీసుకున్నాం కాబట్టే ఇది సాకారమైంది. పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా మనం కేవలం ఒక ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నామనే మెసేజ్‌ను ఎంత సానుకూలంగా తీసుకెళ్లగలిగితే అంత ఉత్సాహంగా ముందుకొస్తారు. ఇది కచ్చితంగా నా దగ్గర నుంచి మొదలుకుని మీ వరకు ఇదే రకమైన తత్వాన్ని అలవరచుకోవాలి.

రూ.1,100 కోట్ల పెట్టుబడులకు శ్రీకారం

పరిశ్రమలు–వాణిజ్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ఇవాళ తొమ్మిది ప్రాజెక్టులు చేపడుతున్నాం. దాదాపు రూ.1,100 కోట్ల పెట్టుబడితో 21,744 మందికి ఉద్యోగాలు లభించేలా మంచి అడుగు పడుతోంది. మూడు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, మిగిలిన ఆరు ప్రాజెక్టులకు శంకుస్థాపన నిర్వహిస్తున్నాం. కొద్ది రోజుల క్రితం నేను పత్తికొండ వెళ్లినప్పుడు టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు దిశగా అడుగులు వేయమని చెప్పా. కొద్ది కాలంలోనే అది అధికారుల కృషితో కార్యరూపం దాల్చి శంకుస్థాపన దశకు వచ్చింది. రూ.12 కోట్ల పెట్టుబడితో టమోటా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు పత్తికొండలో శంకుస్థాపన నిర్వహిస్తున్నాం. ఇదే మాదిరిగా ప్రతి ఒక్కరూ అంతే వేగంగా అడుగులు ముందుకేయాలి. ఇవాళ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్ర మాలను జరుపుకొంటున్న తొమ్మిది యూనిట్లకు శుభాభినందనలు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వివిధ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు. మీ అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నా.

హాజరైన మంత్రులు, కంపెనీల ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్‌కుమార్, హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ కమిషనర్ ఎంఎం నాయక్, పరిశ్రమలశాఖ కమిషనర్ సీహెచ్ రాజేశ్వరరెడ్డి, ఉన్నతాధికారులు, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ సందర్భంగా కేటీఆర్ రక్తదానం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దీక్షచేసిన నవంబర్ 29ని దీక్షా దివస్‌గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో స్వయంగా కేటీఆర్ రక్తదానం చేశారు. ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున దీక్షా దివస్ నిర్వహించరాదని పోలీసు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులతో బీఆర్‌ఎస్ లీగల్ టీమ్ సంప్రదింపులు జరిపినా అనుమతి ఇవ్వలేదు. తాము నిబంధనల మేరకే దీక్షా దివస్ జరుపుతున్నామని, పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో తెలంగాణ భవన్ లేదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ నేత సోమ భరత్‌గుప్తా పోలీసు అధికారులకు వివరించారు. చివరకు పోలీసు కమిషనర్‌తో పాటు సంప్రదింపులు జరపగా తెలంగాణ భవన్ లోపలే దీక్షా దివస్ చేసుకునేందుకు అనుమతిచ్చారు. దీంతో కేటీఆర్ ప్రగతిభవన్ నుంచి తెలంగాణ భవన్‌కు చేరుకుని రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లుపై వేటు

- చిక్కడపల్లి ఏసీపీ, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌పైనా చర్యలు
- ముఠా గోపాల్ కుమారుడిని కేసు నుంచి కాపాడేయత్నం చేసినందుకు..
- ఈసీ ఆదేశాల మేరకు డీజీపీ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్/ముషీరాబాద్: ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ కుమారుడు ముఠా జైసింహను ఎన్నికల ప్రలోభాలకు సంబంధించిన కేసు నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు పోలీసులపై వేటుపడింది. నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య నివేదికను పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం.. మధ్య మండల డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆ ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీజీపీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జయసింహ గాంధీనగర్‌లోని సంతోష్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. కొంతమంది ఈ ప్రాంతంలో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు పంచుతున్నారని మంగళవారం రాత్రి 9 గంటలకు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందింది. దీంతో అక్కడికి వెళ్లిన అధికారులు అపార్ట్‌మెంట్ వద్ద పార్క్ చేసిన కారులో నగదు, రెండు సెల్‌ఫోన్లు, చెక్‌బుక్స్, 16 చొప్పున రూ.500 నోట్లను గుండ్రంగా చుట్టిన 225 బండిల్స్ (నోట్ల విలువ రూ.18 లక్షలు)ను గుర్తించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జిగా ఉన్న ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రవి ఎస్లావత్ ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పోలీసులు రాత్రి 11.50 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయితే, ఆ కారు రిజిస్ట్రేషన్ నంబర్ లేదా అందులో లభించిన సెల్‌ఫోన్లు, చెక్‌బుక్స్ ఆధారంగా బాధ్యుల్ని కొన్ని నిమిషాల్లోనే గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ కేసు నమోదులో ఉన్న లోపాలను ఎన్నికల అధికారిగా ఉన్న పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా కొత్వాల్ సందీప్ శాండిల్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌తో మాట్లాడినా ఫలితం దక్కలేదు. ఆ కారు యజమాని జి.సుధాకర్‌తోపాటు ఆయన సోదరుడు సంతోష్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఆ పని చేయలేదు. వీళ్లిద్దరూ ముఠా గోపాల్‌కు స్నేహితులుగా గుర్తించారు. డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ యాదగిరి, ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌లు ముఠా గోపాల్‌కు అనుకూలంగా వ్యవహరించడానికి ఇలా చేసినట్లు కమిషనర్ గుర్తించారు. ఫలితంగా ముగ్గురిపై వేటు వేశారు. ఈ ముగ్గురి స్థానంలో కొత్వాల్ కొత్త వారిని నియమించారు. కాగా, కారులో దొరికిన డబ్బుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ముఠా జైసింహ చెప్పారు. తనను కట్టడి చేస్తే తప్ప గెలవలేమని భావించిన కాంగ్రెస్, బీజేపీ నేతలు కొందరు పనిగట్టుకొని ఈ కుట్రకు తెరతీశారని ఆరోపించారు.

ఎక్సైజ్ సీఐ అంజిత్‌రావుపై వేటు



కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ అంజిత్‌రావును సస్పెండ్ చేస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల్లో అధికారులు విధులు నిర్వహిస్తుండగా ఈనెల 27న అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అంజిత్‌రావు మేడ్చల్ నియోజకవర్గంలోని మేడిపల్లి పీఎస్ పరిధిలో ఓ పార్టీకి సంబంధించిన డబ్బులను కారులో తరలిస్తున్నట్లు మరో పార్టీ నేతలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అంజిత్‌రావుపై సస్పెన్షన్ వేటు వేశారు.

జోరుగా బెట్టింగులు.. బోలెడన్ని ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పందేలు ఊపందుకున్నాయి. ఎక్కడికక్కడ స్థానికంగా బెట్టింగులు కొనసాగుతుండగా.. దేశవ్యాప్తంగా క్రికెట్ పోటీలపై బెట్టింగులు నిర్వహించే ఆన్‌లైన్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు..ఇప్పుడు తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై దృష్టి సారించాయి. ఏ రాష్ట్రంలో ఏ పార్టీ విజయం సాధిస్తుంది? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చే అవకాశం ఉందనే అంచనాల ఆధారంగా వేర్వేరు బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి.

మనమే టాప్..

ఇటీవల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా పట్టుబడిన అక్రమ సొత్తులో తెలంగాణ నం.1గా ఉన్న విషయం తెలిసిందే. అదే విధంగా అన్ని రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఎన్నికల ఫలితాలపైనే అత్యధికంగా పందేలు కాస్తున్నట్టు సమాచారం. ఏ పార్టీ అధికారంలోకి రాబోతోంది? అనే దానితో మొదలై డిపాజిట్ కోల్పోయే అభ్యర్థుల దాకా బెట్టింగులు హల్‌చల్ చేస్తున్నాయి. ఆయా అంశాన్ని బట్టి వందకు వెయ్యి, వెయ్యికి 10 వేలు అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందేలు కాస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ మార్గాల్లో బెట్టింగ్స్‌కు అవకాశం కల్పించడం ద్వారా తమ వెబ్‌సైట్/యాప్‌ల నుంచి పందెం రాయుళ్ల దృష్టి మరల్చకుండా ఆయా సంస్థలు జాగ్రత్త పడుతున్నాయి.

కొత్త కొత్త పందేలు షురూ...

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలు ఎన్ని స్థానాల్లో గెలుస్తాయి.. ఎన్ని సీట్లతో సరిపెట్టుకుంటాయి వంటి సర్వసాధారణ అంశాలతో పాటు డిపాజిట్ కోల్పోయే వారెవరు? అత్యధిక మెజార్టీ సాధించే అభ్యర్థి ఎవరు? కేసీఆర్ 2 స్థానాల్లో గెలుస్తారు/ ఒక్కచోటే గెలుస్తారు, జనసేన తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెడుతుంది/పెట్టదు.. తదితర కొత్త కొత్త విషయాలపై కూడా బెట్టింగులకు ఆయా సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి.



తెలంగాణ ఎన్నికల ఫలితాలపై పందేలు

- క్రికెట్ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌ల దృష్టీ వీటిపైనే
- ఏ పార్టీ గెలుస్తుందనే సాధారణ పందేలతో పాటు, ఎవరికెన్ని సీట్లు, డిపాజిట్ల గల్లంతు, మెజార్టీలు తదితర కొత్త అంశాలపైనా కాయ్ రాజా కాయ్
- వేల కోట్లు చేతులు మారే అవకాశం ఉందని అంచనా

ఇక్కడి ఫలితాలపై ఏపీలో సర్వేలు.. బెట్టింగులు

తెలంగాణ ఎన్నికల వేడి ఆంధ్రప్రదేశ్‌నూ చుట్టుముట్టింది. అక్కడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు గోదావరి జిల్లాల్లో సర్వేలు చేయించి మరీ బుకీలు పందాలు కాస్తున్నారని సమాచారం. కేసీఆరే సీఎం అవుతారని.. హంగ్ వస్తుందని.. కాంగ్రెస్ గెలుస్తుందంటూ కోట్లాది రూపాయల్లో బెట్టింగులకు దిగుతున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నెన్ని స్థానాలు వస్తాయనే దానిపై కూడా బాగా పందాలు జరుగుతున్నాయి. రేవంత్‌రెడ్డి రెండుచోట్ల గెలుస్తారా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు వచ్చే మెజార్టీ, కోమటిరెడ్డి బ్రదర్స్, మైనంపల్లి గెలుస్తారా లేదా? లాంటివి పంటర్లకు ఆసక్తికరంగా మారాయి.

ఒకటికి అనేక రెట్లు !

గెలుపు అవకాశాలున్న పార్టీపై కాకుండా రెండో స్థానంలో ఉంటుందనుకున్న పార్టీపై పందెం కాస్తే దానికి కొన్ని రెట్లు ఎక్కువ మొత్తాన్ని ఆశ జూపిస్తున్నారు. ఇదే విధానం కొందరు అభ్యర్థులకూ వర్తిస్తోంది. పోలింగ్‌కు 2 రోజుల ముందు నుంచీ ఊపందుకున్న ఈ బెట్టింగులు.. మొత్తంగా మూడో తేదీలోపు వేల కోట్లలో జరిగే అవకాశం ఉందని అంచనా.

నోటీసులు అందని వారికి మీరే అందజేయండి

- చంద్రబాబు 'స్కిల్' కేసులో ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఏపీ హైకోర్టు వెసులుబాటు
- విచారణ డిసెంబర్ 13కి వాయిదా



సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో నోటీసులు అందని వారికి వాటిని ఆయనే అందజేయవచ్చని హైకోర్టు వెసులుబాటునిచ్చింది. నోటీసులు అందుకున్న రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలనుకుంటే దాఖలు చేయవచ్చని తెలిపింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చంద్రబాబు హయాంలో జరిగిన ఈ కుంభకోణంలో అనేక క్లిష్టమైన అంశాలు ఉన్నందున సీబీఐ దర్యాప్తు చేయడమే సబబుగా ఉంటుందంటూ ఉండవల్లి అరుణ్ కుమార్ ఇటీవల హైకోర్టులో దాఖలు చేసిన ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. సరైన చిరునామాలు లేకపోవడం వల్ల పలువురికి నోటీసులు అందలేదని ధర్మాసనం తెలిపింది. ఉండవల్లి తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి స్పందిస్తూ.. సీఐడీ వద్ద అందరి చిరునామాలు ఉంటాయని, అందువల్ల నోటీసులు అప్పగించే బాధ్యతను సీఐడీకి అప్పగించాలని కోరారు. మీరు చేయాల్సిన పనిని వారికి అప్పగించడం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. అలా అయితే ప్రతివాదులకు వ్యక్తిగతంగా నోటీసులు అందచేసే వెసులుబాటును తమకు ఇవ్వాలని కృష్ణమూర్తి కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. తమకు నోటీసులు అందినందున కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. సీబీఐ తరఫు న్యాయవాది యజ్ఞదత్ స్పందిస్తూ.. తాము కౌంటర్ దాఖలు చేయబోమని, కోర్టు ఏం ఆదేశాలు ఇస్తే వాటికి అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. ఈ వ్యాజ్యంలో చంద్రబాబు తరఫున గింజుపల్లి సుబ్బారావు వకాలత్ దాఖలు చేశారని న్యాయవాది రాహుల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.



కదం తొక్కిన జనం

మచిలీపట్నం, కురుపాంలో సామాజిక సాధికార యాత్రలకు తరలివచ్చిన ప్రజలు

సీఎం జగన్ అందించిన చేయూతతో ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించిన బడుగు, బలహీనవర్గాలు మచిలీపట్నం, కురుపాంలో కదంతొక్కాయి. విద్య, వైద్య రంగాలను సమూలంగా మార్చడమే గాక ప్రభుత్వ సేవలను తమ ఇళ్ల వద్దే అందిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. భారీఎత్తున భూ పంపిణీతో తమ బతుకులు మార్చారంటూ కురుపాంలో గిరిజనులు హర్షధ్వానాలు, 'జై జగన్' నినాదాలతో కృతజ్ఞతలు తెలియజేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బూత్ లెవల్‌లో బోలెడు టెన్షన్

- ఇన్నాళ్లూ అభ్యర్థులకు వీళ్లే కీలకం
- అన్ని వ్యవహారాలూ వీళ్ల చేతి మీదుగానే..
- సానుకూల ఫలితం రాకుంటే నేతల దగ్గర పట్టు తప్పినట్టే!




సాక్షి, హైదరాబాద్: ప్రతి పార్టీలోనూ బూత్ కమిటీలది కీలక పాత్ర. అభ్యర్థి నామినేషన్ దగ్గర్నుంచీ ఓటర్‌ను పోలింగ్ బూత్‌కు నడిపించే దాకా అన్నీ తానై పని చేయాలి. సాధారణంగా నమ్మకమైన వ్యక్తులకే ఇలాంటి బాధ్యతలు అప్పగిస్తారు. ఇందులో విజయం సాధించిన వ్యక్తిని గ్రామ స్థాయి నాయకుడిగా పార్టీ గుర్తించి ప్రోత్సహిస్తుంది. పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి వ్యవహారంలోనూ వీరే ముఖ్య భూమిక పోషిస్తారు. అయితే ప్రయోజనాలతో పాటు ప్రతికూలతలూ బూత్ కమిటీ నేతలను వెంటాడుతుంటాయి. బరిలో నిలిచే అభ్యర్థి ఓటింగ్ అంచనాలు తారుమారైతే పరిస్థితి వ్యతిరేకంగా మారుతుంది. రాజకీయ భవితపై ప్రభావం చూపిస్తుంది. ఈ కారణంగానే బూత్ కమిటీ నేతల్లో పోలింగ్ రోజు హై టెన్షన్ కన్పిస్తుంది. దీంతో అనుకూల ఓటర్లను అంటి పెట్టుకోవడంతో పాటు అందరినీ సమన్వయం చేస్తూ పార్టీకి మెరుగైన ఫలితం లక్ష్యంగా పనిచేస్తున్నారు.

ఫోన్‌లో పలకరింపులు

ప్రతి గ్రామంలోనూ కనీసం ఒక పోలింగ్ బూత్ ఉంటుంది. బూత్ కమిటీ బాధ్యతలు తీసుకున్న వ్యక్తి ప్రతి వార్డులో తన అనుయాయులను పెట్టుకుంటారు. వారితో కలిసి పోల్ మేనేజ్‌మెంట్ సమన్వయ పరుస్తారు. వారం రోజులుగా ఓటర్లతో టచ్‌లో ఉన్న వీరు పోలింగ్ రోజు సైతం ఫోన్‌లోనైనా 'హాయ్' చెప్పడం ద్వారా ఓటును ఖరారు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అక్కడక్కడ అలకలు ఉన్నట్టుగా కనబడితే నేరుగా వెళ్లి మాట్లాడుతున్నారు. వార్డు స్థాయి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. తమ వారి దగ్గరకు ప్రత్యర్థి పార్టీల వాళ్ళు వస్తున్నారా? ప్రలోభాలకు గురి చేస్తున్నారా? అలాగైతే మళ్లీ తమ అభ్యర్థికి అనుకూలంగా ఎలా మార్చాలనే వ్యూహాల్లో మునిగి తేలుతున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తమ పార్టీల అభ్యర్థులకు తెలియజేస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా కీలకమైన గ్రామాల బూత్ స్థాయి నేతలతో అభ్యర్థులే నేరుగా మాట్లాడుతున్నారు.

బూత్ నేతలకు ఎర

కొన్ని గ్రామాల్లో బూత్ నేతలకు ఎర వేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. అభ్యర్థి నుంచి సరైన 'తోడ్పాటు' లభించని వాళ్ళు ఈ బాట పడుతున్నట్టు తెలుస్తోంది. ప్రలోభాల పర్వంలో వెనుకబడిన చోట బూత్ స్థాయి నేతలకు ఓటర్ల నుంచి వ్యతిరేకత వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకునే ప్రత్యర్థి పార్టీ నేతలు వారిని సంతృప్తి పరిచే పనిలో ఉన్నారు. నువ్వా నేనా అనే రీతిలో పోటీ ఉండి, ప్రతి ఓటు కీలకమైన చోట ఈ తరహా ప్రయత్నాలు కలిసి వచ్చే అవకాశం ఉండటంతో పార్టీలు దీనిపై దృష్టి సారిస్తున్నాయి.


'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+6 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 249

గురువారం 30-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఉచిత రేషన్ మరో ఐదేళ్లు

డ్వాక్రా మహిళలకు డ్రోన్లు..
కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు -4లో



ఇక యూఎస్‌లోనే రెన్యువల్

అమెరికాలోనే హెచ్‌–1బీ వీసా రెన్యువల్
చేసుకునే వెసులుబాటు.. -4లో

నేడే ఓట్ల పండుగ

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

13 తీవ్రవాద ప్రభావిత స్థానాల్లో సాయంత్రం 4 వరకే..

119 మొత్తం స్థానాలు	2,290 పోటీలో ఉన్న అభ్యర్థులు
3,26,18,205 ఓటర్ల సంఖ్య	
35,655 పోలింగ్ కేంద్రాలు	27,094 వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించే ప్రాంతాలు
డిసెంబర్ 3 ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన	


ఓటు వేసేందుకు వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడుతున్న హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్ స్టేషన్

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు తీర్పు ఇచ్చే రోజు వచ్చేసింది. గురువారం ఉదయం నుంచే పోలింగ్ మొదలుకానుంది. ఈ మేరకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. వామపక్ష తీవ్రవాద ప్రభావమున్న 13 స్థానాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. మిగతా 106 చోట్ల ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను ప్రకటిస్తారు. మిగతా ప్రక్రియల పూర్తి

మిగతా 6వ పేజీలో ▶

అనుకూల ఓటింగ్‌ను పెంచాలి

- పోలింగ్ శాతం పెంపుపై కూడా దృష్టి పెట్టాలి... అభ్యర్థులకు, బూత్ కమిటీలకు బీజేపీ దిశానిర్దేశం

- వివరాలు 5లో

వ్యాక్సిన్ లేని కరోనా కాంగ్రెస్


- రైతుబంధు నిలిపి వేసి రైతులను శిక్షించడం ఎందుకు?
- 88 సీట్ల కంటే ఎక్కువే గెలుస్తాం
- వచ్చే ప్రభుత్వంలో టూరిజం శాఖ కావాలని కోరుతా: కేటీఆర్
- దీక్షా దివస్ సందర్భంగా ఉద్యమ జ్ఞాపకాల నెమరు

5లో

వార్ రూం.. వేదికగా

- పోల్ మేనేజ్‌మెంట్‌పై కాంగ్రెస్ దృష్టి
- వార్‌రూం నుంచే పరిస్థితిని సమీక్షించిన ఠాక్రే
- బిర్లామందిర్, నాంపల్లి దర్గాల్లో రేవంత్ ప్రత్యేక పూజలు
- ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రమాణం

5లో



కార్మికులు క్షేమంగా రావడం గొప్ప విషయం

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: ఉత్తరాఖండ్‌లోని ఓ టన్నెల్‌లో 17 రోజుల పాటు చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడం గొప్ప విషయమని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్చలు జరిపి కార్మికులను బయటకు తీసుకురావడం అభినందనీయం. ఈ మొత్తం ఆపరేషన్‌ను సమన్వయం చేసిన కేంద్రం, ప్రధాని మోదీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు..' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

వారి సంకల్పం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి

ఉత్తరాఖండ్ రెస్క్యూ ఆపరేషన్‌పై ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడంపై సీఎం వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. ''టన్నెల్ ఆపరేషన్‌లో రెస్క్యూ టీం అవిశ్రాంతంగా పనిచేసింది. అలుపెరగని ప్రయత్నాలు చేసి కార్మికులను రక్షించిన రెస్క్యూటీమ్‌కు నా అభినందనలు.. వారి సంకల్పం, ధైర్యం మనందరికీ స్ఫూర్తి. చిక్కుకున్న 41 మంది కార్మికులు సొరంగం నుండి సురక్షితంగా బయట పడటం సంతోషాన్ని ఇచ్చింది' అని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.





సహాయక చర్యల్లో నగరానికి చెందిన బెరోలెక్స్ ఇండస్ట్రీస్ కీలకపాత్ర

టన్నెల్ కార్మికులను రక్షించడంలో డీఆర్‌డీఓ సహకారం

సాక్షి, హైదరాబాద్: ఉత్తరాఖండ్ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు హైదరాబాద్ డీఆర్‌డీఓ సహకారంతో నగరానికి చెందిన పరిశ్రమ 'బెరోలెక్స్ ఇండస్ట్రీస్'కీలక పాత్ర పోషించింది. కార్మికులను రక్షించేందుకు ఏర్పాటైన రెస్క్యూ బృందంలోని అధికారులు టన్నెల్ పైపులో చిక్కుకున్న అగర్ డ్రిల్లింగ్ యంత్రాన్ని కత్తిరించేందుకు ఈనెల 25న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్‌రెడ్డిని సంప్రదించారు. ఈ క్రమంలో ఆయన హైదరాబాద్‌లోని వివిధ పరిశ్రమలను సంప్రదించగా...బెరోలెక్స్ ఇండస్ట్రీస్ ముందుకు వచ్చి ప్లాస్మా ఆధారిత కట్టింగ్‌ను సూచించింది. 800ఎంఎం పైపులైన్ వ్యాసం కంటే తక్కువ వ్యాసం కలిగిన రెండు యంత్రాలను సిద్ధం చేశారు. కటింగ్ నైపుణ్యం కలిగిన ఇద్దరు నిపుణులను కూడా గుర్తించారు. ఈ నిపుణులతో పాటు పరికరాల్ని తీసుకెళ్లేందుకు భారత వైమానిక దళం విమానాన్ని ఏర్పాటు చేసింది. ఈ పనులన్నీ దాదాపు 3 గంటల వ్యవధిలోనే పూర్తిచేశారు. నవంబరు 25న బేగంపేట విమానాశ్రయం నుంచి డెహ్రాడూన్‌కు చేరుకున్న ఈ నిపుణులు అక్కడ్నుంచి రోడ్డుమార్గం ద్వారా తెల్లవారుజామున టన్నెల్ వద్దకు చేరు కున్నారు. అక్కడ అధికారులకు నిపుణులు ప్రక్రియను విశదీ కరించిన తర్వాత యంత్రాలు పైప్‌లైన్‌లోకి ప్రవేశించాయి. కొన్ని గంటల్లోనే అగర్, బ్లేడ్‌లను కత్తిరించే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. కార్మికులను రక్షించడంలో కీలకపాత్ర పోషించిన బెరోలెక్స్ ఇండస్ట్రీస్‌కు ప్రభుత్వ సీనియర్ అధికారులు భాస్కర్ కుల్బే తదితరులు కృతజ్ఞతలు తెలిపినట్లు ఆ సంస్థ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

మహిళా పురోగాభివృద్ధికి 'స్టాండప్ ఇండియా'

● గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్టాండప్ ఇండియా పథకం' మహిళల పురోగాభివృద్ధికి దోహద పడుతోందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఈ పథకం ద్వారా దేశ అభివృద్ధిలో మహిళా పారిశ్రామిక వేత్తలను సంరక్షకులుగా మార్చడంపై ప్రధాని మోదీ దృష్టిసారించారని ఆమె తెలిపారు. బుధవారం ఢిల్లీ యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లోని కిరోడిమల్ కాలేజీలో నిర్వహించిన భారత్ లిటరేచర్ ఫెస్టివల్ (భారత సాహిత్య మహోత్సవం)లో గవర్నర్ పాల్గొన్నారు. 'యత్ర నార్యంతు పూజ్యంతే'లో భాగంగా.. 'ప్రగతిశీల దేశ నిర్మాణం –మహిళా అభివృద్ధి–సాధికారత'పై వ్యాఖ్యాత రాఖీ భక్షి అడిగిన ప్రశ్నలకు తమిళిసై సమాధానాలిచ్చారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో సాహిత్య ప్రియులు, పలు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో శాస్త్రోక్తంగా గోపూజ



వసంత మండపంలో గోపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుమల: తిరుమల వసంత మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని విష్ణు పూజల్లో భాగంగా బుధవారం గోపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని వసంత మండపంలో కొలువుతీర్చారు. స్వామి, అమ్మవార్లకు తిరువారాధన చేశారు. అనంతరం ఆవు, దూడకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం, హారతి సమర్పించారు. గోప్రదక్షిణ చేశారు. వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు పాల్గొన్నారు.

డిసెంబర్ 1న డయల్ యువర్ టీటీడీ ఈవో : డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలను ఫోన్ ద్వారా ఈవో ఏవీ ధర్మారెడ్డికి తెలపవచ్చు.



VOTE



నా ఓటు అమ్ముకోను

ఓటుకు ఎంత ఇస్తావు.. డబ్బులిస్తేనే ఓటు వేస్తాను.. అని బేరాలాడేవారు చాలామంది ఉంటారు. అలాంటి వారికి కనువిప్పు కలిగిస్తున్నాడొక యువకుడు. నల్లగొండలోని ఒక సెలూన్‌లో పనిచేస్తున్న మురళి అనే యువకుడు ధరించిన టీ షర్ట్ ఆలోచింపజేస్తోంది. 'మై ఓట్ ఈజ్ నాట్ ఫర్ సేల్'..'ఓటేసి రాజులవుతారో.. అమ్ముకొని బానిసలవుతారో మీరే నిర్ణయించుకోండి'.. అని ముద్రించిన టీషర్ట్ ధరించి ఆకర్షిస్తున్నాడు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



యువశక్తిని ఓటుతో చాటాలి

ఓటర్లందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. దయచేసి మీ ఓటు హక్కును వినియోగించుకోండి. మనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమవ్వండి. ఓటు వేసే రోజును సెలవు దినంగా పరిగణించవద్దు. ఓటు వేయడం మన బాధ్యత. యువ ఓటర్లు ఈ విషయాన్ని గుర్తించి ఓటు వేసి యువశక్తిని చాటాలి.



జస్టిస్ పి.నవీన్‌రావు
తెలంగాణ హైకోర్టు మాజీన్యాయమూర్తి



ఎ. నరసింహారెడ్డి
తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

ఒకప్పుడు పార్టీ సిద్ధాంతాలను చూసి ఓటు వేసేవారు. ఇప్పుడు స్థానిక వ్యక్తిని, హామీలను చూసి ఓటు వేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీలు ఆ హామీలను నెరవేర్చడం లేదు. యువఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. ఆలోచించి...మీ భవిష్యత్ కోసం ఓటు వేయాలి. ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలి. ఓటు వేయని వారికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు నైతికంగా కోల్పోతారు.

క్లుప్తంగా...



పోలింగ్ కేంద్రాలపై డ్రోన్లతో నిఘా

మణుగూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసులు తొలిసారిగా మానవ రహిత విమానంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో 244 పోలింగ్ కేంద్రాలుండగా.. 124 కేంద్రాలు సమస్యాత్మకమైనవని గుర్తించారు. ఈ మానవరహిత విమానంతో సమస్యాత్మక ప్రాంతాల ఛాయా చిత్రాలనూ తీయవచ్చు. నదులు, అడవులు సహా పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నా పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

'భవితను నిర్ణయించుకునే తరుణమిదే'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు తమ భవిష్యత్తును నిర్ణయించుకునే సమయం ఆసన్నమైందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. యువతీ యువకులు తప్పక తమ ఓటుహక్కును వినియోగించుకొని తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్న స్వేచ్ఛను సాధించాలని ఒక ప్రకటనలో కోరారు.

నేడు ఏపీ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

తెలంగాణలో ఓటు ఉన్న వారికి వర్తింపు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడి ప్రభుత్వ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించింది. తెలంగాణలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు సరైన ఆధారాలు సమర్పించి సెలవును పొందవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర ఆధారాలను సమర్పించి ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

1.75 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు

హైకోర్టుకు వివరించిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించామని, మంగళవారం వరకు 1.75 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని హైకోర్టుకు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేలా ఈసీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఇచ్చామన్నారు. పిటిషనర్ ఫిర్యాదును కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దీంతో ధర్మాసనం.. ఈ పిటిషన్‌లో వాదనలను ముగిస్తున్నట్లు వెల్లడించింది.

ఇదండీ సంగతి



నగరం..ఓటు గగనం!

ఓటు హక్కు వినియోగంపై ఆసక్తి చూపని సిటీజనులు • నగరాలు, పట్టణాల్లో తక్కువ ఓటింగ్ నమోదు

హైదరాబాద్‌లో అయితే మరీ అత్యల్పం • ఈసారి కూడా వరుస సెలవుల భయం

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఉద్యోగం, ఆపై వారాంతపు వినోదాలకు ప్రాధాన్యతనిచ్చే మహా నగరంతో పాటు ఇతర నగరాలు ఓటింగ్‌లో పల్టీ కొడుతున్నాయి. ఎన్నిక ఏదైనా..అభ్యర్థులు ఎవరైనా..మాకేంటి అన్నట్టుగా ఎక్కువ శాతం నగర జనం వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల పోలింగ్ శాతాలను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుండగా.. సిటీజనులు ఈసారి ఏ మేరకు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటారన్న అంశం ఆసక్తికరంగా మారింది. 2018లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం ఓటర్లలో 80.4 శాతం మంది ఓట్లు వేయగా, హైదరాబాద్ మహానగరంతో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం తదితర నగరాల్లో ఓటేసేందుకు జనం పెద్దగా ఆసక్తి చూపలేదు. తెలంగాణలో ఏకంగా 20కి పైగా నగరాలు, పట్టణాల్లో 53 శాతం లోపు ఓట్లే పోలయ్యాయి. హైదరాబాద్‌లో 50% కూడా మించకపోవడం గమనార్హం.

పల్లెల్లోనే అత్యధిక పోలింగ్

ఎన్నిక ఏదైనా పల్లెల్లోనే అత్యధిక శాతం పోలింగ్ నమోదవుతోంది. నగరాలు, పట్టణాల్లో ఉండే వారు సైతం పల్లెలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా ఇందుకు ఒక కారణమవుతోంది. అయితే ఈసారి పల్లెలకు దీటుగా నగరాలు, పట్టణాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచారం నిర్వహించాయి. అయితే పోలింగ్ రోజైన గురువారం సెలవు దినం కాగా, మధ్యలో ఒకరోజు (శుక్రవారం) సెలవు పెడితే, శని, ఆదివారాలు సెలవులు (లాంగ్ వీకెండ్) కావడం పోలింగ్ శాతంపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఓటు వేయటం కనీస బాధ్యత



ఎన్నికల్లో ఓటు వేయటం పౌరుల కనీస బాధ్యత. తమ పని తాము చేయకుండా ప్రశ్నిస్తామనటం ఏ మాత్రం సరికాదు. ముఖ్యంగా హైదరాబాద్‌లో పోలింగ్ శాతం ఆందోళనకరంగా ఉంటోంది. అందుకే ఈసారి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఓటింగ్ శాతం పెరుగుతుందన్న నమ్మకం ఉంది.

శీలా పనికర్, లెట్స్ ఓట్ ప్రతినిధి

ఎక్కడకెళ్లినా ఓటేసేందుకు వస్తా



ప్రపంచంలోని అన్ని దేశాలు తిరిగి రావటమే నా లక్ష్యం. ఇప్పటివరకు 62 దేశాలు తిరిగా. పోలింగ్ రోజు మాత్రం తప్పకుండా హైదరాబాద్‌లో ఉండేలా చూసుకుంటా. కొండాపూర్‌లో ఓటేసి వెళ్తా. పోలింగ్ డేట్‌ను చూసుకునే నా టూర్ ప్లాన్ చేసుకుంటా. పాండిచ్చేరిలో ఉన్న నేను ఓటు కోసమే హైదరాబాద్ వచ్చా.

నీలిమారెడ్డి, ట్రావెలర్

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ఇలా.. (శాతాల్లో)

హైదరాబాద్	పోలింగ్
మలక్‌పేట	42.36
జూబ్లీహిల్స్	45.59
నాంపల్లి	45.46
యాకుత్‌పురా	46.62
శేరిలింగంపల్లి	48.61
ఎల్బీనగర్	49.58
ఇతర నగరాల్లో..	
నిజామాబాద్ అర్బన్	62.65
వరంగల్ వెస్ట్	59.21
కరీంనగర్	69.29
రామగుండం	71.94
మహబూబ్‌నగర్	74.93



అధిక శాతం నమోదైన నియోజకవర్గాలు

పాలేరు	92.09	మునుగోడు	91.30
మధిర	91.98	నర్సాపూర్	90.74
ఆలేరు	91.47	భువనగిరి	90.77

వాట్సాప్ గ్రూపులతో బందోబస్తు!

- ఎన్నికల బందోబస్తు కోసం భారీగా అదనపు బలగాలు
- కేంద్రం, ఇతర రాష్ట్రాల నుంచీ తరలింపు
- వారి పర్యవేక్షణ బాధ్యతలు స్థానిక ఇన్‌స్పెక్టర్లకే..
- బృందాల వారీగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు
- లొకేషన్లు, ఫొటోల ద్వారా నిరంతర పర్యవేక్షణ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించిన వాట్సాప్ గ్రూపుల విధానాన్ని.. ఇప్పుడు పోలీసులు ఎన్నికల బందోబస్తు, నిఘా కోసం అవలంబిస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, కేంద్రం నుంచి వచ్చిన అదనపు బలగాలతోపాటు స్థానిక సిబ్బంది పనిని ఈ గ్రూపులతో పర్యవేక్షిస్తున్నారు. పాయింట్ డ్యూటీలు, రూట్లలో ఉన్న సిబ్బంది తమ లొకేషన్, సెల్ఫీ ఫొటోలను గ్రూపుల్లో షేర్ చేయడాన్ని తప్పనిసరి చేశారు. ఇక బందోబస్తు, భద్రత విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారికి బస, రవాణా, ఆహారం తదితరాల కోసం ఏర్పాట్లు చేశారు.

ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో..

ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ తరఫున ప్రచారం చేయడానికి, కాలనీలు, బస్తీల్లో జెండాలతో సంచరించడానికి చాలా మందిని నియమించుకున్నారు. వారికి రోజులు, వారాల లెక్కన చెల్లింపులు చేశారు. బృందాలుగా చేసి ప్రాంతాల్లో తిప్పారు. వారు తాము చెప్పిన చోటుకే వెళ్తున్నారా? స్థానికులను కలుస్తున్నారా? ప్రచారం చేస్తున్నారా? అన్నది పరిశీలించేందుకు వాట్సాప్ గ్రూపులను వాడారు. క్షేత్రస్థాయిలో ఉన్న వారు ఎప్పటికప్పుడు తమ లొకేషన్లు షేర్ చేసేలా, ప్రజలతో సెల్ఫీలు దిగిపోస్ట్ చేసేలా చర్యలు చేపట్టారు. ఇదే వ్యూహాన్ని బందోబస్తు, భద్రత చర్యల కోసం వచ్చిన అదనపు బలగాలను పర్యవేక్షించడానికి పోలీసు ఇన్‌స్పెక్టర్లు వాడుతున్నారు. కేంద్రం నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రత్యేక, సాయుధ బలగాలను పోలీసుస్టేషన్ల వారీగా కేటాయించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లే వారి విధులను పర్యవేక్షించాలి. ఎవరెవరు ఏ విధుల్లో ఉన్నారు? ఎక్కడ ఉన్నారన్నది సులువుగా తెలుసుకుని, పర్యవేక్షించేలా ఇన్‌స్పెక్టర్లు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. రూట్ పార్టీల్లో తిరుగుతున్న, పాయింట్ డ్యూటీల్లో ఉన్న సిబ్బంది కచ్చితంగా తమ ఫొటోలు, లొకేషన్లను అందులో షేర్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు.

సిబ్బందికి ఇబ్బందులు లేకుండా..

బందోబస్తు విధులంటే పోలీసులకు ఇబ్బందే. తాగడానికి నీళ్లుండవు, ఆహారం ఉండదు. కేటాయించిన ప్రాంతాన్ని వదిలి కదలడానికి లేదు. రిపోర్ట్ చేసిన అధికారి కార్యాలయం నుంచి డ్యూటీ పాయింట్‌కు వెళ్లేందుకూ ఇబ్బందే. ఈసారి ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. సిబ్బంది రిపోర్ట్ చేసిన ప్రాంతం నుంచి పాయింట్‌కు చేరడం కోసం, అవసరమైన పక్షంలో ప్రత్యేక గస్తీలు నిర్వహించడం కోసం వాహనాలు అద్దెకు తీసుకున్నారు. భోజనం, టీ, మంచినీళ్లు అందేలా ఏర్పాట్లు చేశారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో హై అలర్ట్

- ఎన్నికలను బహిష్కరించాలని ఇప్పటికే మావోయిస్టుల పిలుపు
- గోదావరి పరీవాహక జిల్లాల్లో ముమ్మరంగా పోలీస్ గాలింపు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తూ మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో మావో ప్రభావిత ప్రాంతాలపై పోలీసులు మరింత ఫోకస్ పెంచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప సమీపంలో మావోయిస్టులు ఓ ధాన్యం లారీని దగ్ధం చేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మావోయిస్టు యాక్షన్‌టీం కదలికలపై నిఘా పెట్టారు. అలాంటి ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ ప్రాంతాల సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. గోదావరి పరీవాహక జిల్లాల్లో స్థానిక పోలీసులతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో గస్తీ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ముమ్మర తనిఖీలు నిర్వహించడంతోపాటు ఏరియా డామినేషన్ సెర్చ్‌లు చేపట్టారు.

45వేలమంది పోలీసు సిబ్బందితో పాటు..

ఎన్నికల బందోబస్తు విధుల్లో రాష్ట్ర పోలీస్‌శాఖ నుంచి 45 వేల మంది పోలీసు సిబ్బంది, 375 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర నుంచి 23, 500 మంది హోంగార్డులు ఉండనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 4400 ప్రాంతాల్లోని 12వేల పోలింగ్ స్టేషన్లను క్రిటికల్‌గా అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీటి పరిధిలో ఎన్నికల విధుల్లో స్థానిక పోలీసులతోపాటు అదనపు సంఖ్యలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఉండనున్నాయి. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ పరిధిలో విధుల కోసమే 100కు పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వినియోగిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు.

రూ.745 కోట్లకు చేరిన జప్తులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బుధవారం రూ.8.07 కోట్లు విలువ చేసే నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువ మొత్తం రూ.745.37 కోట్లకు చేరింది. వివరాలు ఇలా...

అంశం	మంగళవారం స్వాధీనం చేసుకున్నది	మొత్తం
నగదు	రూ.3.78 కోట్లు	రూ.305.72 కోట్లు
మద్యం	రూ.2.66 కోట్లు	రూ.127.55కోట్లు (2,63,482 లీటర్లు)
డ్రగ్స్	రూ.27.94లక్షలు (100 కిలోల గంజాయి)	రూ.40.14 కోట్లు (10,086 కిలోల గంజాయి+ఇతరాలు)
విలువైన లోహాలు	రూ.24.5లక్షలు (0.394 కిలోల బంగారం)	రూ.187 కోట్లు (303కేజీల బంగారం, 1195కిలోల వెండి)
ఇతరాలు	రూ.1.09 కోట్లు (350 శారీలు, 20 కుట్టుమెషీన్లు)	రూ.84.94 కోట్లు (2,98,595 కిలోల బియ్యం, 9207 కుక్కర్లు, 89,329 చీరలు)
మొత్తం విలువ	రూ.8.07 కోట్లు	రూ.745.37 కోట్లు

రూ.56.48 లక్షలు పట్టివేత

సిర్పూర్(టి): కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలంలో ఆటోలో తరలిస్తున్న భారీ నగదును పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సివిల్ అధికారి కొట్నాక రఘునాథ్‌రావు, ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాలివి. సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ (టి) మండల కేంద్రానికి రోజూ సరుకులు రవాణా చేసే ఆటోలోని నూనె కార్టన్లు తెరిచి చూడగా రూ.56.48 లక్షలు బయటపడింది. నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి విచారణ చేపట్టినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వెల్లడించారు.

యూపీఐతో 'చెల్లింపు'.. ప్రత్యేక వాహనాల్లో తరలింపు!

- హైదరాబాద్‌లో ఉంటున్న 'తమ ఓటర్ల'కోసం ఇతర జిల్లాల అభ్యర్థుల ఏర్పాట్లు
- ఫోన్ నంబర్లు సేకరించి నాలుగైదు రోజులుగా సంప్రదింపులు
- మంగళవారం నగర శివార్లలోని ఫంక్షన్ హాళ్లలో డిన్నర్ పార్టీలు
- ప్రత్యేక వాహనాలు పెట్టి బుధవారమే ఊళ్లకు తరలించిన నేతలు

"హలో.. మన నియోజకవర్గ ఓటర్ల కోసం బస్సులు, జీపులు సిద్ధం చేశాం. ఆరాంఘర్ కూడలికి వస్తే రెడీగా ఉంటాయి. వచ్చేయండి, అక్కడే మీకు ఓటు డబ్బులు చెల్లిస్తాం!"..

"మీ ఎకౌంట్‌కు గూగుల్ పే నుంచి డబ్బులు పంపాం. ముట్టినయా చూసి ఓకే మెసేజ్ పెట్టండి.."

సాక్షి, హైదరాబాద్: మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం రాత్రిదాకా ఇదే తీరు. హైదరాబాద్‌లో, వివిధ పట్టణాల్లో ఉంటున్న తమ నియోజకవర్గ ఓటర్లను తరలించేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లు ఇవి. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన లక్షల మంది ఓటర్లు గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈసారి ఎన్నికల్లో గట్టి పోటీ కనిపిస్తుండటంతో అభ్యర్థులు ఈ ఓటర్లపై దృష్టిపెట్టారు. తమ నియోజకవర్గ ఓటర్లందరినీ రప్పించుకుని, తమకే ఓటు వేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఓట్ల కోసం యూపీఐ ద్వారా డబ్బులు జమ చేయడంతోపాటు స్వస్థలాలకు రవాణా సదుపాయాన్నీ ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులు మొత్తం సొమ్ము ముందే ట్రాన్స్‌ఫర్ చేయగా, మరికొందరు కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, ఓటు వేయటానికి వచ్చినప్పుడు మిగతా సొమ్ము ఇస్తామని చెప్తున్నట్టు తెలిసింది. అభ్యర్థుల అనుచరులు, స్థానిక నేతలు దీనంతటినీ పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఓటర్లను తరలించుకుపోయేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేశారు. కొందరు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులనూ బుక్ చేసినట్టు తెలిసింది. చాలా వరకు మినీ వ్యాన్లు, కార్లను సిద్ధం చేశారు.



దావత్ ఇచ్చి.. స్లిప్పులు పంచి..!

కొందరు అభ్యర్థులు హైదరాబాద్ నుంచి తమ ఓటర్లను తరలించడానికి ముందు మంగళవారం రాత్రే శివారు ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లలో దావత్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఓటర్లను దావత్‌కు రప్పించి.. లిక్కర్, మాంసాహార భోజనం పెట్టారని సమాచారం. ఈ సమయంలో కొందరు నేరుగా ఓటర్లకే డబ్బులు ఇవ్వగా, మరికొందరు స్లిప్పులు రాసిచ్చి, సొంతూరికి వెళ్లాక ఓటేసే ముందు అది ఇచ్చి డబ్బులు తీసుకోవాలని చెప్పినట్టు తెలిసింది.

బస్టాండ్లలో విపరీతమైన రద్దీ

ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నగరం నుంచి పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ సొంతూర్లకు తరలివెళ్లారు. దీంతో బస్టాండ్లు, ఎల్‌బీనగర్, ఉప్పల్ కూడలి, ఆరాంఘర్ వంటి ప్రాంతాలు కిటకిటలాడాయి. దీనితో ఆర్టీసీ సుమారు 1,500కుపైగా అదనపు బస్సులను సిద్ధం చేసి ఆయా రూట్లకు నడిపింది. మరోవైపు భారీ సంఖ్యలో ప్రైవేటు వాహనాలు కూడా ప్రయాణికులను తరలించాయి.

నేడు వేతనంతో కూడిన సెలవు

- ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగులకు, విద్యాసంస్థలకు వర్తింపు
- సెలవు ఇవ్వకుంటే కఠిన చర్యలకు సీఈఓ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ 1881 కింద ఈ మేరకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గత అక్టోబర్ 16న ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1974 కింద అన్ని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులు, కూలీలు, ఇండస్ట్రియల్ అండర్‌టేకింగ్స్, ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ ఈనెల 15న రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణీకుముదిని ఉత్తర్వులు జారీచేశారు. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు సెలవు ఇవ్వని పక్షంలో కార్మిక, ఎన్నికల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు.

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సెలవులు

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఏవైనా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల భవనాల్లో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆయా కార్యాలయాలు, సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులను ప్రకటించే అధికారాన్ని స్థానిక జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. నవంబర్ 29న పోలింగ్‌కు ముందు రోజు, 30న పోలింగ్ రోజు, డిసెంబర్ 3న కౌంటింగ్ రోజు అక్కడి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని సూచించింది. అన్ని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ఇతర ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు గురువారం వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు సంబంధిత సంస్థల యాజమాన్యాలకు సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

క్లుప్తంగా...

గవర్నర్లకు గైడ్‌లైన్స్
అవసరమైతే జారీ చేస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు విభేదాలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ ధోరణికి అడ్డుకట్ట వేసే చర్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిమిత్తం పంపే బిల్లులను గవర్నర్లు ఎలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పరిశీలనకు నివేదించవచ్చన్న అంశంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించే విషయమై ఆలోచిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తెలిపారు. బిల్లుల ఆమోదం విషయమై కేరళ ప్రభుత్వం, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మధ్య నెలకొన్న వివాదంపై విచారణ సందర్భంగా బుధవారం ఆయన ఈ మేరకు వెల్లడించారు. సదరు బిల్లుల విషయమై సీఎం పినరయి విజయన్‌తో చర్చించాల్సిందిగా గవర్నర్‌కు సీజేఐ ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. సమస్య పరిష్కారానికి ఇది దోహద పడగలదని ఆశాభావం వెలిబుచ్చింది. ''లేదంటే న్యాయస్థానమే దీనిపై స్పష్టమైన చట్టం రూపొందించే అంశాన్ని పరిశీలిస్తాం'' అని సీజేఐ స్పష్టం చేశారు. 8 బిల్లుల్లో ఏడింటిని రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ నివేదించడం, కేరళ సర్కారు దాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయడం తెలిసిందే.

కేంద్రానికి ఆ అధికారముంది
ఢిల్లీ సీఎస్ పదవీకాలం పొడిగింపుపై సుప్రీం

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. దీంట్లో చట్టవిరుద్ధమైన అంశాలేవీ తమకు కన్పించడం లేదని పేర్కొంది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. దాంతో అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. నవంబర్ 30తో ముగియనున్న నరేశ్‌కుమార్ పదవీకాలాన్ని ఆర్నెల్లు పొడిగిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆప్ సర్కారు తీవ్రంగా తప్పుబడుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

సిరియన్ గోలాన్‌పై ఐరాస తీర్మానానికి భారత్ మద్దతు

ఐరాస: వాయవ్య సిరియాలోని సిరియన్ గోలాన్ ప్రాంతం నుంచి ఇజ్రాయెల్ వెనక్కు వెళ్లకపోవడంపై భారత్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మంగళవారం ఆమోదించిన తీర్మానానికి మద్దతు తెలిపింది. దీన్ని ఈజిప్ట్ ప్రతిపాదించగా భారత్‌తో పాటు మొత్తం 91 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. 8 దేశాలు వ్యతిరేకించగా 62 దేశాలు దూరంగా ఉన్నాయి. ఆ ప్రాంతం 1967 నుంచి ఇజ్రాయెల్ ఆక్రమణలోనే ఉంది. పైగా 1981 నాటి ఐరాస తీర్మానానికి విరుద్ధంగా ఆ ప్రాంతంలో సెటిల్మెంట్లు తదితరాలను నిర్మిస్తూ వస్తోంది.

ప్రిడేటర్ ఒప్పందం ప్రయోజనకరం: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికాతో కుదుర్చుకున్న ఎంక్యూ9బి పైలట్‌రహిత విమానాలు, ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు ఒప్పందం భారత్‌కు ఎంతో ప్రయోజనకరమని రక్షణ శాఖ పేర్కొంది. ఈ విషయంలో అమెరికా తాలూకు సాంకేతిక, క్షేత్రస్థాయి నైపుణ్యంతో మన సైనిక దళాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది. ఈ సాంకేతికత మనకు అందుబాటులో లేకపోవడం వల్లే అమెరికా నుంచి తీసుకుంటున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ''అంతర్జాతీయంగా కుదిరిన ఇలాంటి ఒప్పందాలన్నింట్లోనూ ఇది అత్యంత మేలురకమైనదే గాక అతి చవకైనది. ఒప్పందంలో భాగంగా మనకు విమానాలతో పాటు సెన్సర్లు, ఆయుధాలు, గ్రౌండ్‌కంట్రోల్ స్టేషన్లు, శాటిలైట్ అండ్ సి బ్యాండ్ గ్రౌండ్ డేటా టెర్మినళ్లు, తదితరాలన్నీ అందనున్నాయి. బ్రిటన్ కుదుర్చుకున్న ఇలాంటి ఒప్పందంలో భాగంగా దానికి కేవలం విమానాలు మాత్రమే అందనున్నాయి. పైగా మనతో పోలిస్తే ఖరీదైనది కూడా'' అని వివరించింది.

కుటుంబీకులనే కాల్చేశాడు
అమెరికాలో గుజరాతీ యువకుని అరెస్టు

న్యూయార్క్: అమెరికాలో ఓం బ్రహ్మభట్ అనే ఓ 23 ఏళ్ల గుజరాతీ ఘోరానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్‌లో హ్యాండ్‌గన్ కొనుగోలు చేసి మరీ సొంత తాతయ్య, నాయనమ్మ, బాబాయిలను కాల్చి చంపాడు! న్యూజెర్సీలోని సౌత్ ప్లెయిన్‌ఫీల్డ్ ప్రాంతంలో సోమవారం ఈ దారుణం జరిగింది. వాళ్ల ఇంటినుంచి పేలుళ్లు వినిపిస్తున్నాయంటూ సోమవారం ఉదయం పొరుగువాళ్లు ఫిర్యాదు చేశారు. దిలీప్‌కుమార్ బ్రహ్మభట్ (72), బిందూ బ్రహ్మభట్ (72) దంపతులతో పాటు వారి కుమారుడు యశ్‌కుమార్ బ్రహ్మభట్ (38) తూటా గాయాలతో కుప్పకూలి కనిపించినట్టు పోలీసులు తెలిపారు. దంపతులిద్దరూ అప్పటికే మరణించగా తీవ్రగా గాయపడ్డ యశ్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచినట్టు చెప్పారు. ఓంను అరెస్టు చేశారు.

దంపతుల పోట్లాట దెబ్బకు... దారి మళ్లిన విమానం!

న్యూఢిల్లీ: భార్యాభర్తల గొడవలంటే ఏ స్థాయిలో ఉంటాయో చెప్పనక్కర్లేదు. అయితే ఆ గొడవ దెబ్బకు బుధవారం ఏకంగా ఓ అంతర్జాతీయ విమానాన్నే దారి మళ్లించాల్సి వచ్చింది! మ్యూనిచ్ నుంచి బ్యాంకాక్ వెళ్తున్న జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం ఈ ఘటనకు వేదికైంది. విమానం మ్యూనిచ్ నుంచి బయల్దేరిన కాసేపటికే అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు గొడవ పడ్డారు. భర్తది జర్మనీ కాగా భార్యది థాయ్‌లాండ్. భార్య ఫిర్యాదుతో విమానాన్ని పైలట్ ఢిల్లీ మళ్లించి భర్తను పోలీసులకు అప్పగించారు. అయితే, క్షమాపణలు చెప్పడంతో అతన్ని మరో విమానంలో బ్యాంకాక్ పంపడం కొసమెరుపు!

పీడకల... అగ్నిపరీక్ష

సిల్‌క్యారా సొరంగం అనుభవాలను మీడియాతో పంచుకున్న కార్మికులు


- మొదట ప్రాణాలపై పూర్తిగా ఆశలు వదులుకున్నాం..
- అయినా ధైర్యం కూడదీసుకున్నాం
- రాళ్ల సందుల నుంచి జారిన నీటి చుక్కలు చప్పరించాం.
- బొరుగులతో కడుపు నింపుకున్నాం. అర్ధాకలితో గడిపాం..
- కాలక్షేపం కోసం పేకాట ఆడాం.. కాగితాలు చింపి విసురుకున్నాం
- సాక్సులను బంతులుగా చేసి, చోర్–సిపాయి ఆట ఆడాం, పాటలు పాడుకున్నాం
- భగవంతుడు ఎట్టకేలకు మా ప్రార్థనలు ఆలకించాడు..

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకొని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికిన 41 మంది కార్మికులు 17 రోజుల తర్వాత మంగళవారం రాత్రి క్షేమంగా బయటకు వచ్చారు. సొరంగంలో తమకు ఎదురైన భయానక అనుభవాలు, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ప్రాణాలు నిలబెట్టుకున్న తీరును పలువురు కార్మికులు బుధవారం మీడియాతో పంచుకున్నారు. సొరంగంలో తామంతా కష్టసుఖాలు కలబోసుకున్నామని, మిత్రులుగా మారామని చెప్పారు. ఆడిన ఆటలు, పాడుకున్న పాటల గురించి తెలియజేశారు. సొరంగంలో చిక్కుకున్నప్పుడు ప్రాణాలపై ఆశలు వదులుకున్నామని జార్ఖండ్‌లోని ఖిరాబేడా గ్రామానికి చెందిన అనిల్ బేడియా(22) అనే కార్మికుడు వెల్లడించాడు. ''నవంబర్ 12న సొరంగంలో మేము పనిలో ఉండగా, హఠాత్తుగా కొంత భాగం కూలిపోయింది. భారీ శబ్దాలు వినిపించాయి. మేమంతా లోపలే ఉండిపోయాం. బయటకు వచ్చే దారి కనిపించలేదు. ఎటు చూసినా చిమ్మచీకటి. అక్కడే సమాధి కావడం తథ్యమని అనుకున్నాం. మొదటి రెండు రోజులపాటు బతుకుతామన్న ఆశ లేకుండాపోయింది. క్రమంగా ధైర్యం కూడదీసుకున్నాం. బయట పడడానికి ప్రాధాన్యం ఇవ్వకుండా ముందు ఎలాగైనా ప్రాణాలు రక్షించుకోవాలని నిర్ణయించుకున్నాం. నిజంగా అదొక పీడ కల, అగ్ని పరీక్ష. సొరంగం పైభాగంలోని రాళ్ల సందుల నుంచి పడుతున్న ఒక్కో చుక్క నీటిని ఒడిసిపట్టుకొని చప్పరించాం. మా దగ్గరున్న బొరుగులతో 10 రోజులపాటు కడుపు నింపుకున్నాం. అర్ధాకలితో గడిపాం. ఆ తర్వాత అధికారులు పైపు గుండా పండ్లు, భోజనం, నీళ్ల సీసాలు మాకు అందించారు. ప్రమాదం జరిగాక 70 గంటల తర్వాత అధికారులు మాతో మాట్లాడారు. అప్పుడే ప్రాణాలపై మాలో ఆశలు మొదలయ్యాయి. మేమంతా కలిసి నిత్యం దేవుడిని ప్రార్థించేవాళ్లం. చివరకు దేవుడు మా ప్రార్థనలు ఆలకించాడు.



తల్లిదండ్రుల ఫొటో చూస్తూ కాలం గడిపా..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖీంపూర్ ఖేరీ జిల్లా భైరాంపూర్‌కు చెందిన 25 ఏళ్ల మంజీత్ చౌహాన్ సిల్‌క్యారా టన్నెల్‌లో చిక్కుకొని, 17 రోజుల తర్వాత బయటకు వచ్చాడు. అతడి రాకతో స్వగ్రామంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. మంజీత్ తల్లిదండ్రులు భైరాంపూర్‌లో ఉంటున్నారు. అతడి సోదరుడు గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తల్లిదండ్రుల ఫొటో మంజీత్ వద్ద ఉంది. ఆ ఫొటో చూస్తూ ధైర్యం తెచ్చుకొని సొరంగంలో కాలం గడిపానని, ఒత్తిడిని అధిగమించానని చెప్పాడు. ''సొరంగం లోపలిభాగం కూలిన సమయంలో అక్కడికి కేవలం 15 మీటర్ల దూరంలోనే పని చేస్తున్నాను. తొలుత అసలేం జరిగిందో అర్థం కాలేదు. క్రమంగా అది పీడ కలగా మారింది. ప్రమాదం జరిగాక మొదటి 24 గంటలు చాలా కష్టంగా గడిచాయి. మేమంతా భయందోళనకు గురయ్యాం. ఆకలి, దాహం, నీరసం, నిరాశ వంటివి అన్నీ ఒక్కసారిగా గుర్తొచ్చాయి. నాలుగు అంగుళాల పైపు గుండా అధికారులు ఆహారం, నీరు పంపించిన తర్వాత మా మానసిక స్థితి మారింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలియడంతో మాలో మనోధైర్యం పెరిగింది. కుటుంబ సభ్యులతో మాట్లాడగలిగాం. అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని నాన్నకు చెప్పా. ఫోన్ వాల్‌పేపర్‌లో నా తల్లిదండ్రుల ఫొటో చూస్తూ ఉండిపోయేవాడిని. ప్రాణాలపై ఆశ కోల్పోకుండా అది ఉపయోగపడింది. సొరంగంలో అటూ ఇటూ నడుస్తూ ఉండేవాళ్లం. పైపు గుండా అధికారులు పంపించిన పప్పు నాకెంతో నచ్చింది. సొరంగంలో చిక్కుకున్న మేమంతా ఒకరికొకరం మంచి మిత్రులుగా మారిపోయాం. మా కష్ట సుఖాలు తెలియజేసుకున్నాం. క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ చూడలేకపోవడం పట్ల విచారంగా ఉంది. ఇంటికెళ్లిన తర్వాత మ్యాచ్ హైలైట్స్ చూస్తా'' అని మంజీత్ చౌహాన్ ఉత్సాహంగా చెప్పాడు.



కార్మికుల గ్రామాల్లో సంబరాలు



ఖిరాబేడా గ్రామం నుంచి మొత్తం 13 మంది యువకులు సొరంగం పనుల కోసం ఉత్తరకాశీకి చేరుకున్నారు. అదృష్టం ఏమిటంటే వారిలో ముగ్గురు మాత్రమే సొరంగంలో చిక్కుకున్నారు. బాధితులుగా మారిన మొత్తం 41 మంది కార్మికుల్లో 15 మంది జార్ఖండ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారే కావడం గమనార్హం. ఖిరాబేడాలో అనిల్ బేడియా తల్లి 17 రోజులపాటు తల్లడిల్లిపోయింది. కుమారుడు జాడ తెలియక ఆందోళనకు గురైంది. ఇంట్లో వంట చేసింది లేదు. ఇరుగు పొరుగు అందించిన భోజనంతో కడుపు నింపుకుంది. ఎట్టకేలకు కుమారుడు అనిల్ బేడియా సొరంగం నుంచి బయటకు రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇదే గ్రామానికి చెందిన శ్రవణ్ బేడియా(55)కు పక్షవాతం. ఏకైక కుమారుడు రాజేంద్ర సొరంగం నుంచి బయట పడడంతో అతని ఇంట సంబరాలు అంబరాన్ని తాకాయి.

మొదట్లో కష్టంగా గడిచింది

సొరంగంలో తాము చిక్కుకున్నట్లు తెలియగానే ఆందోళనకు గురయ్యామని ఉత్తరాఖండ్‌లోని చంపావత్ గ్రామానికి చెందిన పుష్కర్‌సింగ్ ఐరే అనే కార్మికుడు చెప్పాడు. మొదట్లో చాలా కష్టంగా గడిచిందని, చనిపోతామని అనుకున్నామని, క్రమంగా అక్కడి పరిస్థితులకు అలవాటు పడ్డామని తెలిపాడు. తొలుత సరైన ఆహారం లేదు, బయటున్నవారితో మాట్లాడే వీలు లేదని అన్నాడు. ఒంటిపై ఉన్న బట్టలతోనే 17 రోజులపాటు ఉండాల్సి వచ్చిందని, స్నానం చేయలేదని, సొరంగం లోపలంతా అపరిశుభ్రంగా మారిందని తెలియజేశాడు. ప్లాస్టిక్ షీట్లపై నిద్రించామని పేర్కొన్నాడు. ఆహారం, నీరు అందిన తర్వాత ఊపిరి పీల్చుకున్నామని చెప్పాడు. కాలక్షేపం కోసం పేకాడామని, కాగితాలను క్రమపద్ధతిలో చింపుతూ ఉండేవాళ్లమని వివరించాడు. సాక్సులతో బంతులు చేసి, చోర్–సిపాయి ఆట ఆడామని, పాటలు పాడుకున్నాం తెలిపాడు.

నిత్యం యోగా, వాకింగ్ చేశాం..

సొరంగం నుంచి బయటకు వచ్చిన 41 మంది కార్మికులతో మంగళవారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్ ద్వారా మాట్లాడారు. వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. సొరంగంలో ఉన్నప్పుడు నిత్యం యోగా, వాకింగ్ చేశామని, తద్వారా మనోస్థైర్యం సడలకుండా జాగ్రత్తపడ్డామని, ఆత్మవిశ్వాసం పెంచుకున్నామని ప్రధానమంత్రికి కార్మికులు తెలియజేశారు. విదేశాల్లో ఉన్న భారతీయులు ప్రమాదాల్లో చిక్కుకుంటే మన ప్రభుత్వం కాపాడిందని, స్వదేశంలోనే ఉన్న తామెందుకు భయపడాలని భావించామని అన్నారు.

రిషికేశ్ ఎయిమ్స్‌కు కార్మికుల తరలింపు

సిల్‌క్యారా టన్నెల్ నుంచి బయటకు వచ్చిన కార్మికులను బుధవారం రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు హెలికాప్టర్‌లో తరలించారు. డిజాస్టర్ వార్డులో చేర్చి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మానసిక పరిస్థితి కూడా పరీక్షిస్తామని, అవసరమైన వారికి తగిన చికిత్స అందిస్తామని ఎయిమ్స్ వైద్యులు చెప్పారు. ఆరోగ్యం కుదుటపడిన వారిని ఇళ్లకు పంపిస్తామని వెల్లడించారు. కార్మికుల కుటుంబ సభ్యులు, బంధులను కూడా సిల్‌క్యారా నుంచి బస్సుల్లో ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు.

సొరంగం పనులు కొనసాగుతాయి

ఉత్తరాఖండ్‌లో 4.5 కిలోమీటర్ల పొడవైన సిల్‌క్యారా సొరంగం పనులు కొనసాగుతాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. కూలిపోయిన ప్రాంతంలో మరమ్మతులు, సేఫ్టీ ఆడిట్ ముగిసిన తర్వాత పనులు యథావిధిగా కొనసాగించనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 900 కిలోమీటర్ల 'చార్‌ధామ్ యాత్ర ఆల్ వెదర్ రోడ్' ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా టన్నెల్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చార్‌ధామ్‌లో భాగమైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్రాలను అనుసంధానించడానికి కేంద్రం రూ.12,000 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో నాలుగు క్షేత్రాలను చుట్టిరావడానికి వీలుగా ప్రాజెక్టును రూపొందించారు. నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2016 డిసెంబర్ 27న శంకుస్థాపన చేశారు. వాస్తవానికి 2020 మార్చి లోగా ప్రాజెక్టు పూర్తికావాలి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో జాప్యం జరుగుతోంది.

కేబినెట్ భేటీలో మోదీ భావోద్వేగం

సిల్‌క్యారా సొరంగంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినెట్ మంగళవారం రాత్రి సమావేశమైంది. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను తలచుకొని ప్రధానమంత్రి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారని కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం చెప్పారు. కార్మికులను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. సహాయక చర్యలపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు స్వయంగా ఆరా తీశారని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. దేశ విదేశాల్లోని భారతీయులను కాపాడడం ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు.

ప్రశంసలందుకున్న నాగపూర్ నిపుణుల సేవలు

సిల్‌క్యారా సొరంగంలో సహాయక చర్యల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు పాల్గొన్నాయి. నిపుణులు తమవంతు సేవలందించారు. కార్మికులకు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది లేకుండా, కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరగకుండా వీరు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ డబ్ల్యూసీఎల్‌కు నిపుణులు సొరంగం వద్దే మకాం వేశారు. భారీ యంత్రాలతో తవ్వకం పనులు చేపట్టడంతో సొరంగం లోపల కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరుగుతుండేవి. ప్రమాదకర స్థాయికి చేరగానే యంత్రాలను ఆపించేవారు. వారి సేవలు ప్రశంసలందుకున్నాయి.

సొరంగంలో కార్మికులు భుజాలపై ఎత్తుకున్నారు

ర్యాట్ హోల్ మైనింగ్ నిపుణుల్లో ఢిల్లీకి చెందిన ఫిరోజ్ ఖురేషీ, యూపీకి చెందిన మోను కూమార్ తొలుత సొరంగంలోని కార్మికుల వద్దకు చేరుకున్నారు. తమను చూడగానే కార్మికులు ఆనందంతో భుజాలపై ఎత్తుకున్నారని ఫిరోజ్ వెల్లడించాడు. ''మాకు పండ్లిచ్చారు. పేర్లు అడిగారు. అరగంట పాటు సొరంగంలో ఉన్నాం'' అని మోను కూమార్ చెప్పాడు. తాము కార్మికుల వద్దకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం వచ్చారని పేర్కొన్నాడు. కార్మికులను కాపాడినందుకు తాము డబ్బులేమీ తీసుకోలేదని తెలియజేశాడు.



కార్మికులను క్షేమంగా బయటికి తీసుకొచ్చిన ర్యాట్ హోల్ మైనింగ్ నిపుణులు వీరే

అమెరికాలోనే హెచ్‌–1బీ వీసాల రెన్యూవల్



వాషింగ్టన్: అమెరికాలో హెచ్‌–1బీ వీసాలతో ఉద్యోగాలు చేసుకుంటున్న విదేశీయులకు అమెరికా స్టేట్ ఫర్ వీసా సర్వీసెస్ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీ జూలీ స్టఫ్ట్ శుభవార్త చెప్పారు. హెచ్‌–1బీ వీసాల రెన్యూవల్ (స్టాంపింగ్) కోసం స్వదేశానికి వెళ్లాల్సిన అవసరం లేదని, అమెరికాలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబర్ నుంచి మూడు నెలలపాటు ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కొన్ని కేటగిరీల్లో హెచ్‌–1బీ వీసాలకు డొమెస్టిక్ రెన్యూవల్ ప్రక్రియ డిసెంబర్ నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అమెరికాలో పెద్ద సంఖ్యలో భారత ఐటీ నిపుణులు హెచ్‌–1బీ వీసాలతో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. తాజా నిర్ణయంతో వీరికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వ్యయ ప్రయాసలు తప్పుతాయి. అయితే, తొలి దశలో 20,000 మందికే ఈ వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత దశల వారీగా మరికొంతమందికి అవకాశం కల్పిస్తారు. డిసెంబర్ నుంచి మూడు నెలల్లోగా హెచ్‌–1బీ వీసా గడువు ముగిసేవారు వీసా రెన్యూవల్ (స్టాంపింగ్)ను అమెరికాలోనే చేసుకోవచ్చు. అమెరికా వీసాలకు భారత్‌లో భారీ డిమాండ్ ఉందని జూలీ స్టఫ్ట్ గుర్తుచేశారు. వీసా కోసం కొన్ని సందర్భాల్లో ఏడాదిపాటు ఎదురుచూడాల్సి వస్తోందని చెప్పారు. భారతీయులకు సాధ్యమైనంత త్వరగా వీసా అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని భావిస్తున్నామని వివరించారు. ఇందులో ఒక మార్గంగా డొమెస్టిక్ వీసా రెన్యూవల్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. దీనివల్ల భారతీయ టెకీలకు లబ్ధి కలుగుతుందన్నారు

మనవారికి 1.4 లక్షల వీసాలు

2022లో భారత విద్యార్థులకు రికార్డు స్థాయిలో 1.4 లక్షలకుపైగా వీసాలు జారీ చేసినట్లు స్టఫ్ట్ వెల్లడించారు. అమెరికా వర్సిటీల్లో తరగతుల ప్రారంభానికి ముందే భారత్‌లో స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలు పూర్తి చేయడానికి సిబ్బంది కొన్నిసార్లు వారమంతా పనిచేస్తున్నారని తెలిపారు.

వామ్మో తెలుగు అనువాదం!

తెలంగాణలో తన ప్రసంగాలపై రాహుల్ గాంధీ హాస్యోక్తులు



కోజికోడ్: తెలంగాణలో ఎన్నికల ప్రచార సభల్లో తన ప్రసంగాల అనువాదం సందర్భంగా చిత్రమైన సమస్యలు ఎదుర్కొన్నట్టు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. తెలంగాణలో నెల రోజులకు పైగా హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెర పడటం తెలిసిందే. బుధవారం కేరళలోని కోజికోడ్‌లో రాహుల్ ఓ పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. ఆయన ప్రసంగాన్ని ప్రముఖ ఉపన్యాసకుడు, ఐయూఎంఎల్ ఎంపీ అబుస్సమద్ సమాధానీ మలయాళంలోకి అనువదించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో తనకెదురైన అనుభవాలను రాహుల్ గుర్తు చేసుకున్నారు. ''ఒక ప్రచార సభలో నా ప్రసంగాన్ని అనువదిస్తున్న వ్యక్తి ఎందుకోగానీ చాలాసార్లు ఇబ్బంది పడ్డాడు. నేనొకటి చెబుతుంటే ఆయన మరొకటి చెప్పసాగాడు. ఇక అలా కాదని నేను మాట్లాడిన పదాలు లెక్కబెట్టడం మొదలు పెట్టా. నేను హిందీలో ఐదు పదాలు మాట్లాడినప్పుడు తెలుగులో ఏడెనిమిది పదాలతో ముగిస్తాడని చూశా. కానీ ఆయన ఏకంగా 20 నుంచి 30 పదాలు మాట్లాడాడు. పైగా నేను బోరు కొట్టే విషయాలు మాట్లాడినప్పుడేమో జనం పరమోత్సాహంతో గట్టిగా చప్పట్లు కొట్టారు. మాంచి ఉత్సాహపూరితమైన ముచ్చట్లు చెప్పినప్పుడేమో అందరూ పూర్తి నిశ్శబ్దంగా ఉన్నారు. అంతా అనువాద మహిమ!'' అంటూ వాపోయారు. ''అంతా అలా ఉల్టాపల్టాగా నడిచింది. అయినా సరే, నేను ఎవరిపైనా కోపగించుకోలేని పరిస్థితి! పైగా ప్రసంగం సాగినంతసేపూ నిండుగా నవ్వుతూనే ఉండాలి'' అని చెప్పుకొచ్చారు. బహుశా తన ప్రసంగాలకు అనువాదకునిగా ఉండటం ప్రమాదకరమైన పనేనంటూ రాహుల్ చమత్కరించడంతో అంతా నవ్వుకున్నారు.

చిరిగిన దుస్తుల మాటున సంపద దాస్తున్న నేతలు

రాజకీయ నాయకుల నిరాడంబర వస్త్ర శైలిని బట్టి వారిని అంచనా వేయకూడదని రాహుల్ అభిప్రాయపడ్డారు. నేటి నాయకులు తాము చూపించదలచింది మాత్రమే ప్రజలకు చూపిస్తుంటారని అన్నారు. ''నన్ను కలవడానికి ఎందరో నాయకులు వస్తుంటారు. సాదాసీదా బట్టలు, చిరిగిన బూట్లతో కనిపిస్తారు. కానీ వాళ్లింటికి వెళ్తే పోర్టికోలో ఖరీదైన బీఎండబ్ల్యూ కార్లుంటాయి. వాళ్ల పిల్లలు అతి ఖరీదైన జీవితం గడుపుతూ కన్పిస్తారు. కనుక ఒక రాజకీయ నాయకుని ఆర్థిక స్థితిని సరిగా అంచనా వేయాలంటే అతని పిల్లలను గమనిస్తే చాలు. 18 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను కనిపెట్టిన తిరుగులేని సూత్రమిది'' అని చెప్పారు.



బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జీవిత చరిత్రను ఆవిష్కరిస్తున్న పార్టీ అగ్ర నేత సోనియాగాంధీ

'సీఏఏ అమలు ఖాయం'

కోల్‌కతా: దేశంలో పౌరసత్వ (సవరణ) చట్టం–సీఏఏ అమలును ఎవరూ అడ్డుకోలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన కోల్‌కతాలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన భారీ ర్యాలీలో మాట్లాడారు. సీఏఏను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం తెలిసిందే. బెంగాల్లోకి విదేశీయుల చొరబాట్లకు మమత దన్నుగా ఉండటమే అందుకు కారణమని షా ఆరోపించారు. రాష్ట్రాన్ని తృణమూల్ సర్కారు సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. ''ప్రభుత్వం నిండా అవినీతిలో మునిగిపోయింది. మమత హయాంలో రాష్ట్రంలో రాజకీయ హింస, ముస్లిం సంతుష్టీకరణ చర్యలు పరాకాష్టకు చేరాయి'' అని ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మమత సర్కారును సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ''2024 లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్లో బీజేపీకి అత్యధిక సీట్లు కట్టబెట్టి మమత సర్కారు పతనానికి రంగం సిద్ధం చేయండి. మోదీ కూడా బెంగాల్ ప్రజల వల్లే నేను మూడోసారి ప్రధాని అయ్యాను అని చెప్పుకునే స్థాయిలో రాష్ట్రంలో బీజేపీని ఘనంగా గెలిపించండి'' అని కోరారు.

ఉచిత రేషన్ మరో ఐదేళ్లు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపించిన వేళ కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 81.35 కోట్ల మంది పేదలకు నెలకు 5 కిలోల మేరకు ఉచిత రేషన్ అందిస్తున్న ఆహార ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)ను మరో ఐదేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే దేశవ్యాప్తంగా 15 వేల మహిళా స్వయం సహాయ బృందాలకు డ్రోన్లు అందజేయాలని కూడా నిర్ణయించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తాలూకు ప్రయోజనాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే దీని లక్ష్యమని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఈ పథకాన్ని రెండేళ్ల పాటు కొనసాగిస్తాం. మహిళా సంఘాలకు డ్రోన్ల కొనుగోలు వ్యయంలో 80 శాతం దాకా ఆర్థిక సాయం అందిస్తాం. ఇందుకు ఏటా రూ.1,261 కోట్లు కేటాయిస్తున్నాం. మిగతా మొత్తాన్ని రుణంగా తీసుకునే అవకాశం కల్పిస్తాం. ఈ డ్రోన్లను వ్యవసాయ సేవల నిమిత్తం రైతులకు మహిళా సంఘాలు అద్దెకిస్తాయి. తద్వారా ఒక్కో సంఘం ఏటా కనీసం రూ.లక్షకు పైగా ఆదాయం పొందవచ్చు'' అని వివరించారు. మహిళా సంఘాలకు డ్రోన్లు అందజేస్తామని ఆగస్టు 15 ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రకటించడం తెలిసిందే. ఇక పీఎంజీకేఏవైను మరో ఐదేళ్లు కొనసాగించేందుకు రూ.11.8 లక్షల కోట్లు అవసరమని మంత్రి వివరించారు. కరోనా నేపథ్యంలో 2020లో కేంద్రం ఈ పథకాన్ని మొదలు పెట్టడం తెలిసిందే. 2026 నుంచి ఐదేళ్ల పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ శాతం తదితరాలపై సలహాలు, సూచనలకు ఏర్పాటు చేయనున్న 16వ ఆర్థిక సంఘం తాలూకు విధి విధానాలకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కమిషన్ 2025 అక్టోబర్ అంతానికల్లా నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌కు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 10.45 కోట్లు గిరిజన జనాభా ఉంది. అందులో 18 రాష్ట్రాలు, అండమాన్ నికోబార్‌లోని 75 గిరిజన సమూహాలను ప్రమాదంలో ఉన్నవిగా గుర్తించారు. దేశవ్యాప్తంగా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాన్ని మూడేళ్లు కొనసాగించేందుకు కూడా కేబినెట్ నిర్ణయించింది.

మణిపూర్లో శాంతి ఒప్పందం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో వేర్పాటువాద హింసకు అడ్డుకట్ట వేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ మిలిటెంట్ సంస్థ యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్ఎల్ఎఫ్) బుధవారం కేంద్రంతో చరిత్రాత్మక శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం కింద యూఎన్ఎల్ఎఫ్‌పై కేంద్రం నిషేధం విధించిన కొద్ది రోజులకే ఈ పరిణామం జరగడం విశేషం. ఒప్పందం ప్రకారం దేశ చట్టాలను గౌరవించేందుకు, జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు యూఎన్ఎల్ఎఫ్ నేతలు అంగీకరించారు. మణిపూర్‌కు చెందిన ఒక సాయుధ వేర్పాటువాద సంస్థ కేంద్రంతో ఇలాంటి ఒప్పందానికి రావడం ఇదే తొలిసారి. దీన్ని చరిత్రాత్మక మైలురాయిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించారు. ఈశాన్యంతో శాశ్వత శాంతి స్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న నిరంతర కృషికి ఇది ఫలితమన్నారు. యూఎన్ఎల్ఎఫ్‌ను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ఇతర సాయుధ సంస్థలు కూడా యూఎన్ఎల్ఎఫ్ బాటను అనుసరిస్తాయని భావిస్తున్నారు. జాతుల హింసతో కొన్ని నెలలుగా మణిపూర్ అట్టుడుకుతుండటం తెలిసిందే.

క్లుప్తంగా...

బీజేపీ అధికార ప్రతినిధిగా బండారు విజయలక్ష్మి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి ని కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. బీజేపీ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమైన విజయలక్ష్మి ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ పటిష్టతకు కృషిచేస్తారని ఆశిస్తున్నట్లు నియామక లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ (ఈసీఈ) పట్టభద్రురాలు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నుంచి ఎంబీఏ పట్టా పొందిన విజయలక్ష్మి 2020 నుంచి 'అలయ్ బలయ్'ఫౌండేషన్ చైర్ పర్సన్‌గా ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదేళ్లుగా బీజేపీలో విజయలక్ష్మి క్రియాశీల సభ్యురాలిగా కొనసాగుతున్నారు. 2019 బీజేపీ సభ్యత్వ డ్రైవ్ సందర్భంగా సమాజంలోని వివిధ వర్గాల నుంచి ఐదువేల మంది కంటే ఎక్కువ సభ్యులను నమోదు చేశారు. విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, నిరుద్యోగ యువతకు సహాయం, అవసరమైన వారికి వైద్య సహాయం అందించేందుకు దివంగత సోదరుడు వైష్ణవ్ బండారు స్మృత్యార్థం వీబీ ఫౌండేషన్‌ను స్థాపించి వివిధ సామాజికసేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

కమలాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిపై బుధవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ తెలిపారు. మంగళవారం కమలాపూర్ బస్టాండ్ వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో 'నన్ను గెలిపించకపోతే నా కుటుంబ సభ్యులం (భార్య, కూతురుతో సహా) ముగ్గురం ఇక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటాం. గెలిపిస్తే విజయ యాత్రకు వస్తా. లేదంటే 4న మీరే మా శవయాత్రకు రండి' అంటూ వ్యాఖ్యలు చేసి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఎన్నికల ప్రవర్తనా నియమావళి మండల అధికారి, ఎంపీడీవో గుండె బాబు కమలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కౌశిక్‌రెడ్డిపై 171సీ, 171ఎఫ్, 188, 506 ఐపీసీ, 123 ఆర్పీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కార్యకర్తలతో ఫోన్‌లో లెఫ్ట్ నేతల మంతనాలు

- ప్రచారం ముగిసినప్పటి నుంచి పర్యవేక్షణపై దృష్టి
- కొత్తగూడెంలో కూనంనేని, తెల్దార్‌పల్లిలో తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో సీపీఐ, సీపీఎంల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం అంతర్గతంగా పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలతో ఫోన్‌లో మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తమ ఓట్లను పక్కాగా వేయించుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల కార్యదర్శులు స్వయంగా పోటీలో ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కూడా పార్టీని పర్యవేక్షించాల్సిన బాధ్యత వారిపై పడింది.

కొత్తగూడెం కేంద్రంగా కూనంనేని..

కాంగ్రెస్, సీపీఎం మద్దతుతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నియోజకవర్గంలో పోటీలో ఉన్నారు. తనకు సీటు ఖరారైనప్పటి నుంచీ ఆయన నియోజకవర్గంలోనే తీరికలేకుండా ప్రచారంలో ఉండిపోయారు. ప్రచారం ముగిసిన తర్వాత బుధవారంనాడంతా ఆయన కొత్తగూడెంలోనే ఉండి పర్యవేక్షణపైనే దృష్టిసారించారు. మంగళవారం కూడా ప్రచారం ముగిసిన వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. గడిచిన రెండు వారాలుగా జరుగుతున్న ప్రచార తీరు తెన్నులను బేరీజు వేసుకుంటున్నారు. ప్రతీ బూత్ మీద ప్ర త్యేక శ్రద్ధ పెడుతున్నారు. ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలతో సమన్వయం చేసుకుంటున్నారు.

తెల్దార్‌పల్లి కేంద్రంగా తమ్మినేని వ్యూహాలు..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పొత్తు చిత్తు కావడంతో ఈ ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగా బరిలో ఉన్న విషయం తెలిసిందే. తన అభ్యర్థిత్వం ఖరారయ్యాక ఆయన పూర్తిగా పాలేరు నియోజకవర్గంపైనే దృష్టిసారించారు. బుధవారం రోజంతా తన సొంతూరు తెల్దార్‌పల్లి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావడంతో రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేస్తున్న 19 స్థానాల్లోనూ పరిస్థితిని ఆయన సమీక్షిస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో మాట్లాడుతున్నారు. మరోవైపు పాలేరులో తన గెలుపునకు ఉన్న అవకాశాలపైనా ఆయన దృష్టిసారించారు. పార్టీ గ్రామస్థాయి నాయకులతోపాటు తటస్థులైన పెద్దలతోనూ ఆయన మంతనాలు జరుపుతున్నారు.

వ్యాక్సిన్ లేని కరోనా కాంగ్రెస్: కేటీఆర్

- రైతుబంధు నిలిపి వేసి రైతులను శిక్షించడం ఎందుకు
- గతంలో గెలిచిన 88 సీట్ల కంటే ఎక్కువే గెలుస్తాం.
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్ని సీట్లూ క్లీన్ స్వీప్ చేస్తాం
- వచ్చే ప్రభుత్వంలో టూరిజం శాఖ కావాలని కోరుతా
- దీక్షా దివస్ సందర్భంగా ఉద్యమ జ్ఞాపకాల నెమరు

సాక్షి, హైదరాబాద్: 'వ్యాక్సిన్ లేని కరోనా లాంటిది కాంగ్రెస్ పార్టీ. ఉద్యోగాల నియామకంలో అవాస్తవాలు ప్రచారం చేసింది. 'థాట్ పోలీసింగ్'(ఓటరుపై తమ పార్టీ వైఖరిని బలవంతంగా రుద్దడం) అనే యుద్ధ నీతిని కాంగ్రెస్ ఎంచుకుంది. కాంగ్రెస్ వ్యూహకర్తలు ప్రాపగాండ చేసిన తరహాలో క్షేత్రస్థాయిలో పరిస్థితి లేదు. కొంత మంది అసంతృప్త యువత మినహా మిగతా వర్గాలన్నీ మాతోనే ఉన్నాయి'అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ అధ్యక్షులు, సీఎం కె.చంద్రశేఖర్‌రావు 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం తెలంగాణ భవన్‌లో 'దీక్షా దివస్'నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన రక్తదాన శిబిరం ప్రారంభించిన అనంతరం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 'ఈ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ లోపాయికారీగా కలిసి పోయాయని చెప్పేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. నాంపల్లిలో రోడ్‌షో చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పొరుగునే ఉన్న గోషామహల్‌కు వెళ్లకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో చెప్పాలి. కరీంనగర్, కోరుట్లలో కాంగ్రెస్ నేతలు ఎందుకు ప్రచారం చేయలేదు'అని ప్రశ్నించారు.



గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ గాలి

'బీఆర్‌ఎస్ పార్టీ గతంలో గెలవని ములుగు, హుజూరాబాద్, గోషామహల్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని స్థానాలను క్లీన్‌స్వీప్ చేస్తాం. హైదరాబాద్‌లో ప్రస్తుతం బీఆర్‌ఎస్ గాలి వీస్తోంది. విపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగు, హుజూరాబాద్, గోషామహల్ తదితర చోట్ల గెలుస్తాం. రంగారెడ్డిలో రెండు మూడు చోట్ల గట్టి పోటీ ఉంది. కాంగ్రెస్‌లో ఆఫీసులో తయారవుతున్న సర్వేలను పక్కన పెడితే గతంలో గెలిచిన 88 సీట్ల కంటే ఎక్కువే గెలుస్తాం. సాధారణ ప్రజలను తక్కువ అంచనా వేయొద్దు. రేవంత్‌రెడ్డి అటు కొడంగల్, ఇటు కామారెడ్డిలో రెండో చోట్లా ఓడిపోతారు. సర్పంచ్‌లు మొదలుకుని ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేసేందుకు రేవంత్ భారీగా డబ్బులు వెదజల్లుతున్నారు. రేవంత్ రెడ్డి సోదరుడు స్వతంత్ర అభ్యర్థి పోలింగ్ ఏజెంట్ అని చెప్పుకుంటూ కామారెడ్డిలో మకాం వేశారు.''అని ఆరోపించారు. ''కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలన్నదే ఈ ఎన్నిక. ప్రభుత్వ వ్యతిరేక ఓటు 49శాతం దాటకుంటే మేము విజయం సాధించినట్లే కదా. కేవలం 39 శాతం ఓట్లతోనే మోదీ దేశ ప్రధాని అయ్యారు'అని కేటీఆర్ గుర్తు చేశారు.

హరీశ్ నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసు ఇవ్వాల్సింది

'కాంగ్రెస్ ఫిర్యాదుతోనే రైతు బంధు ఆగింది. ఉత్తమ్ ఢిల్లీకి వెళ్లి పిర్యాదు చేస్తే, రేవంత్ నవంబర్ 25న లేఖ రాశారు. 11 సార్లు రైతుబంధు పంపిణీ చేశాం. కొత్త పథకం కానప్పుడు నిలిపివేయడం ఎందుకు. పీఎం కిసాన్ పథకం నిధులు జమ చేస్తే కాంగ్రెస్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదు. రైతుబంధు పథకం విషయంలో మంత్రి హరీశ్‌రావు నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయనకు నోటీసు జారీ చేసి సంజాయిషీ అడగాలి. రైతుబంధును నిలిపివేసి రైతులను శిక్షించడం ఎందుకు. ఈసీ నిర్ణయాన్ని ఎత్తి చూపించడం మాత్రమే మా ఉద్దేశం. కేసీఆర్ ఉన్నంత వరకు రైతుబంధు పథకం అమలవుతుంది. డిసెంబర్ 5 తర్వాత మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే కాబట్టి వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తాం. డిసెంబర్ 9న తెలంగాణపై ప్రకటన వచ్చిన రోజును గుర్తు చేసుకుంటూ వివిధ కార్యక్రమాలు ఉంటాయి. వచ్చే ప్రభుత్వంలో టూరిజం శాఖను తీసుకుని రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని ఉంది'అని కేటీఆర్ పేర్కొన్నారు.

స్టీఫెన్ రవీంద్ర కొత్త చొక్కా ఇచ్చారు

దీక్షా దివస్ సందర్భంగా నవంబర్ 30 నుంచి డిసెంబర్ 9 వరకు జరిగిన ఘటనలను తలుచుకుంటూ కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. నవంబర్ 29న కేసీఆర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించడం మొదలుకుని, డిసెంబర్ 10 వరకు జరిగిన పరిణామాలు, తాను వరంగల్ జైలులో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దీక్ష సమయంలో నిమ్స్ ఆసుపత్రి వద్ద మఫ్టీలో ఉన్న ఓ పోలీసు అధికారి కేసీఆర్ ప్రాణాలకు హాని ఉందంటూ చేసిన హడావుడితో తాను, తనకు టుంబం ఆవేదన పడిన తీరును వివరించారు. కేంద్రం రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన కస రత్తు, దీక్ష విరమణ తదితర పరిణామాలను వె ల్లడించారు. ఉద్యమ సమయంలో తన చొక్కా చింపిన పోలీసు అధికారి స్టీఫెన్ రవీంద్ర తర్వాత కొత్త చొక్కా పంపిన విషయాన్ని గుర్తుకు చేసుకున్నారు.

వార్ రూం... వేదికగా

- పోల్ మేనేజ్‌మెంట్‌పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- వార్‌రూం నుంచే పరిస్థితిని సమీక్షించిన రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే
- బిర్లామందిర్, నాంపల్లి దర్గాల్లో రేవంత్ ప్రత్యేక పూజలు
- ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో నేటి పోలింగ్ ప్రక్రియకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పరిస్థితి సానుకూలంగా ఉందన్న అంచనాల నేపథ్యంలో ఆ సానుకూలతను ఓట్ల రూపంలో మార్చుకునే అంశంపై దృష్టి సారించింది. బుధవారమంతా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే గాంధీభవన్ వార్ రూం నుంచి సమీక్షించారు. ఏ నియోజకవర్గంలో ప్రచార తీరు ఎలా ఉందన్న విషయాలను తెలుసుకోవడంతోపాటు పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోల్ మేనేజ్‌మెంట్ లాంటి విషయాలపై అభ్యర్థులతోపాటు నియోజకవర్గాల పరిశీలకులు, సమన్వయకర్తలు, స్థానిక నేతలతో ఆయన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ ముగిసేంతవరకు అభ్యర్థులతో సహా కేడర్ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, ఇతర పార్టీల వ్యూహాలు, డబ్బు, మద్యం పంపిణీ లాంటి అంశాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ వర్గాలను సంప్రదించాలని సూచించారు.

పూజలు... ప్రమాణాలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ ప్రజలకు బాండ్‌పేపర్లు రాసిచ్చిన కాంగ్రెస్ నేతలు ప్రచారం ముగిసిన మరుసటి రోజు దేవుడి సన్నిధిలో పూజలతో ప్రమాణాలు చేశారు. ఉదయం గాంధీభవన్‌కు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ కొంతసేపు ప్రచార సరళిపై సమీక్ష జరిపారు. అనంతరం బిర్లామందిర్‌కు వెళ్లి అక్కడ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆరు గ్యారంటీలకు మొదటి మంత్రివర్గంలోనే చట్టబద్ధత కల్పిస్తామని, మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రమాణం చేశారు. ఆ తర్వాత నాంపల్లిలోని యూసుఫైన్ దర్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు

మంత్రి కేటీఆర్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్‌ను నిర్వహించాలంటూ ఆయన మీడియాలో పిలుపునివ్వడం, 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ కార్యాలయంలో రక్తదానం లాంటి కార్యక్రమాలు నిర్వహించడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు లేఖ రాశారు. అదేవిధంగా తెలంగాణలో ఓటు హక్కు ఉండి ఏపీలో నివసిస్తున్న వారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా ఏపీ నుంచి తెలంగాణకు వచ్చి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



నాంపల్లి యూసుఫైన్ దర్గాలో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే

ఎవరెక్కడ ఉన్నారంటే...!

ఉదయం ప్రత్యేక పూజల అనంతరం రేవంత్‌రెడ్డి.. జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లారు. రాత్రికి కొడంగల్‌కు చేరుకున్నారు. గురువారం కొడంగల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేయనున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బుధవారమంతా మధిర నియోజకవర్గంలోనే ఉన్నారు. కార్యకర్తలతో తీరిక లేకుండా భేటీలు జరిపారు. మండలాలు, గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ ఏర్పాట్లపై పార్టీ ముఖ్య నేతలతో సమాలోచనలు జరిపారు. జ్వరంతో బాధపడుతున్నప్పటికీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లోని తన నివాసం నుంచి పోలింగ్ ఏర్పాట్లపై పార్టీ కేడర్‌తో సమీక్షించారు.

నాడు కేసీఆర్‌ను కాపాడింది మీరే

- ఆయన్ను రక్షించి ప్రజల ఆకాంక్షలను సజీవంగా ఉంచారు
- స్వరాష్ట్రాన్ని సాకారం చేసేందుకు నిమ్స్ డాక్టర్లు చేసిన కృషి చిరస్మరణీయం
- 2009లో కేసీఆర్ ఆమరణ దీక్ష సందర్భంలో సేవలందించిన వైద్య బృందానికి కేటీఆర్ సన్మానం



నిమ్స్ వైద్యులను సన్మానించిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దీక్షాదివస్ సందర్భంగా తెలంగాణ సాధన కోసం 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసినప్పుడు వైద్య సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందాన్ని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం నాటి సంఘటనలు, అప్పటి భావోద్వేగాలను నెమరు వేసుకున్నారు. 11 రోజులపాటు కేసీఆర్ ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన చెందామని ఆయన ప్రాణానికి ముప్పు కలుగుతుందన్న భయాందోళన తమను వెంటాడేదన్నారు. ఒకవైపు సీఎం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మరోవైపు అప్పటి ప్రభుత్వ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన అనేక రకాల ఒత్తిడిలను తట్టుకోవడం తమకు ఒక సవాలుగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ ఏడు రోజుల తర్వాత కూడా తమ నిరాహార దీక్షను కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నప్పుడు ఆయన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందేమోనని భయం కలిగిందన్నారు. అయితే ఆయన శారీరకంగా పూర్తిస్థాయిలో బలహీనంగా మారినా, ఆరోజు తన దీక్ష కొనసాగించే ముందు మానసికంగా అత్యంత దృఢంగా ఉండడంతోనే అన్ని రోజులు దీక్ష కొనసాగించగలిగారని ఆ నాటి పరిస్థితులను గుర్తుకు తెచ్చారు.

మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది

కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష సందర్భంగా నిమ్స్ వైద్య బృందం అందించిన సేవలకు తమ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందని కేటీ రామారావు భావోద్వేగంతో అన్నారు. ఒకవైపు తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను కాపాడుకుంటూనే మరోవైపు కుటుంబ సభ్యులుగా కేసీఆర్ ఆరోగ్యం పట్ల తమకు ఆందోళన ఉండేదన్నారు. ఆయన పట్టుదల, మొండితనం వల్లనే నిరాహార దీక్షను కొనసాగించగలిగారని చెప్పారు. అయితే ఒక కుటుంబ సభ్యుడిగా అనేక సందర్భాల్లో ఆందోళనకు గురైనప్పుడు నిమ్స్ వైద్య బృందం అందించిన మనోధైర్యం ఎప్పటికీ మరువలేమన్నారు. అత్యంత సంక్లిష్టమైన సంక్షోభ సమయంలో తమ కుటుంబానికి అండగా ఉండడమే కాకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సజీవంగా నిలిపి స్వరాష్ట్రాన్ని సాకారం చేసేందుకు సహకరించిన వైద్య బృందానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపి వారిని సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

కేసీఆర్ దీక్ష చేయకుంటే తెలంగాణ రాష్ట్రమే లేదు

నవంబర్ 29 చరిత్రను మలుపు తిప్పిన రోజు: హరీశ్‌రావు

సిద్దిపేట జోన్: తెలంగాణ ఉద్యమంలో నవంబర్ 29 అనేది చరిత్రను మలుపుతిప్పిన రోజు అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట జిల్లా రంగధాంపల్లి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తన నివాసంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన రోజు, దీక్షకు సిద్దిపేట కేంద్రం అయిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 'జైత్రయాత్ర లేకుంటే తన శవయాత్ర' అంటూ కేసీఆర్ దీక్ష చేపట్టినట్లు హరీశ్ గుర్తుచేశారు. దీక్షకు బయల్దేరిన కేసీఆర్‌ను అలుగునూరు వద్ద అరెస్ట్ చేసి ఖమ్మం తరలించారన్నారు. అక్కడ దీక్ష బూని 11 రోజుల పాటు కొనసాగించినట్లు చెప్పారు. 2009లో కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటే ఇన్ని బలిదానాలు అయ్యేవి కావని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ దీక్ష చేయకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదని హరీశ్ అన్నారు. అందుకే ఏటా దీక్షా దివస్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నేతలు

నేడు చింతమడకకు కేసీఆర్

- స్వగ్రామంలో ఓటు వేయనున్న సీఎం
- పార్టీ పోలింగ్ సన్నద్ధతపై ఫామ్‌హౌస్ నుంచి సమీక్ష

సాక్షి, హైదరాబాద్/ సిద్దిపేట రూరల్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం సిద్దిపేట నియోజకవర్గంలోని తన స్వగ్రామం చింతమడకలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కేసీఆర్ దంపతులు ఉదయం 10 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకుంటారు. గ్రామ పాఠశాలలోని 13వ బూత్‌లో ఓటు వేస్తారు. ఆ తర్వాత సీఎం తిరిగి ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు చేరుకుని పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఖైరతాబాద్, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట భారత్‌నగర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. సీఎం చింతమడకకు వస్తున్న క్రమంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టామని సీపీ శ్వేత తెలిపారు.

అభ్యర్థులకు, నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగియడం, బుధవారం 'సైలెన్స్ పీరియడ్' కావడంతో గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియ, అందుకు సంబంధించి పార్టీ పరంగా ఏర్పాట్లపై బీఆర్‌ఎస్ నేతలు దృష్టి సారించారు. పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి పోలింగ్ కోసం పార్టీ సన్నద్ధతపై ఆరా తీశారు. కొందరు పార్టీ అభ్యర్థులు, నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రచార సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిపై నిఘా వర్గాలు, వివిధ సంస్థల నుంచి అందిన నివేదికలను పరిశీలించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. చివరి ఓటు పోలయ్యేంత వరకు పార్టీ పోలింగ్ ఏజెంట్లు బూత్‌లలోనే ఉండేలా చూసుకోవాలని, పార్టీ అనుకూల ఓటరు బూత్‌కు వెళ్లేలా పార్టీ కేడర్ దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.



చింతమడకలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీపీ

పోలింగ్ సన్నద్ధతపై కిషన్‌రెడ్డి ఆరా

ప్రచారపర్వం ముగిశాక భాగ్యలక్ష్మి అమ్మవారి సందర్శన

సాక్షి, హైదరాబాద్: గురువారం ఉదయం నుంచి పోలింగ్ జరగనున్న నేపథ్యంలో... పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్ కమిటీలు, ఇతర యంత్రాంగం మోహరింపు, ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరా తీశారు. రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్న పార్టీ అభ్యర్థులతో ఆయన ఫోన్లో మాట్లాడి ఓటింగ్‌కు సన్నద్ధమవుతున్న తీరు, ఆయా అసెంబ్లీ స్థానాల్లో పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ సాఫీగా, శాంతియుతంగా జరగడంపై దృష్టి పెట్టాలని, గొడవలకు తావివ్వని విధంగా అభ్యర్థులు, పార్టీ నాయకులు వ్యవహరించాలని సూచించినట్టు సమాచారం. బుధవారం ఉదయమే ఆయన చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రం అవినీతి రహితంగా, ప్రజాస్వామ్యయుతంగా వెల్లివిరియా లని అమ్మవారిని కోరుకున్నట్టు కిషన్‌రెడ్డి తెలియజేశారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. అనంతరం బషీర్‌బాగ్‌లోని అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించారు. తరువాత నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎన్నికలకు సంబంధించిన సమీక్షలో నిమగ్నమయ్యారు. గత కొన్ని రోజులుగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పాటు, నగరంలోని పలు నియోజకవర్గాల పరిధిలో కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.



భాగ్యలక్ష్మి ఆలయంలో కిషన్‌రెడ్డి పూజలు

అనుకూల ఓటింగ్‌ను పెంచాలి

- పోలింగ్ శాతం పెంపుపై కూడా దృష్టి పెట్టాలి
- అభ్యర్థులకు, బూత్ కమిటీలకు బీజేపీ దిశానిర్దేశం
- ప్రలోభాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పోటీ చేస్తున్న 111 నియోజకవర్గాల్లో పార్టీ అనుకూల ఓటింగ్‌ను, మరి ముఖ్యంగా పోలింగ్ శాతాన్ని పెంచే చర్యలపై బీజేపీ దృష్టి పెట్టింది. గురువారం పోలింగ్ సందర్భంగా అప్రమత్తంగా వ్యవహరించాలని, పార్టీ అనుకూలురు ఓటు వేసేలా చూడటంతో పాటు పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకోకుండా జా గ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షులు, అభ్యర్థులు, పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులకు రాష్ట్రపార్టీ ముఖ్య నేతలు సూచించినట్టు తెలిసింది. ఇతర పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఓ కన్నేసి ఉంచాలని, ఎక్కడైనా ఇలాంటి సూచనలు కన్పిస్తే వెంటనే ఈసీ విజిల్ యాప్‌ను వినియోగించుకుని ఫిర్యాదులు నమోదు చేయాలని పేర్కొన్నట్టు సమాచారం. బుధవారం పార్టీ కార్యాలయం నుంచి వివిధ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులు, జిల్లా అధ్యక్షులతో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం నుంచి పోలింగ్ ముగిసే దాకా బూత్ కమిటీల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సరళిపై ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గంట గంటకు ఓటింగ్ సరళిని, శాతాలను ప్రత్యేక దృష్టితో గమనించాలని చెప్పారు.

మంచి ఫలితాలపై ఆశాభావం

ఉత్తర తెలంగాణ జిల్లాలు, హైదరాబాద్ మహానగరం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు మరి కొన్ని చోట్ల పార్టీ అనుకూల ఓటింగ్‌ను గణనీయంగా పెంచుకోవడం ద్వారా ఈసారి మంచి ఫలితాలు సాధించవచ్చునని పార్టీవర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణలో ప్రధాని మోదీ, అగ్రనేతలు అమిత్‌సా, జేపీనడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత సీఎంలు ఇతర ముఖ్య నేతలు నిర్వహించిన విస్తృత ప్రచారం వల్ల ఎన్నికల్లో పార్టీకి తప్పకుండా మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నాయి.

2 నుంచే ఏపీలో భారీ వర్షాలు

- నేడు వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- నాలుగు రోజులు కుమ్మరించనున్న వానలు
- రాయలసీమ, దక్షిణ కోస్తాలపై అధిక ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: వాతావరణంలో శరవేగంగా చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా.. బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనే ఎక్కువగా పడనుంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. అంతకుముందు డిసెంబరు నాలుగో తేదీ నుంచి తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసినప్పటికీ డిసెంబర్ రెండో తేదీ నుంచే భారీ వర్షాలు మొదలవుతాయని తాజాగా వెల్లడించింది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ గురువారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం వాయవ్య దిశగా కదులుతూ డిసెంబర్ రెండో తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా మారనుందని ఐఎండీ బుధవారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

భారీ వర్షాలు ఎప్పుడు? ఎక్కడెక్కడ?

తుపాను ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో ఎక్కువగానూ, ఉత్తర కోస్తాలో స్వల్పంగానూ ఉండనుంది. డిసెంబర్ రెండు నుంచి ఐదో తేదీ వరకు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. డిసెంబర్ రెండున తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో, మూడున తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్, అన్నమయ్య, నాలుగున తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, గుంటూరు, పల్నాడు, వైఎస్సార్, అన్నమయ్య, నంద్యాల, ఎన్టీఆర్, ఐదున ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, పశ్చిమ గోదావరి, కోనసీమ, బాపట్ల, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయి. కాగా, తుపాను ప్రభావంతో కురిసే వర్షాలకు పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కోతలకు సిద్ధమైన వరి పంటలను సత్వరమే కోసుకోవాలని రైతులకు ఐఎండీ సూచించింది. మరోవైపు రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల, రాయలసీమలో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే ఆస్కారం ఉందని పేర్కొంది.

తుపానుకు మిచాంగ్‌గా నామకరణం

డిసెంబర్ రెండున ఏర్పడబోయే తుపానుకు మిచాంగ్‌గా నామకరణం చేయనున్నారు. ఈ పేరును మయన్మార్ దేశం సూచించింది. నిబంధనల ప్రకారం తుపానుగా మారాకే దాని పేరును అధికారికంగా ప్రకటించనున్నారు.

నేడే ఓట్ల పండుగ



▶ మొదటి పేజీ తరువాయి
అనంతరం డిసెంబర్ 5తో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

మూడు కోట్లకుపైగా ఓటర్లు

రాష్ట్రంలో 1,63,01,705 మంది మహిళలు, 1,62,98,418 మంది పురుషులు, 2,676 మంది మూడో జెండర్ ఓటర్లు కలిపి మొత్తంగా 3,26,18,205 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో కలిపి 2,067 మంది పురుష అభ్యర్థులు, 222 మంది మహిళా అభ్యర్థులు, మూడో జెండర్ అభ్యర్థి ఒకరు కలిపి మొత్తం 2,290 మంది ఎన్నికల్లో పోటీపడుతున్నారు.

ఏ పార్టీల నుంచి ఎంత మంది అభ్యర్థులు?

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సీట్లలో బీఆర్ఎస్ పోటీచేస్తోంది. కాంగ్రెస్ 118 సీట్లలో, ఆ పార్టీ పొత్తుతో సీపీఐ ఒకచోట బరిలో ఉన్నాయి. మరో కూటమిలో భాగంగా బీజేపీ 111, జనసేన 8 స్థానాల నుంచి పోటీ చేస్తున్నాయి. బీఎస్పీ 107 చోట్ల, ఎంఐఎం 9 చోట్ల, సీపీఎం 19 చోట్ల, సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసీ) ఒకచోట తలపడుతున్నాయి.

➤ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 41 మంది, ధర్మసమాజ్ పార్టీ నుంచి 101 మంది, జైమహాభారత్ పార్టీ నుంచి 13 మంది, రాష్ట్రీయ సామాన్య ప్రజాపార్టీ నుంచి నలుగురు, ఇతర పార్టీల నుంచి మరో 659 మంది, స్వతంత్రులు 989 మంది ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

➤ నియోజకవర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎల్బీనగర్ నుంచి 48 మంది, గజ్వేల్ నుంచి 44 మంది, కామారెడ్డి, మునుగోడుల నుంచి 39 మంది చొప్పున పోటీపడుతుండగా.. అత్యల్పంగా నారాయణపేట, బాన్సువాడల్లో ఏడుగురు చొప్పున, బాల్కొండలో 8 మంది బరిలో ఉన్నారు.

35,655 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

రాష్ట్రంలో 299 అనుబంధ పోలింగ్ కేంద్రాలు సహా మొత్తం 35,655 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. 27,094 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నారు. ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న 7,571 ప్రాంతాల్లో బయటి పరిసరాలను సైతం వెబ్‌కాస్టింగ్ చేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. మిగతా పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, ఫోన్లు, ట్యాబ్స్, ల్యాప్‌ట్యాప్‌లతో విద్యార్థులు పోలింగ్ ప్రక్రియను రికార్డు చేయనున్నారు. రికార్డు చేసిన డేటాను ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తారు.

పటిష్టంగా బందోబస్తు

పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 45వేల మంది రాష్ట్ర పోలీసులు, మరో 3వేల మంది అటవీ/ఆబ్కారీ సిబ్బంది, 50 కంపెనీల టీఎస్ఎస్పీ, 375 కంపెనీల కేంద్ర బలగాలను మోహరిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి వచ్చిన 23,500 మంది హోంగార్డులు కూడా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.

దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు

దివ్యాంగ ఓటర్లు సులువుగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బ్రెయిలీ లిపిలో 76,532 ఓటరు స్లిప్పులు, 40 వేల ఓటర్ గైడ్స్, 40 వేల డమ్మీ బ్యాలెట్ పేపర్లను ముద్రించి అంధ ఓటర్లకు పంపిణీ చేశారు. శారీరక వికలాంగులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తరలించడానికి ఆటోలను ఏర్పాటు చేయనున్నారు. వారికోసం పోలింగ్ కేంద్రాల వద్ద 21,686 ట్రై సైకిళ్లను అందుబాటులో ఉంచారు. ర్యాంపులను ఏర్పాటు చేశారు.

ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ నేతృత్వంలో దాదాపు ఏడాది నుంచీ ఏర్పాట్లు జరిగాయి. ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఓటర్ల జాబితా సవరణ, ఈవీఎంలను సంసిద్ధం చేయడం, ఎన్నికలు/ పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం/శిక్షణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్లకు సదుపాయాల కల్పన, భద్రతా ఏర్పాట్లను ఎన్నికల సంఘం పూర్తిచేసింది. మొత్తం 2,00,433 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. అన్నిజిల్లాల్లో పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని సీఈఓ కార్యాలయం బుధవారం అర్ధరాత్రి ప్రకటించింది. వారంతా రాత్రి పోలింగ్ కేంద్రాల్లోనే బస చేస్తారు. ప్రిసైడింగ్ అధికారులు గురువారం ఉదయం 5.30 గంటలకు పోల్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. తర్వాత కంట్రోల్ యూనిట్‌లోని మెమరీ డిలీట్ చేసి, వీవీ ప్యాట్ కంటైనర్ బాక్స్ నుంచి మాక్ ఓటింగ్ స్లిప్పులను తొలగిస్తారు.

పోలింగ్ నిర్వహణలో పాల్గొనే అధికారుల లెక్క ఇదీ

సెక్టార్ అధికారులు	3,803
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	1,251
స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్	1,316
వీడియో సర్వైలెన్స్ టీమ్స్	640
వీడియో వీవింగ్ టీమ్స్	290
సహాయ వ్యయ పరిశీలకులు	184
వ్యయ పర్యవేక్షణ బృందాలు	234
సూక్ష్మ పరిశీలకులు	12,909
రూట్ అధికారులు	4,039
ప్రిసైడింగ్ అధికారులు	43,171
ఇతర పోలింగ్ అధికారులు	1,32,596
మొత్తం	2,00,433

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా ఓటింగ్ శాతం తీరు

పార్టీ	ఓటింగ్ శాతం
టీఆర్ఎస్/బీఆర్ఎస్	46.87
కాంగ్రెస్	28.43
బీజేపీ	6.98
టీడీపీ	3.51
ఎంఐఎం	2.71
బీఎస్పీ	2.06
ఫార్వర్డ్ బ్లాక్	0.77
సీపీఐ	0.40
సీపీఎం	0.44

రిజర్వుడ్ స్థానాల లెక్క ఇదీ..

మొత్తం సెగ్మెంట్లు:	119
ఎస్సీ రిజర్వుడ్:	19
ఎస్టీ రిజర్వుడ్:	12
జనరల్:	88

పోలింగ్ కేంద్రాల లెక్క ఇదీ..

పట్టణ పోలింగ్ కేంద్రాలు: 14,458
గ్రామీణ పోలింగ్ కేంద్రాలు: 20,898
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 35,356
అనుబంధ పోలింగ్ కేంద్రాలు: 217
సున్నిత పోలింగ్ కేంద్రాలు: 10,969
మహిళల నిర్వహణలోని పోలింగ్ కేంద్రాలు: 597
దివ్యాంగుల నిర్వహణలోని పోలింగ్ కేంద్రాలు: 120
యువత నిర్వహించే పోలింగ్ కేంద్రాలు: 597
ఆదర్శ పోలింగ్ కేంద్రాలు: 644

ఓటింగ్‌కు వాడే ఈవీఎంల వివరాలివీ..

బ్యాలెట్ యూనిట్లు:	75,464
కంట్రోల్ యూనిట్లు:	44,828
వీవీ ప్యాట్స్:	49,460

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా గెలుచుకున్న సీట్ల వివరాలివీ..

పార్టీ	2014	2018
టీఆర్ఎస్/బీఆర్ఎస్	63	88
కాంగ్రెస్	21	19
ఎంఐఎం	7	7
టీడీపీ	15	2
బీజేపీ	5	1
వైఎస్సార్‌సీపీ	3	–
సీపీఐ	1	0
సీపీఎం	1	0
బీఎస్పీ	2	0
ఫార్వర్డ్ బ్లాక్	0	1
స్వతంత్రులు	1	1
మొత్తం	119	119


సరూర్‌నగర్ స్టేడియంలో ఎన్నికల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది


అసెంబ్లీ ఎన్నికలకోసం ఈవీఎం మెషీన్లు, ఇతర ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది


నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో సిబ్బందికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన ఈవీఎం మెషీన్లు

అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల వివరాలివీ..

ఓటర్లు	పురుషులు	మహిళలు	మూడో జెండర్	మొత్తం
సాధారణ ఓటర్లు	16,298,418	16,301,705	2,676	32,602,799
సర్వీస్ ఓటర్లు	14,850	556	0	15,406
మొత్తం ఓటర్లు	16,313,268	16,302,261	2,676	32,618,205
18–19 ఏళ్ల కొత్త ఓటర్లు	5,70,274	4,29,273	120	9,99,667
80 ఏళ్లపైబడినవారు	1,89,519	2,50,840	12	4,40,371
ప్రవాస ఓటర్లు	2,380	563	1	2,944
దివ్యాంగ ఓటర్లు	2,90,090	2,16,815	16	5,06,921

పోలింగ్ శాతం మళ్లీ పెరగాలి

గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,80,64,684 మంది ఓటర్లకు గాను 2,05,80,470 (73.2 %) మంది ఓటేశారు. 1,41,56,182 మంది మొత్తం పురుష ఓటర్లకు గాను 1,03,17,064 (72.54%) మంది, 1,39,05,811 మంది మొత్తం మహిళా ఓటర్లకు గాను 1,02,63,214(73.88%) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2691 మంది మూడో జెండర్ ఓటర్లలో కేవలం 192 (8.99%) మంది మాత్రమే ఓటేశారు. 2014 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కేవలం 69.5శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. 2014 ఎన్నికలతో పోల్చితే 2018 ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా పోలింగ్ శాతం మరింతగా పెంచేందుకు ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేయాలని ఎన్నికల యంత్రాంగం పిలుపునిచ్చింది.

నగర వార్తలు

సాంకేతిక లోపంతో ఢిల్లీ విమానం ఆలస్యం

శంషాబాద్: సాంకేతిక లోపంతో ఢిల్లీ వెళ్లాల్సిన విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 7గంటలకు ఢిల్లీ బయలుదేరాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాన్ని నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొందరు టికెట్లు రద్దు చేయించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు విమానం ఇక్కడి నుంచి బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

పాతబస్తీలో బోగస్ ఓట్ల కలకలం?

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో బోగస్ ఓట్ల కలకలం రేగింది. ఎన్నికల సిబ్బంది ఓటర్ల జాబితా ఆధారంగా ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసేందుకు ప్రయత్నించగా..ప్రతి బూత్ పరిధిలో సుమారు 20 శాతం పైగా ఓటర్లు అందుబాటులో లేనట్లు బహిర్గతం కావడం, ఫోన్లు కూడా పనిచేయని పరిస్థితి విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికే బోగస్ ఓట్లపై ఈసీకి ఫిర్యాదులు అందగా కొత్తగా నమోదైన ఓటర్లపై విచారణ జరిపి బోగస్ ఓట్లను తొలగించారు. తాజాగా జాబితాలో ఓటరు స్లిప్‌ల పంపిణీకి ప్రయత్నించగా ఇంకా బోగస్ పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ఎన్నికల సిబ్బంది గుర్తించారు. వాస్తవంగా ఎన్నికల సిబ్బంది కేవలం స్లమ్ ఏరియాలో మినహా మిగతా ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌లు పంచని పరిస్థితి ఉంది. బహుళ అంతస్తు భవన సముదాయలకు వెళ్లి ఫ్లాట్ టూ ఫ్లాట్ చిట్టిలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. పంపిణీ చేసిన వాటిలోనే బోగస్ పెద్ద ఎత్తున బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని పర్యాయాలుగా పాతబస్తీలో అందుబాటులో లేని వారి పేరుతో ఓటు వేయించేందుకు సైతం బోగస్ గుర్తింపు కార్డులు రూపొందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నాంపల్లి, మలక్‌పేట, యాకుత్‌పురా, చార్మినార్ తదితర నియోజకవర్గాల్లో పంపిణీ కాకుండా పెద్ద ఎత్తున ఓటరు స్లిప్స్ వెనక్కివచ్చినట్లు తెలుస్తోంది.

సామాన్యుడు విసిరిన సవాళ్లు!

- 2010లో స్లాట్స్ కోసం పాస్‌పోర్ట్ ఆఫీస్ వెబ్‌సైట్ హ్యాకింగ్
- 2018లో సిమ్‌కార్డ్స్ టార్గెట్‌కి బయోమెట్రిక్ వ్యవస్థ విచ్ఛిన్నం
- తాజాగా వెలుగులోకి క్లోన్డ్ వేలిముద్రలతో ఏఈపీఎస్ దందా
- వ్యవస్థాగత లోపాలే కారణమంటున్న పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులు సైతం ఒక్కోసారి పెద్దపెద్ద వ్యవస్థల్ని కదిలిస్తున్నారు. ఎవరూ ఊహించని విధంగా 'హైటెక్ నేరాలకు' పాల్పడుతూ సవాళ్లు విసురుతున్నారు. వీరిస్తున్న షాక్‌లతో యంత్రాంగాల దిమ్మ తిరిగిపోయి నష్ట నివారణ చర్యలు అన్వేషిస్తున్నాయి. 2010లో వెలుగులోకి వచ్చిన పాస్‌పోర్ట్ కార్యాలయం వెబ్‌సైట్ హ్యాకింగ్ నుంచి తాజాగా బయటపడిన 'క్లోన్డ్ వేలిముద్రల' వ్యవహారం వరకు ఈ కోవకు చెందినవే. ఆయా నిందితులు ఈ నేరాలకు పాల్పడింది కేవలం తమ అవసరాల కోసమే కావడం గమనార్హం.

స్లాట్స్ కోసం ఆర్పీఓ వెబ్‌సైట్...

ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేటకు చెందిన గోరంట్ల లతాధర్‌రావు పీజీడీసీఏ పూర్తి చేసి అక్కడే లలిత ఫ్యాన్సీ అండ్ కూల్ డ్రింక్స్ దుకాణం నిర్వహించే వాడు. ఇతడికి 2010లో ఆకాష్ ట్రావెల్స్ నిర్వాహకుడు షేక్ సుభానీతో పరిచయమైంది. లతాధర్‌కు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటంతో తన వద్దకు వచ్చే పాస్‌పోర్ట్ అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కోసం సుభానీ ఇతని సాయం తీసుకునే వాడు. తత్కాల్ స్కీమ్ కింద పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకునే వారు దళారులను ఆశ్రయించడం ప్రారంభించి ఆన్‌లైన్ స్లాట్ ఇప్పిస్తే భారీ మొత్తాలను చెల్లించడానికి ముందు రావడం మొదలుపెట్టారు. దీంతో పాస్‌పోర్ట్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి స్లాట్స్ బ్లాక్ చేయాలన్న ఆలోచన లతాధర్, సుభానీలకు వచ్చింది. తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని వినియోగించి లతాధర్ ఈ పని చేశాడు. రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాలయం వెబ్‌సైట్‌లోనికి ఎంటర్ అయ్యే లతాధర్ దాని నుంచి నేరుగా సర్వర్‌కు కనెక్ట్ అయ్యే వాడు. ప్రతి రోజూ స్లాట్స్ విడుదల చేసే సమయంలో ఇతరులు వాటిలోకి లాగాన్ కాకుండా చేసే వాడు. తమను ఆశ్రయించిన వారి అప్లికేషన్స్ అప్‌లోడ్ చేసిన తరవాతే స్లాట్స్‌ను ఫ్రీ చేసే వాడు. ఈ వ్యవహారం అదే ఏడాది జూన్‌లో వెలుగులోకి రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లతాధర్ సహా ఏడుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. ఆన్‌లైన్ స్లాట్స్ కేటాయింపునకు ఉపయోగపడే పాస్‌పోర్ట్ వెబ్‌సైట్‌కు చెందిన సోర్స్ కోడ్‌ను హ్యాక్ చేయడం ద్వారా ఇతరులకు స్లాట్స్ దొరక్కుండా బ్లాక్ చేస్తున్నట్లు లతాధర్ ఒప్పుకున్నాడు.


ఇటీవలి ఏఈపీఎస్ స్కాం వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు(ఫైల్)

టార్గెట్, నగదు కోసం నకిలీ వేలిముద్రలు...

కేవలం టార్గెట్‌కు తగ్గట్టు సిమ్‌కార్డులు విక్రయించడానికి పెద్దపల్లి జిల్లా ధర్మారానికి చెందిన ధనలక్ష్మీ కమ్యూనికేషన్స్ నిర్వాహకుడు పాత సంతోష్‌కుమార్ ఏకంగా నకిలీ వేలిముద్రల్నే సృష్టించేశాడు. ఈ తరహా ఉదంతం వెలుగులోకి రావడం అదే ప్రథమం. రిజిస్ట్రేషన్స్ శాఖ వెబ్‌సైట్‌లోని డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకుని రెచ్చిపోయాడు. వాటిలో ఉండే వ్యక్తి పేరు, ఆధార్ నెంబర్, వేలిముద్రల్ని తనకు అనుకూలంగా వాడుకున్నాడు. రబ్బర్‌స్టాంపులు తయారు చేసే యంత్రంతో వేలిముద్రల్నే సృష్టించేశాడు. రబ్బర్‌తో వీటిని రూపొందిస్తే ఈ–కేవైసీ యంత్రం రీడ్ చేయట్లేదనే ఉద్దేశంతో పాలిమర్ అనే కెమికల్‌ను వాడి వేలిముద్రలు తయారు చేశాడు. ఈ వివరాలతో ఈ–కేవైసీ యంత్రాన్నీ ఏమార్చి వేల సిమ్‌కార్డులు యాక్టివేట్ చేశాడు. ఇతడిని ఎస్సార్‌నగర్ పోలీసులు పట్టుకున్న తర్వాత వచ్చి విచారించిన ఆధార్ సహా ఇతర విభాగాలకు చెందిన అధికారులు నివ్వెరపోయారు. తాజాగా తెలంగాణ, ఏపీలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు, నిరుద్యోగులు ముఠాగా మారి, ఇదే పంథాలో వేలిముద్రలు క్లోనింగ్ చేసి ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) దుర్వినియోగం చేసి వివిధ బ్యాంకులకు రూ.10 లక్షల మేర టోకరా వేశారు.

'ముప్పు'ను ఊహించకపోవడమే...

ఇలాంటి పెను ఉదంతాలు చోటు చేసుకోవడానికి ప్రధాన కారణం 'భవిష్యత్తును' సరిగ్గా అంచనా వేయలేకపోవడమే కారణమని నిపుణులు చెప్తున్నారు. ఏదైనా ఓ విధానం, వెబ్‌సైట్ తదితరాలు రూపొందించేప్పుడు అనేక కోణాలను పరిశీలించాల్సి ఉంటుందని చెప్తున్నారు. అయితే పెద్ద వ్యవస్థలకు చెందిన వారు సైతం కేవలం అప్పటి అవసరాలను, ఎదురవుతున్న సమస్యల్నే దృష్టిలో పెట్టుకుంటున్నారని, భవిష్యత్తులో ఎదురయ్యే వాటిని పట్టించుకోవట్లేదని వివరిస్తున్నారు. ఈ కారణంగానే జరగాల్సిన నష్టం జరిగిపోయిన తర్వాత మాత్రమే నష్టనివారణ, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సి వస్తోందని అంటున్నారు. పాశ్చాత్య దేశాల్లో మాత్రం సమీప భవిష్యత్తులో ఎన్ని రకాలైన సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉంది, టెక్నాలజీ ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చు తదితరాలను అంచనా వేసి చర్యలు తీసుకుంటారని, ఆ దృక్పథం ఇక్కడ లోపించిందని, దీంతోనే ఏదైనా జరిగిన తర్వాతే అవసరమైన చర్యలు తెరపైకి వస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు.


దబీర్‌పురలో ఇరుకు గదిలో పోలింగ్ బూత్


పత్తర్‌గట్టీలో ఆటస్థలంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేసిన దృశ్యం


సికింద్రాబాద్ పరిధిలో ఓ పోలింగ్ బూత్ ఇలా..

మరీ ఇంత ఇరుకా?

- పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై ఓటర్ల అసంతృప్తి
- కొన్నిచోట్ల మరీ అసౌకర్యంగా ఉన్న వైనం..

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా.. తీరా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. చాలా చోట్ల సౌకర్యవంతమైన పోలింగ్ బూత్‌లు ఏర్పాటు కాలేదు. ఇరుకు గదులు..చీకటి నిండిన ప్రాంతాలు..కనీస దారి కూడా లేని చోట్ల పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో చిన్నచిన్న భవనాల్లోనూ రెండు నుంచి మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఓటర్లు దాదాపు 1000–1200 మంది ఉండడంతో వారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పోలింగ్ బూత్‌లోకి రావడానికి కనీసం దారులు సరిగా లేవని అధికారులను అడగగా కింది స్థాయి అధికారులను అడగండని అంటున్నారట. కింది స్థాయి అధికారులు ఉన్నత స్థాయి అధికారులకు తెలుసు అని సమాధానం చెబుతున్నారు.

చిన్న భవనంలో మూడు పోలింగ్ బూత్‌లు

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మహమూద్ గూడ, శ్రీనివాస్‌నగర్‌లోని ఓ చిన్న భవనంలో నాలుగు పోలింగ్‌బూత్‌లు (నెంబర్లు 57, 58, 59, 59/ఏ) ఏర్పాటు చేశారు. ఈ భవనంలోని 57 పోలింగ్ బూత్‌లో 1301, 58 పోలింగ్ బూత్‌లో 1303, 59వ బూత్‌లో 1312 మంది ఓటర్లు ఓటు వేయాల్సి ఉంది. ఓటర్ల లిస్టులో ఓటర్ల సంఖ్య పెరగడంతో 59/ఏ బూత్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇలా ఒక చిన్న భవనంలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. భవనం చిన్నగా ఉండడంతో 57, 58, 59 పక్కపక్కనే కంపార్టుమెంట్లు ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. ఇక ఈ నాలుగు పోలింగ్ బూత్‌లకు ఒక చిన్న దారి ద్వారా రావాల్సి ఉంది. అ దారి కూడా ఐదు ఫీట్లే ఉంది. నాలుగు పోలింగ్ బూత్‌లకు చెందిన సుమారు ఐదు వేల మంది ఓటర్లు ఈ ఇరుకు గదుల్లో ఓటు వేయాల్సి ఉంది. ఇక ఈ రూమ్‌లలోనే అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది కూర్చోవాలి. దీనిపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిన్నర చిన్నారికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ

- మరో అరుదైన ఘనత సాధించిన గాంధీ వైద్యులు
- ఆపరేషన్ సక్సెస్.. ఐదురోజుల తర్వాత డిశ్చార్జి

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వైద్యులు ఏడాదిన్నర వయసు గల చిన్నారికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించి మరో అరుదైన ఘనత సాధించారు. గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్, ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రొఫెసర్ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా కొండాపూర్, నారాయణఖేడ్ మిత్యనాయక్‌తండాకు చెందిన పట్లోతు శివకన్య (18 నెలలు) పుట్టుమూగ. వినికిడి లోపంతో పుట్టడంతో వయసు పెరుగుతున్నా మాటలు రాకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వారం రోజుల క్రితం గాంధీఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో చేర్పించారు. పలు వైద్య పరీక్షలు నిర్వహించి పుట్టుకతోనే వినికిడిలోపం ఉన్నట్లు గుర్తించి, బుధవారం కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ విభాగాధిపతి శోభన్‌బాబు మీడియాతో మాట్లాడుతు గాంధీఆస్పత్రిలో ఇప్పటి వరకు పదిమందికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని, ఏడాదిన్నర చిన్నారికి సర్జరీ చేయడం అరుదైనదని వివరించారు. ఐదు రోజుల తర్వాత డిశ్చార్జి చేస్తామని, చిన్నారి శివకన్య ఇకపై అందరిలాగే మాట్లాడుతుందని, స్కూలుకి వెళ్లగలుగుతుందని తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో పుట్టిన శిశువులకు పిడియాట్రిక్ విభాగ సంయుక్త ఆధ్వర్యంలో హియరింగ్, స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నామని, వినికిడి లోపం ఉంటే తగిన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. చిన్నారికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించిన గాంధీ ఈఎన్‌టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ శోభన్‌బాబు, వైద్యులు జేబీఎస్ రాథోడ్, ఏఏ కబీర్, దీప్తి, అనస్థీషియా ప్రొఫెసర్ మురళీధర్, ఆడియాలజిస్టులు సాయికిరణ్, అనూష, స్టాఫ్‌నర్సులు జాస్మిన్, వసంతి, దేవిలకు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రమేష్‌రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు అభినందించారు.


సర్జరీలో పాల్గొన్న గాంధీ ఈఎన్‌టీ వైద్యబృందం

జాతీయ స్థాయిలో అబాకస్ విద్యార్థుల ప్రతిభ

దిల్‌సుఖ్‌నగర్: సిప్ అబాకస్ ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి మెంటల్ ఆర్థిమెటిక్ కాంటెస్ట్‌లో దేశంలోని 23 రాష్ట్రాల నుంచి 4700 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో కేవలం 11 నిమిషాల్లో 300 లెక్కలు చేయాల్సి ఉంటుంది. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని సిప్ అబాకస్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాలలో ఈ విద్యార్థులు 10 ట్రోఫీలు గెలుచుకున్నారు. అన్విక్ రెడ్డి, 1వ రన్నరప్ గా నిలువగా, హరిణి, అభినవ్ తేజ్, సహస్ర, 2వ రన్నర్ అప్ గా నిలిచారు. వేదాంత్ రెడ్డి, హవిషా రమణి, కార్తికేయ, ధీరజ్, విదిత్ సాయి వెన్ను, ఆశిష్ 3వ రన్నర్ అప్ గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్‌కే పురం వాసవి కాలనీలోని సిప్ అబాకస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బహుమతులు పొందిన విద్యార్థులు సంస్థ నిర్వాహకురాలు సంధ్యారాణి అభినందించి బహుమతులు అందచేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, గణితంలో మెలకువలు, ఏకాగ్రత పెంపు వంటి అంశాలకు తాము ప్రాధాన్యత ఇస్తూ వారిని తీర్చిదిద్దుతున్నామని ఆమె పేర్కొన్నారు.


జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి బహుమతులు అందుకున్న విద్యార్థులు





పట్నమా మేలుకో..

ఓటుతో ఏలుకో!



యువతా.. నీదే భవితా..

గ్రేటర్ యువత ఉదాసీనత వీడాలి. బాధ్యతాయుతంగా వ్యవహరించి ఓటు వేసేందుకు ముందుకు రావాలి. తమ భవితను తీర్చిదిద్దుకునేందుకు ఇదే సరైన సమయం. ఓటుతో తమకేం కావాలో పాలకులకు తెలియజెప్పాలి. ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కును పొందిన యువతీ యువకులు లక్షల్లోనే ఉన్నారు. ఉప్పల్,మల్కాజిగిరి, మేడ్చల్, ఎల్‌బీ నగర్, తదితర నియోకవర్గాల్లో కొత్త ఓటర్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అన్ని వర్గాలకు చెందిన ఓటర్లు బాధ్యతగా ఓటు వేస్తే నగరంలో ఈసారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. పార్టీల ఎన్నికల ప్రచారంలో యువకులు పెద్ద సంఖ్యలోనే పాల్గొన్నారు. ఓటింగ్‌లో కూడా అదేవిధమైన బాధ్యతను కొనసాగించాలి. కోటిన్నర జనాభా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో పోలింగ్ కనీసం 70 శాతం దాటాలంటే యువత బాధ్యతాయుతంగా ఓటేయాలి.

ఏ ఎన్నికల్లో ఎలా?

2009 సార్వత్రిక	54.18
2009 జీహెచ్‌ఎంసీ	42.92
2014 సార్వత్రిక	52.9
2018 సార్వత్రిక	50.86
2020 జీహెచ్‌ఎంసీ	49.8

ఓటరు కార్డున్నా జాబితాలో పేరుండాలి

ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) ఉందనుకుంటే సరిపోదు. ఓటరు జాబితాలో పేరున్నట్లు నిర్ధారించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు. ఓటరు స్లిప్పులు అందిన వారు కేవలం అవి సరిపోతాయనుకున్నా సరిపోదని స్పష్టం చేశారు. గుర్తింపు కోసం ఎపిక్ కార్డు ఉండాల్సిందేనంటున్నారు. అది లేని వారు ఈ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని వెంట తీసుకువెళ్లాల్సిందేనని సూచించారు. ఆధార్ కార్డు. ఎంఎస్ఆర్‌ఈఏ జాబ్‌కార్డు. పోస్ట్ ఆఫీస్ లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్. కార్మిక మంత్రిత్వ శాఖ జారీచేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు. డ్రైవింగ్ లైసెన్స్. పాన్ కార్డు. ఆర్‌జీఐ ద్వారా జారీ చేసిన స్మార్ట్ కార్డు. ఇండియన్ పాస్ పోర్టు. ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్. ఫొటోతో కూడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం/పీఎస్‌యూ/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ఉద్యోగ గుర్తింపు కార్డు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల అధికార గుర్తింపు పత్రం. దివ్యాంగుల గుర్తింపు కార్డు.

హైదరాబాద్

అసెంబ్లీ నియోజకవర్గాలు:	15
ఎన్నికల బరిలో అభ్యర్థులు:	312
బ్యాలెట్ యూనిట్లు:	9,318
కౌంటింగ్ యూనిట్లు:	5,132
వీవీ ప్యాట్లు:	5,737
విధుల్లో సిబ్బంది	
పీఓలు:	4,947
ఏపీఓలు:	4,947
పోలింగ్ అధికారులు:	9,894
మైక్రో అబ్జర్వర్లు:	810
సెక్టార్ ఆఫీసర్లు:	369
పోలింగ్ లొకేషన్లు:	1,677
పోలింగ్ కేంద్రాలు:	4,119
జిల్లాలో మొత్తం ఓటర్లు:	45,36,852
పురుషులు:	23,22,623
మహిళలు:	22,13,902
థర్డ్‌జెండర్:	327


సాక్షి హైదరాబాద్

7

గురువారం । 30 । నవంబర్ । 2023



“ఓటు హక్కు ద్వారా పోరాడి రాజులు అవుతారో, అమ్ముడు పోయి బానిసలవుతారో నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.” – డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



“అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు... ఏపాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు...పెట్టిన టోపీ చూడు” – కాళోజీ



“ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలంటే.. ఆ మాట ఇచ్చే ముందు ఆలోచించాలి” – అబ్దుల్ కలాం

రంగారెడ్డి

అసెంబ్లీ నియోజకవర్గాలు:	8
పోలింగ్ బూత్‌లు:	3,453
ఎన్నికల బరిలో అభ్యర్థులు:	209
బ్యాలెట్ యూనిట్లు:	9,943
కంట్రోల్ యూనిట్లు:	5,483
వీవీప్యాట్లు:	5,389
మొత్తం పోలింగ్ సిబ్బంది	15,212 మంది
సమస్యాత్మక కేంద్రాలు:	1,541
జిల్లాలో మొత్తం ఓటర్లు:	35,23,219
పురుషులు:	18,22,366
మహిళలు:	16,99,600
థర్డ్‌జెండర్:	454
ఎన్నారైలు:	207
సర్వీస్ ఓటర్లు:	592



నిజాం కాలేజీ గ్రౌండ్‌లో పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి

'నేడు కార్యాలయంలో ముఖ్యమైన పని ఉన్నందున ఓటు వేయొద్దనుకుంటున్నారా? 'వ్యక్తిగత పనా? ఓటింగ్ కంటే ముఖ్యమైన పని ఉందనుకుంటున్నారా? ఈ రోజున తలనొప్పి వచ్చిందా? నొప్పి నివారణ మందు తీసుకోండి. ఓటు మాత్రం వేయండి. మీ కేలండర్‌లో నేడు అన్ని అపాయింట్‌మెంట్లను క్లియర్ చేయండి . ఈ రోజు.. నేను నా ఓటుహక్కు వినియోగించుకుంటానని లాక్ చేస్కోండి. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పోలింగ్ కేంద్రాలకు పోటెత్తాలి.నగర వాసులంతా ఓటెత్తాలి. అప్పుడే పౌరులుగా మీ బాధ్యతలను నెరవేర్చినవారవుతారు. 'ఒక్కో సిరా చుక్క.. బంగారు భవిష్యత్‌కు చుక్కానిగా నిలిచేలా చైతన్యం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. రండి.. కదలి రండి పోలింగ్ కేంద్రానికి ఉవ్వెత్తున తరలి రండి. ఓట్ల పండుగలో పాల్గొనండి.



ప్రజాస్వామ్య స్ఫూర్తికి జీవం పోద్దాం

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు

హైదరాబాద్ జిల్లాలో 4,119 కేంద్రాలు

అన్ని కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్

ఎన్నికల సామగ్రిని తరలించిన సిబ్బంది

ఓ(పో)టెత్తుదాం

మేడ్చల్ - మల్కాజిగిరి

అసెంబ్లీ నియోజకవర్గాలు:	05
పోలింగ్ బూత్‌లు:	2,439
ఎన్నికల బరిలో అభ్యర్థులు:	126
బ్యాలెట్ యూనిట్లు:	6,422
కంట్రోల్ యూనిట్లు:	3050
వీవీ ప్యాట్లు:	3,373
మొత్తం పోలింగ్ సిబ్బంది:	12,510
సమస్యాత్మక కేంద్రాలు:	454
జిల్లాలో మొత్తం ఓటర్లు:	28,19,067
పురుషులు:	14,59,629
మహిళలు:	13,59,057
థర్డ్‌జెండర్:	381
ఎన్నారైలు:	---
సర్వీస్ ఓటర్లు:	732



ఎన్నికల్లో 50% కంటే తక్కువ శాతం నమోదైంది. దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. ఈ నేపథ్యంలోనే ఓటేయమని ప్రజలను కోరుతూ పలు సంస్థలు తమకు తాముగా కొన్ని ఎలక్షన్ కమిషన్‌తో కలిసి ప్రచారాన్ని నిర్వహించాయి.

నినాదాలు.. నడక'థాన్'లు..

'ఈ– డేలో పాల్గొనండి.. ఇంక్ పొందండి' 'నో ఎక్స్‌క్యూజ్ డే' తదితర నినాదాలతో ప్రచారాలు ప్రింట్ ఆన్‌లైన్లలో హోరెత్తాయి. అదే విధంగా నగరంలోని కొంతమంది ప్రముఖులు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం ఈ ప్రచారాల్లో మేము సైతం అంటూ భాగం పంచుకున్నారు. ఎన్నికలపై యువతలో చైతన్యం తీసుకురావడం ఓటు వేసేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ లెట్స్ ఓట్ ఫౌండేషన్ గత 25న గచ్చిబౌలి స్టేడియంలో '5కే వాక్'ని నిర్వహించింది. ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ అయిన హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)తో పాటు పలు సంస్థలు సైకిల్ ర్యాలీలు, కాలనీ/కార్పొరేట్ సమావేశాలు మారథాన్‌ల వంటి పలు కార్యక్రమాలు నిర్వహించాయి.

ప్రశ్నించాలంటే.. పౌర బాధ్యత నిర్వర్తించాలిగా..

- 'చాలా మంది యువ టెకీలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు. కొంతమంది యువత నా ఒక్క ఓటు వేయకపోతే ఏం నష్టం జరుగుతుందనే అపోహ కూడా ఉంది. ఓటు వేసే రోజు తమ ప్రాథమిక విధిని నిర్వర్తించకుండా సినిమాకో, గుడికో, మరెక్కడికో వెళతారు. ఎన్నికల సమయంలో ఓటు వేయనప్పుడు ప్రభుత్వాల నుంచి ఏమీ కోరే హక్కు వారికి ఉండదని గుర్తుంచుకోవాలి.
- ఎన్నికల ప్రక్రియలో కూడా పాల్గొనకపోతే, ఏదైనా తమ దృష్టికి వచ్చిన సమస్య గురించి ప్రశ్నించలేరు. సరైన పాలకుల్ని ఎంచుకోవడానికి ఓటింగ్ ఒక సాధనం, అంతం కాదు '' అని లెట్స్ ఓట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేఏ చౌదరి అంటున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ 15 ఏళ్ల నుంచి ప్రతి సాధారణ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇటీవల ముగిసిన కర్ణాటక ఎన్నికల సందర్భంగా కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.
- నిరాసక్తత చూపే వారిలో చైతన్యం తీసుకురావడానికి ఈ సంస్థలు అనేక శిబిరాలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నాయి. ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఎపిక్) కోసం ఈ– రిజిస్ట్రేషన్‌కు అర్హులైన వారికి అవగాహన కల్పించడం,. ఈ– రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేయడంలో మార్గదర్శకాలను తెలియజెప్పి ప్రోత్సహించడం. హైసియా సభ్యుల సమక్షంలో డిజిటల్ వాక్‌లు సైతం ప్రోత్సహించాయి. వీటన్నింటి ఫలితంగా పోలింగ్ శాతం పెరగాలని, అత్యధిక శాతం నగరవాసులు ఓటెత్తాలని ఆశిద్దాం.



నిజాం కాలేజీ గ్రౌండ్‌లో...



ఓటేసి వెళ్లండి

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సర్వం సిద్ధమైంది. నగరవాసులు ఓటెత్తడమే తరువాయి మిగిలింది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. నేటి ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశాం. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 652 పోలింగ్ కేంద్రాల ఆవరణల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం . ఈవీఎంలు తదితర ఎన్నికల సామగ్రిని అధికారులు పోలింగ్ కేంద్రాలకు తరలించాం. అవసరమైన ఏర్పాట్లన్నీ చేశాం, వచ్చి ఓటేసి వెళ్లమని కోరుతున్నాం.

– రోనాల్డ్‌రాస్, జీహెచ్ఎంసీ కమిషనర్

వేలెత్తి చూపాలంటే.. వేలితో ఓటేయాలంతే..

పనులన్నింటినీ పక్కన పెట్టండి

ఓటు వేయడమే పనిగా పెట్టుకోండి

పౌరులుగా బాధ్యతలను నిర్వర్తించాలి

ఈసారి ఓటింగ్ శాతం అదిరిపోవాలి



జేబీఎస్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: మన ఇంటికి వెళ్లే రోడ్డులోని గుంతల నుంచి మనం పనిచేసే సంస్థకు సంబంధించిన పారిశ్రామిక విధానంలోని లొసుగుల వరకు.. దేన్ని ప్రశ్నించాలన్నా మనకు నోరు ఉంటే చాలదు. మనం ఓటు హక్కును కూడా వినియోగించుకోవాలి. కొన్నేళ్లుగా ఓటు పట్ల నిరాసక్తతను తొలగించడానికి స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, అధికార/అనధికార సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహించాయి. ఓటేసే దిశగా నడిపేందుకు కాదేదీ ప్రచారానికనర్హం అన్నట్టుగా కబడ్డీ, వాలీబాల్, బైక్ ర్యాలీలు, వాకథాన్‌లు కొనసాగాయి. గతానికి భిన్నంగా 'ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో కార్యక్రమాలు నిర్వహించాయి.

గతం.. కాదు ఘనం..

మున్సిపల్ ఎన్నికల నుంచి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల వరకు, దేశంలోనే అత్యల్పంగా ఓటింగ్ నమోదైన నగరాల్లో ఒకటిగా నిలిచిన చరిత్ర మన నగరానికి ఉంది. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో 70% కంటే ఎక్కువ పోలింగ్ క్రమం తప్పకుండా కనిపిస్తుంటే.. మన నగరంలో మాత్రం గత అసెంబ్లీ

పోలింగ్ క్యూ తెలుసుకోండిలా..

నగరంలో శాతం పెంచే చర్యల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తొలిసారిగా ఒక సదుపాయాన్ని కల్పించారు. ఓటర్లు ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి చూసే ఇబ్బంది లేకుండా తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది.. అక్కడ ఎన్ని గంటలకు ఎంతమంది క్యూలో ఉన్నారో తెలుసుకునేందుకు, వేచి ఉండాల్సిన దాదాపు సమయాన్ని కూడా తెలిపేలా ప్రత్యేక సదుపాయం తెచ్చారు. జీహెచ్ఎంసీ వెబ్‌పోర్టల్ నుంచి గాని, మైజీహెచ్ఎంసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని గాని దీన్ని పొందవచ్చు.

క్యూ వివరాలు ఇలా తెలుసుకోవచ్చు.

విండోలో కనిపించే 'పోల్ క్యూ రూట్'–నో ద క్యూ స్టేటస్ ఆఫ్ యువర్ పీఎస్'లోకి వెళ్లాలి. సూచించిన విధంగా నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం ఎంటర్ చేయాలి. పోలింగ్ కేంద్రం లొకేషన్, పోలింగ్ కేంద్రం నెంబరు వివరాలు కనిపిస్తాయి. 'డైరెక్షన్స్' అని ఉన్న చోట ఎంటర్ చేస్తే గూగుల్‌మ్యాప్ నేవిగేషన్‌ద్వారా దారి, మీకు ఎంత దూరంలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. దాంతోపాటు ఎంతమంది క్యూలో ఉన్నదీ తెలుస్తుంది. అంతేకాదు ఎంతసేపు వేచి ఉండాల్సి వస్తుందో కూడా అంచనా సమయాన్ని తెలియజేస్తుంది.

టెకీలు ఓటేసేలా..

నగరంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కార్పొరేట్ సంస్థలు రంగంలోకి దిగాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని పలు ఐటీ కంపెనీలు ఉద్యోగులు సెలవు ప్రకటించగా.. బహుళ జాతి కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్‌ను అందించాయి. దీంతో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులు, యువ ఓటర్లు సిద్ధమయ్యారు. సొంతూర్లలో ఓటు ఉన్న వారు ఊర్లకు బయలుదేరారు. గ్రేటర్‌లో సుమారు 1,500 ఐటీ కంపెనీల్లో 9.05 లక్షల మంది ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగులు ఉన్నారు.

రెండో రోజూ.. సొంతూరు రద్దీ

సాక్షి, సిటీబ్యూరో: సొంతూరిలో ఓట్ల పండగకు నగరవాసులు పోటెత్తారు. బుధవారం రెండోరోజూ భారీగా స్వగ్రామాలకు తరలివెళ్లారు. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లలో రద్దీ కనిపించింది. మహాత్మాగాంధీ, జూబ్లీ, దిల్‌సుఖ్‌నగర్ తదితర బస్‌స్టేషన్‌లు, ఉప్పల్, ఎల్‌బీనగర్ వంటి కూడళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. సొంత వాహనాల్లోనూ, ఆయా రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లోనూ నగరవాసులు సొంతూళ్లకు బయలుదేరారు. కాగా ఎన్నికల విధుల కోసం నగరంలోని సిటీ బస్సులను పెద్ద సంఖ్యలో వినియోగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించడంతో పాటు, పోలీసులు, ఎన్నికల సిబ్బందికి రవాణా సదుపాయం కల్పించేందుకు సుమారు 500 వరకు సిటీ బస్సులను వినియోగిస్తున్నట్లు అంచనా. అలాగే స్కూల్ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన వాహనాలను కూడా అందుబాటులో ఉంచారు.



ఈవీఎంలు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో..

నేడు పార్కుల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికల సందర్భంగా గ్రేటర్‌లోని హెచ్‌ఎండీఏ పార్కులన్నింటినీ గురువారం మూసి ఉంచనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు నెక్లెస్‌రోడ్డులోని లుంబినీ, ఎన్టీఆర్‌పార్కు, లేక్‌వ్యూ, తదితర పార్కులలలో సందర్శకులకు ప్రవేశం ఉండదు.

ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టివేత

గచ్చిబౌలి: ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు వాహనాల తనిఖీలో ఖాజాగూడలో రూ.1.60 కోట్లు పట్టుకున్నారు. ఇన్నోవా వాహనంలో కోటి 60 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌ తెలిపారు. ఇవి జడ్చర్ల కాంగ్రెస్‌ అభ్యర్థి అనిరుద్‌రెడ్డికి సంబంధించినవని పోలీసులు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్‌ సంతృప్తి

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ భారతి హోళీకేరి బుధవారం సందర్శించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పరిశీలించారు. అందులో భాగంగా శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్‌ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌లో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఆ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా....? లేదా....? అనే అంశాలను ఆమె ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్‌ సామగ్రిని పక్కాగా అందించాలని చెక్‌లిస్ట్‌ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా....? లేదా....? అని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని కలెక్టర్‌ ఎన్నికల అధికారులకు సూచించారు. పోలింగ్‌ సిబ్బందితోపాటు ఓటింగ్‌ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కూడా ఆమె పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్‌ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేస్తుండాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్‌ఓలకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్‌ కూడా ప్రశాంతంగా జరిగేలా ఆమె తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్‌ వెంట రిటర్నింగ్‌ అధికారి బి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

థర్మకోల్‌ పరిశ్రమలో అగ్నిప్రమాదం




శంషాబాద్‌: థర్మకోల్‌ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. గగన్‌పహాడ్‌ రైల్వే ట్రాక్‌ సమీపంలో ఉన్న రంగోలి ఈపీఎస్‌ పేరు మీద ఉన్న థర్మకోల్‌ పరిశ్రమలో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే అగ్నిమాపకసిబ్బందికి సమాచారం అందించారు. ఆరు అగ్నిమాపక బృందాలు పరిశ్రమ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. సుమారు ఆరులక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. పరిశ్రమలో పనిచేసే వారు హుటాహుటిన బయటికి పరుగులు తీశారు. ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌లో వాకథాన్‌

లక్డీకాపూల్‌ : మూవ్‌మెంట్‌ డిసార్డర్స్‌ సమస్యల పరిష్కారానికి నిమ్స్‌ యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప పేర్కొన్నారు. వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి, అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బుధవారం నిమ్స్‌లో ప్రపంచ మూమెంట్‌ డిసార్డర్‌ దినోత్సవం సందర్భంగా వాక్‌థాన్‌ జరిగింది. నిమ్స్‌ న్యూరాలజీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిమ్స్‌ డీన్‌ డాక్టర్‌ లిజా రాజశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ.. మూమెంట్‌ డిసార్డర్‌ సమస్యతో బాధపడేవాళ్లు శరీరంలో కదలికలు లేకుండా ఉండే ప్రమాదం ఉందని, దాని వల్ల ఆయా వ్యక్తులు తమ తమ జీవనగమనంలో స్తబ్దత నెలకొంటుందన్నారు. ఫలితంగా ఏం చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా కదలకపోవడం రుగ్మతను ఎదుర్కొంటారన్నారు. తొలుత నిమ్స్‌ క్యాంపస్‌లోని ట్రామా బ్లాక్‌ నుండి ఓల్డ్‌ ఎంట్రన్స్‌ వరకు మూమెంట్‌ డిసార్డర్స్‌ ఉన్న రోగులకు మద్దతుగా న్యూరాలజీ, ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం, న్యూరోసర్జరీ, ఫిజియోథెరపీ, నర్సింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన సీనియర్‌ వైద్యనిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైలెంట్‌ వాక్‌ నిర్వహించారు.ఢిల్లీ ఎయిమ్స్‌ నుంచి డాక్టర్‌ దీప్తి, ఎన్‌ఐఎంహెచ్‌ఏఎన్‌ఎస్‌ వైద్యులు డాక్టర్‌ రవి యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నవతరం.. ఉత్సాహం

ఓటు వేసేందుకు ఉత్సాహంగా తొలిసారి ఓటర్లు



హైదరాబాద్‌, రంగారెడ్డిలో 1.70 లక్షలకు పైగా యువ ఓటర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌ వేదికగా నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువ ఓటర్లు కీలకంగా మారనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపోటముల్లో యువతరం ఓట్లు ప్రభావం చూపనున్నాయి. గ్రేటర్‌లో దాదాపు లక్షా డెబ్బై వేలకు (హైదరాబాద్‌లో 77,522; రంగారెడ్డిలో 92,540) పైగా తొలిసారి ఓటర్లు ఉండటం ఇందుకు నిదర్శనం. ఈ ఎన్నికల సందర్భంగా తొలసారి ఓటు హక్కు పొందిన ఓటర్లు తమ భవిష్యత్‌ నిర్దేశకులను ఎన్నుకోవడంలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు సాగుతామని నినదిస్తున్నారు. యువతరం రాజకీయాల్లోనూ రాణిస్తూ సామాజికంగా యువత ప్రాధాన్యతను మరింత పెంచాలని తొలిసారి ఓటర్లు ఆశిస్తున్నారు.

ఓటుపైనే భవిష్యత్‌ ఆధారపడి ఉంది



ఐదేళ్లకోసారి వేసే ఒక్క ఓటుపైనే అందరి భవిష్యత్‌ ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో యువకులే కాకుండా ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి. విద్య, ఉద్యోగాల విషయంలో యువకులకు ప్రోత్సాహమందించే అభ్యర్థులకు, పార్టీకి నా ఓటును వేస్తాను. ఈ సారి ఎన్నికల్లో తొలిసారి ఓటర్ల సంఖ్య మరింతగా పెరగడం శుభ పరిణామం.

–కీర్తి, నర్సింగ్‌ విద్యార్థిని, బంజారాహిల్స్‌

ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు..



ప్రజాస్వామ్య వ్యవస్థలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నందుకు గర్వంగా ఉంది. ఓటు చాలా బాధ్యతాయుతమైన ఆయుధం. యువకుడిగా మొదటి సామాజిక బాధ్యతగా ఓటును సరైన నాయకుడికి వేయడం నా బాధ్యత. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా విధానాల్లో మరిన్ని నూతన మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా నాయకులు కృషి చేయాలని ఆశిస్తున్నాను.

–అనిరుధ్‌, బీ.టెక్‌ విద్యార్థి, మియాపూర్‌

ప్రలోభాలకు లొంగరాదు



మరో ఐదేళ్ల పాటు మన భవిష్యత్‌ రాజకీయ నాయకుల చేతుల్లో ఉంటుంది. కాబట్టి నాయకుడిని ఎన్నుకునే ముందు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యయుతంగా ఓటు వేయాలి. మొదటిసారి ఓటు వేస్తున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉంది. మన భవిష్యత్‌ నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియలో నేనూ భాగమవుతున్నందుకు ఆనందంగా ఉంది.

–శివాణి, బీ.టెక్‌, విద్యార్థిని, నాగోల్‌

సోషల్‌ మీడియా మాయలో పడకుండా..



ఈ సారి ఎన్నికల్లో సోషల్‌ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంది. తొలిసారి ఓటర్లు ఈ సోషల్‌ మీడియా మాయలో పడే అవకాశం ఎక్కువగా ఉంది. మొదటిసారి పొందిన ఓటు హక్కును సామాజికంగా మంచి భవిష్యత్‌కు భరోసా ఇచ్చే అభ్యర్థిని ఎన్నుకోవడానికే వేస్తాను. అన్ని రంగాల్లో దేశ అభివృద్ధిలో యువతరం కీలక పాత్ర పోషిస్తుంది. రాజకీయాలకతీతంగా సమర్థవంతమైన నాయకులను ఎన్నువడానికే మా నవతరం కృషి చేస్తుందని భావిస్తున్నాను.

–సయ్యద తహనియత్‌ ముక్తదిర్‌, అంబర్‌పేట్‌

నచ్చితే నాయకునికి.. లేదా నోటాకు...



ఈ అవకాశం కోసం గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. ప్రజాపాలనకు అత్యుత్తమ నాయకులను ఎన్నుకోవడం కీలకమైన బాధ్యత, ఆ బాధ్యత నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నాను. మంచి నాయకులను ఎన్నుకోవాలి, లేని పక్షంలో నోటాకైనా ఓటును వేయాలి.,కానీ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఉండకూడదు.

–మణి, బీ.టెక్‌ విద్యార్థి, చిలకానగర్‌

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

రూ.169 కోట్ల విలువ చేసే సొత్తు, నగదు స్వాధీనం

- సైబరాబాద్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర



సైబరాబాద్‌ కమిషనరేట్‌ కంట్రోల్‌ రూమ్‌లో పరిశీలిస్తున్న సీపీ స్టీఫెన్‌ రవీంద్ర



రాయదుర్గం: సైబరాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని సైబరాబాద్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర తెలిపారు. ఇప్పటివరకు జరిగిన తనిఖీల్లో మొత్తం రూ.169.30 కోట్ల సొత్తు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ కమిషనరేట్‌లో సీపీ ఈ వివరాలు వెల్లడించారు. రూ.99.53 కోట్ల విలువ చేసే బంగారు, వెండి, డైమండ్స్‌ ఆభరణాలను, రూ.62.60 కోట్ల నగదు, రూ.1.29 కోట్ల విలువ చేసే మద్యం, రూ.3.26 కోట్ల విలువ చేసే గంజాయి, రూ.2.57 కోట్ల విలువచేసే ఫ్రీబీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్‌ పరిధిలో 23 ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ బార్డర్‌ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేశామన్నారు. 825 చోట్ల నాకాబందీ చేసి తనిఖీలు చేయడం ద్వారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రౌడీ షీటర్లు, ఇతరులను అదుపులోకి తీసుకొని బైండోవర్‌ చేశామన్నారు. లైసెన్సులు కలిగిన ఆయుధాలను కూడా స్వాధీనం చేయాలని ఆదేశించారు.

స్వేచ్ఛగా ఓట్లు వేసేలా ఏర్పాట్లు

సైబరాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో నాలుగు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చెల్‌, సంగారెడ్డి, హైదరాబాద్‌లోని కొంత ప్రాంతంలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 3,202 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏడుగురు ఏసీపీలను నోడల్‌ ఆఫీసర్లుగా నియమించారు. 259 రూట్‌ మొబైల్స్‌, 27 ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌ టీమ్స్‌(ఎఫ్‌ఎస్‌టీ), 24 స్టాటిక్‌ సర్వైలెన్స్‌ టీమ్స్‌ (ఎస్‌ఎస్‌టీ) 24 మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కాండక్ట్‌(ఎంసీసీ) టీమ్స్‌ను విధుల్లో నియమించారు. సైబరాబాద్‌ పరిధిలో 655 పోలింగ్‌ స్టేషన్లను క్రిటికల్‌పోలింగ్‌ స్టేషన్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాలలో ప్రత్యేకంగా పారామిలటరీ ఫోర్స్‌ సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా మొత్తం 103 క్యూఆర్‌టీ/స్ట్రైకింగ్‌ ఫోర్స్‌లు, 40 స్పెషల్‌ స్ట్రైకింగ్‌ ఫోర్సెస్‌ను కూడా ఏర్పాటు చేయడం విశేషం. మొత్తం 6,400 పోలీసు సిబ్బందిని ఎన్నికల విధులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

భారీ సెక్యూరిటీ

సైబరాబాద్‌ పరిధిలో ఆరు డిస్ట్రిబ్యూషన్‌, ఆరు రిసెప్షన్‌సెంటర్లు, రెండు కౌంటింగ్‌ సెంటర్లలో కూడా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మూడంచెల భద్రతను ఈవీఎం, వీవీపీఏటీ మిషన్లకు కల్పించారు.ఈ ప్రాంతాలలో సీఏపీఎఫ్‌, టీఎస్‌ఎస్పీ, ఆర్మ్‌డ్‌ బలగాలు, సివిల్‌ పోలీసులను నియమించారు. ప్రతి పోలింగ్‌ స్టేషన్‌కు జీఐఎస్‌ జీఐఎస్‌ అప్లికేషన్‌ లను పీఎస్‌ఐఓసీ కేంద్రాలకు కల్పించారు. వాహనాలకు జీఐఎస్‌ అప్లికేషన్‌, జీపీఆర్‌ఎస్‌లను వాహనాలన్నింటికీ అమర్చి పంపుతారు.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం ఓటు హక్కును వినియోగించుకోవడానికి కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్‌(జేసీఎల్‌) శ్యామ్‌ సుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు వారి ఓటు హక్కు వినియోగించునే అవకాశం కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. లేని పక్షంలో చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు.

చిన్నారుల కోసం ‘హెల్త్‌ ఫార్ములా’

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల సమగ్ర ఆరోగ్యానికి దోహదపడే విధంగా 8-5-1-0 పేరిట హెల్త్‌ ఫార్ములాను రూపొందించినట్టు ఫ్యూచర్‌ ఫుడ్‌ ఫౌండేషన్‌ సీఈఓ పవన్‌ అగర్వాల్‌ తెలిపారు. మాదాపూర్‌లోని నోవోటెల్‌ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు 8 గంటల నిద్ర, 5 రకాల పండ్లు–కూరగాయలు ఆహారంలో భాగం కావాలని, ఒక గంట శారీరక శ్రమ చేయాలని, హానికర ఆహారం సున్నా (0)గా ఉండాలని సూచిస్తూ ఈ హెల్త్‌ ఫార్ములా రూపొందినట్టు వివరించారు. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమగ్ర అవగాహన కలిగించాలని కోరారు. కంట్రీ డిలైట్‌ సంస్థకు చెందిన చక్రధర్‌, మిల్లెట్‌ బ్యాంక్‌ వ్యవస్థాపకులు విశాల రెడ్డి, పలువురు నగర పాఠశాలల ప్రతినిధులు హాజరయ్యారు.

ఓటుకు వేళాయె..

నేడే పోల్‌ ఫైట్‌

- ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్‌
- 8 నియోజకవర్గాలు.. 209 మంది అభ్యర్థులు
- 3,453 పోలింగ్‌ కేంద్రాల్లో 35,23,219 మంది ఓటర్లు
- 1,541 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే సిబ్బంది ఎలక్షన్‌ సామగ్రితో పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నారు. కలెక్టర్‌, సీపీలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్‌ అమలులోకి తెచ్చారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్‌ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 209 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. అత్యధికంగా ఎల్బీనగర్‌లో 48 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 3,453 పోలింగ్‌ కేంద్రాల పరిధిలో మొత్తం 35,23,219 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో అత్యధికంగా శేర్‌లింగంపల్లి నియోజకవర్గంలో 7,32,587 మంది ఓటర్లున్నారు. అదే విధంగా ఎంపిక చేసిన డిస్ట్రిబ్యూషన్‌ కేంద్రాల నుంచి 9,943 బ్యాలెట్‌ యూనిట్లు, 5483 కంట్రోల్‌ యూనిట్లు, 5389 వీవీప్యాట్‌లు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్‌ కేంద్రాలకు చేర్చారు. 2,990 పోలింగ్‌ కేంద్రాల్లో తొలిసారిగా వెబ్‌క్యాస్టింగ్‌ ఏర్పాటు చేశారు. వీటిలో 1541 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. ఆయా పోలింగ్‌ కేంద్రాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది. ఇప్పటికే పారామిలటరీ దళాలు పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నాయి.

ఉదయం 5.30గంటలకు మాక్‌పోలింగ్‌

పోలింగ్‌ నిర్వహణకు 15,212 మంది ఉద్యోగులను కేటాయించింది. ఇప్పటికే వారంతా మూడు దఫాలుగా శిక్షణ పొంది, వీవీప్యాట్‌లు తదితర సామగ్రితో పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 5.30 గంటలకు ఏజెంట్‌ల సమక్షంలో మాక్‌ పోలింగ్‌ నిర్వహించనున్నారు. ఈవీఎంల పనితీరును పరిశీలించి అంతా సవ్యంగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే పోలింగ్‌ ప్రక్రియ ప్రారంభించనున్నారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్‌ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్‌ అమలు చేయడంతో పాటు ఆయా మార్గాల్లో పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల లోపు పోలింగ్‌ కేంద్రానికి చేరుకున్న వారికి మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఎన్నికల కమిషన్‌ సూచించిన 13 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డును వెంట తీసుకెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్‌ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌ సహా ఇతర ఎలక్ట్రానిక్స్‌ వస్తువులకు అనుమతి లేదు.

గందరగోళానికి తావు లేకుండా

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ భారతి హోళీకేరి బుధవారం పలు డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌లను సందర్శించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు సంబంధించి మంగల్‌పల్లి సీవీఆర్‌ ఇంజనీరింగ్‌ కాలేజీలో, రాజేంద్రనగర్‌ నియోజకవర్గానికి అగ్రికల్చర్‌ యూనివర్సిటీలో, ఎల్బీనగర్‌ నియోజకవర్గానికి సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియం, చేవెళ్ల నియోజకవర్గానికి ఫరా ఇంజినీరింగ్‌ కళాశాలలో, షాద్‌నగర్‌ నియోజకవర్గానికి మినీస్టేడియంలో డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్‌ ఎన్నికల సాధారణ పరిశీలకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్‌ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్‌ ఆరా తీశారు. ఈవీఎంల పని తీరును వివరిస్తున్న తీరును గమనించారు. గందరగోళానికి తావు లేకుండా సరి చూసుకోవాలని కలెక్టర్‌ హితవు పలికారు.

ఓటు హక్కే కాదు.. బాధ్యత

ఓటు హక్కే కాదు.. బాధ్యత కూడా. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ విధిగా ఓటింగ్‌లో పాల్గొనాలి. పోలింగ్‌ శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం అన్ని సంస్థలకు సెలవు ప్రకటించింది. పలువురు ఓటర్లు ఇంటికి పరిమితమవుతుండగా.. మరికొందరు విహార యాత్రలు, దైవదర్శనాల పేరిట ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇది సరి కాదు. ఓటు విలువను భావితరాలకు తెలపాల్సిన బాధ్యత ప్రతీ ఓటరుపై ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. సమాజానికి పట్టిన చీడను వదిలించాలంటే ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా.. శాంతియుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలి.


– భారతి హోళీకేరి, జిల్లా ఎన్నికల అధికారి



డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ వద్ద పోలింగ్‌ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్‌

రంగారెడ్డి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలింగ్‌ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు	విధుల్లో ఉన్న సిబ్బంది	పోటీలో ఉన్న అభ్యర్థులు
ఇబ్రహీంపట్నం	3,27,657	343	143	1,512	28
ఎల్బీనగర్‌	5,93,774	573	374	2,524	48
మహేశ్వరం	5,46,713	542	233	2,388	27
రాజేంద్రనగర్‌	5,82,114	542	263	2,388	25
శేర్‌లింగంపల్లి	7,32,587	638	263	2,808	31
చేవెళ్ల	2,62,084	298	57	1,312	12
కల్వకుర్తి	2,41,898	262	80	1,156	24
షాద్‌నగర్‌	2,36,392	255	128	1,124	14


ఖైరతాబాద్ అభివృద్ధికి పాటుపడే వారిని,
మీకు అందుబాటులో ఉండేవారిని
అసెంబ్లీకి పంపించండి
వ.నం
అభ్యర్థి పేరు
ఫోటో
గుర్తు
1
చింతల రామచంద్రారెడ్డి
2
3
4
5
6
7
పోలింగ్ తేది :
30 నవంబర్, 2023
సమయం :
ఉ. 7 గం.ల నుండి
సా. 5 గం.ల వరకు
బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి...ఖైరతాబాద్ రూపురేఖల్ని మనమంతా కలిసి మార్చుదాం. అధికార, ధన బలంతో కాదు ప్రజాబలంతో ముందుకెళ్తున్న నన్ను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి
కమలం పువ్వు
గుర్తుకు ఓటేద్దాం
చింతల రామచంద్రారెడ్డి
ఖైరతాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి

నాలుగైదేళ్లలో జన్యు సవరణ జొన్నలు, రాగులు!

- 'సాక్షి సాగుబడి'తో ఐసీఏఆర్ డీడీజీ డా. టి.ఆర్.శర్మ



సాక్షి సాగుబడి, హైదరాబాద్: చిరుధాన్య వంగడాల అభివృద్ధికి జన్యు సవరణ (జీనోమ్ ఎడిటింగ్) సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్స్) డాక్టర్ టి.ఆర్.శర్మ వెల్లడించారు. అంతర్జాతీయ చిరుధాన్య సమ్మేళనం 5.0 ముగింపు ఉత్సవంలో పాల్గొనేందుకు మంగళవారం హైదరాబాద్ వచ్చిన శర్మ 'సాక్షి సాగుబడి'తో మాట్లాడారు. పోషకాల నాణ్యతను పెంపొందించడానికి, 'యాంటీ న్యూట్రియంట్ల'ను పరిహరించడానికి జొన్న, రాగి విత్తనాలకు జన్యు సవరణ ప్రక్రియ చేపట్టినట్లు డా. శర్మ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. చిరుధాన్యాలపై పరిశోధనలు శైశవ దశలో ఉన్నాయని, ఈ వంగడాలు అందుబాటులోకి రావటానికి 4–5 ఏళ్ల సమయం పడుతుందన్నారు. మెరుగైన చిరుధాన్యాల వంగడాల అభివృద్ధి దిశగా ఇప్పటికే అభివృద్ధి సాధించామని, ఈ కృషిలో భాగంగానే జన్యు సవరణ (జీనోమ్ ఎడిటింగ్) సాంకేతికతను కూడా చేపట్టామని తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో రానున్న కాలంలోనూ చిరుధాన్యాల ప్రోత్సాహానికి సంబంధిత వర్గాలన్నీ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సమ్మేళనంలో వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి, రానున్న పదేళ్లలో చిరుధాన్యాల అభివృద్ధికి చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళికను త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఆహార వ్యవస్థలో చిరుధాన్యాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావాలని డా. శర్మ సూచించారు.



మురిపించిన.. మంచు

మరో కశ్మీర్‌గా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లాలో మంచు మురిపిస్తోంది. వాతావరణం మార్పుతో ఆదిలాబాద్ పట్టణంలో చిన్నచిన్న చినుకులు కురుస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు చలితో అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిపై ఉదయం మంచు కమ్ముకోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆహారం.. ఆయుర్దాయం

సమతుల్య ఆహారంతో ఆయుర్దాయం గణనీయంగా పెరుగుదల

- 40 ఏళ్ల వయస్కుల్లో దాదాపు 10 ఏళ్ల జీవితకాలం వృద్ధి
- నార్వేలోని బెర్గెన్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- ఈట్‌వెల్ గైడ్/దీర్ఘాయువు ఆహారం తీసుకునే వారిలో మెరుగైన జీవితకాలం
- చక్కెర, తీపి, శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన మాంసంతో ఆరోగ్యానికి చేటు
- తృణధాన్యాలు, గింజలు, కూరగాయలు, పండ్లతో మేలైన ఆరోగ్యం.. ఆయుష్షు
- విచ్చలవిడి ఆహారంతో మధుమేహం.. తద్వారా తీవ్ర మానసిక రుగ్మతల ప్రమాదం



సాక్షి, అమరావతి: పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆయుర్దాయం గణనీయంగా పెంచుకోవచ్చని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా మధ్య వయస్కుల్లో జీవిత కాలం ఏకంగా 10 ఏళ్ల వరకు పెరుగుతుందని తేలింది. నేచర్ ఫుడ్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. నార్వేలోని బెర్గెన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు యూకే బయో బ్యాంక్ నుంచి దాదాపు 5 లక్షల మందికిపైగా ప్రజల ఆహారపు అలవాట్లను విశ్లేషించారు. దాదాపు 2006 నుంచి చేపట్టిన దీర్ఘకాలిక పరిశోధనలో బ్రిటిష్ వ్యక్తుల ఆహార విధానం, అలవాట్లను సమగ్రంగా పరిశీలించి ఆయుర్దాయ ప్రభావాన్ని నిర్ధారించారు.

40 ఏళ్ల వయసులో మార్చుకున్నా..

ఈ అధ్యయనంలో పరిశోధకులు వ్యక్తుల్లోని రెండు రకాల ఆహారపు అలవాట్లను ట్రాక్ చేశారు. ఇందులో ఒకటి సగటు/అనారోగ్యకర ఆహారపు అలవాట్లు కాగా.. మరొకటి యూకే ఈట్‌వెల్ గైడ్/పరిశోధకులు పిలిచే 'దీర్ఘాయువు ఆహారం' తీసుకునే వారి ఆరోగ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ధూమపానం, మద్యపానం, వ్యాయామం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఇక్కడ అనారోగ్యకర ఆహారం నుంచి ఆరోగ్యకర ఆహారానికి మారిన 40 ఏళ్ల పురుషులు, మహిళలు సగటున 9–10 ఏళ్లు ఎక్కువ ఆయుర్దాయం పొందినట్టు కనుగొన్నారు. ఇందులో ఈట్‌వెల్ గైడ్ ఆహార సిఫారసులు అనుసరించడంతో పురుషులు 8.9 ఏళ్లు, మహిళలు 8.6 ఏళ్లు ఎక్కువ కాలం జీవించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. చక్కెర, తీపి, శీతల పానీయాలు, ప్రాసెస్ చేసిన మాంసాన్ని తగ్గించి.. వీటి స్థానంలో తృణధాన్యాలు, గింజలు, మొలకలు, పండ్లను తీసుకోవడంతో ఆయుష్షుకు అదనంగా పురుషులు 10.8 ఏళ్లు, మహిళలు 10.4 ఏళ్లు జోడించినట్టు గుర్తించారు.

వృద్ధాప్యంలో మారినా..

70 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యకర ఆహారాన్ని స్థిరంగా తీసుకుంటే వారి జీవిత కాలం సుమారు 4–5 ఏళ్లు పెరుగుతోంది. ఈ క్రమంలోనే యూకేలో ఆరోగ్య కేంద్రీకృత ఆహార పన్నులు అమలు చేయడం, పాఠశాలల్లో మంచి ఆహారం అందించడం, ఆరోగ్యకర ఆహారాల ధరలు తగ్గించడం, సబ్సిడీలు పెంచడం ద్వారా ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చాలని అధ్యయనం సూచిస్తోంది.

ఈట్‌వెల్ గైడ్ అంటే..

యూకేలోని పోషకాహార శాస్త్రీయ సలహా కమిటీ సిఫారసుల మేరకు 2015లో ఈట్‌వెల్ గైడ్‌ను పరిచయం చేశారు. ఇందులో ఐదు రకాల ఆహార పదార్థాలను చేర్చారు. దీని ప్రకారం ఆరోగ్యకర జీవితానికి విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్లు అధికంగా ఉండే ఐదు రకాల పండ్లు/కూరగాయలను రోజూ ఆహారంగా తీసుకోవాలి. బంగాళదుంపలు, గోధుమ రొట్టెలు, బియ్యం, పాస్తా, ఇతర పిండి పదార్థాలతో ప్రాథమిక భోజన మెనూను అలవర్చుకోవాలి. తినే ఆహారంలో మూడో వంతు కంటే ఎక్కువ పిండి పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. హోల్ వీట్, బ్రౌన్ రైస్ వంటి అధిక ఫైబర్లు, హోల్ గ్రెయిన్ రకాలను ఆహారంగా ఎంపిక చేసుకోవాలి. కొన్ని రకాల బీన్స్, పప్పులు, చేపలు, గుడ్లు, మంచి మాంసం, ఇతర ప్రోటీన్ ఆహారాలు క్రమం తప్పకుండా తినాలి. ఎముకలను దృఢంగా ఉంచడంలో పాలు, జున్ను, పెరుగు వంటి కాల్షియం కలిగిన పదార్థాలను ఆహారంలో మిళితం చేసుకోవాలి. ముఖ్యంగా కూరగాయల నుంచి తీసిన నూనెలు, పొద్దుతిరుగుడు, ఆలివ్ నూనెలను మితంగా వినియోగించాలి. ఇక ఉప్పు, చక్కెర, కొవ్వు అధికంగా ఉండే చాక్లెట్లు, కేకులు, బిస్కెట్లు, శీతల పానీయాలు, వెన్న, నెయ్యి, ఐస్‌క్రీమ్‌లు తగ్గించాలి. రోజుకు 6–8 గ్లాసుల నీటిని తాగాలి. నిర్దిష్ట పద్ధతిలో శరీరానికి తగినంత మోతాదులో ఈట్‌వెల్ గైడ్‌ను అనుసరిస్తే చింతలేని ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మంచి ఆహారంతో మధుమేహానికి చెక్

నిశ్చల జీవనశైలి, విచ్చలవిడి ఆహార అలవాట్లు ఒక వ్యక్తి మానసిక, శారీరక ఆరోగ్యాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ వెల్లడించింది. ముఖ్యంగా మధుమేహం రావడంతో ఎక్కువ మానసిక సమస్యలు, నిత్యం డిప్రెషన్‌కు గురవుతారని పేర్కొంది. తాజాగా పరిశోధకులు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పాలతో కూడిన ఆహారాన్ని తినడంతో టైప్-2 డయాబెటిస్, డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి మానసిక ఆరోగ్య రుగ్మతలు వచ్చే ప్రమాదం తగ్గుతుందని గుర్తించారు. ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్–డి, విటమిన్–ఈ, విటమిన్–బీ6, విటమిన్–బీ12, ఫోలేట్, సెలీనియం, క్రోమియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాల కొరత మధుమేహం, మానసిక రుగ్మతలకు కారణంగా కనుగొన్నారు.

తియ్యగా లాగించేస్తున్నారు!

- నెలలో కనీసం మూడుసార్లు సంప్రదాయ స్వీట్లు తింటున్నామన్న 41 శాతం మంది పట్టణ ప్రాంత వాసులు
- 74 శాతం పట్టణ ప్రాంత వాసులు బిస్కెట్లు, కేకులు తింటున్నట్టు వెల్లడి
- ఐస్‌క్రీమ్‌లు తినడం ఇష్టపడతామని చెప్పినవారు 44 శాతం
- దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడి


సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రాంతవాసుల ఆహారంలో తీపి పదార్థాల శాతం పెరుగుతోంది. దేశవ్యాప్తంగా లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఇదే విషయం వెల్లడైంది. ప్రతి నెలలో కనీసం మూడుసార్లు భారతీయ సంప్రదాయ తీపి పదార్థాలు తింటామని సర్వేలో పాల్గొన్న 41 శాతం మంది పట్టణ ప్రాంత వాసులు అంగీకరించారు. రోజూ స్వీట్లు లేనిదే కష్టమని 8 శాతం మంది తేల్చేశారు. ఇక బిస్కెట్లు ఇతర బేకరీ ఉత్పత్తులు సైతం వారి రోజువారీ ఆహారంలో భాగమవుతున్నాయి. చాయ్ తాగుతూ ఇష్టమైన బిస్కెట్లు తినేవారు పెరుగుతున్నారని ఈ సర్వేలో వెల్లడైంది. బేకరి వస్తువులు సైతం రోజూ తినేవారు 31 శాతానికి చేరినట్టు సర్వే వివరిస్తోంది. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో తీపి పదార్థాలు తింటున్నవారి వివరాలపై లోకల్ సర్కిల్స్ సంస్థ 222 జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న 41 వేల మందిని సర్వే చేయగా ఈ విధమైన ఫలితాలు వచ్చినట్టు పేర్కొన్నది. సర్వే వివరాలు ఇలా..

మీ కుటుంబంలో భారతీయ సంప్రదాయ స్వీట్లు నెలలో ఎన్ని రోజులు తింటారు..?	
రోజూ తింటాం	8 శాతం మంది
నెలలో 15 నుంచి 30 సార్లు	5 శాతం మంది
నెలలో 8 నుంచి 15 సార్లు	12 శాతం మంది
నెలలో 3 నుంచి 7 సార్లు	16 శాతం మంది
నెలలో ఒకటి లేదా రెండుసార్లు	44 శాతం మంది
అసలు తినం	13 శాతం మంది
చెప్పలేం	2 శాతం మంది

బేకరి ఉత్పత్తులైన బిస్కెట్లు, కేక్‌లు నెలలో ఎన్ని రోజులు తింటారు..?	
రోజూ తింటాం	31 శాతం మంది
నెలలో 15 నుంచి 30 సార్లు	14 శాతం మంది
నెలలో 8 నుంచి 15 సార్లు	15 శాతం మంది
నెలలో 3 నుంచి ఏడుసార్లు	14 శాతం మంది
నెలలో ఒకటి లేదా రెండుసార్లు	12 శాతం మంది
అసలు తినం	13 శాతం మంది
చెప్పలేం	1 శాతం మంది

చాక్లెట్, ఐస్‌క్రీం, క్యాండీస్ నెలలో ఎన్ని రోజులు తింటారు..?	
రోజూ తింటాం	7 శాతం మంది
నెలలో 15 నుంచి 30 సార్లు	8 శాతం మంది
నెలలో 8 నుంచి 15 సార్లు	9 శాతం మంది
నెలలో మూడు నుంచి ఏడుసార్లు	20 శాతం మంది
నెలలో ఒకటి లేదా రెండుసార్లు	37 శాతం మంది
అసలు తినం	16 శాతం మంది
చెప్పలేం	3 శాతం మంది

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 249

గురువారం 30-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కాలం అన్నింటినీ వక్కానికి తెస్తుంది:
ఏ మనిషీ పుట్టుకతో వివేకి కాదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 30 నవంబర్ 2023

సిల్‌క్యారా చేస్తున్న హెచ్చరిక

మానవ సంకల్పం ముందు శిఖరం తలొంచింది. పదిహేడు రోజులుగా కోట్లాదిమంది దేశ ప్రజానీకం మాత్రమే కాదు... దేశదేశాల పౌరులూ పడిన ఆరాటం, ఆత్రుత ఫలించాయి. ఉత్తరకాశీలోని సిల్‌క్యారా సొరంగం కుప్పకూలటంతో 422 గంటలపాటు బందీలైన 41 మంది కార్మికులు మంగళవారం సాయంత్రం సురక్షితంగా బయటపడ్డారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల నిపుణులు మొదలుకొని వైద్య నిపుణుల వరకూ అందరికందరూ రాత్రింబగళ్లు సమన్వయంతో సాగించిన కృషి ఒక ఎత్తయితే...అత్యంత కష్టసాధ్యమైన ర్యాట్ హోల్ మైనింగ్‌లో నిపుణులైన కార్మికులు చివరి 12 మీటర్ల పొడవునా వున్న శిథిలాలను ఎంతో ఓపిగ్గా, జాగ్రత్తగా తొలగించటం మరో ఎత్తు. వెరసి బందీలైనవారంతా క్షేమంగా బాహ్యప్రపంచాన్ని చూడగలిగారు. ఇలాంటి సంక్లిష్ట సందర్భాల్లో చిక్కుకున్నవారిలో సమూహ చేతన ఎంతమాత్రమూ సడలరాదన్నది మనస్తత్వ నిపుణుల మాట. బందీల్లో కనీసం ఒక్కరికైనా సద్యోజనిత నాయకత్వ లక్షణం వుంటే తప్ప ఇలాంటి సామూహిక చేతనకు అవకాశం వుండదు. 2010లో చిలీ రాగి గనుల్లో పదివారాలు చిక్కుకున్న కార్మికులైనా... మరో ఏడెనిమిదేళ్లకు ఉత్తర థాయ్‌లాండ్‌లోని కొండ గుహల్లోకి వరద నీరు ప్రవేశించటంతో పదకొండు రోజులపాటు చిక్కుకున్న ఫుట్‌బాల్ టీమ్ పిల్లలైనా క్షేమంగా బయటపడటానికి కారణం ఇదే అంటారు. భయానక పరిస్థితులు ఎదురైనప్పుడు ఎవరైనా నాలుగో రోజు వరకూ ప్రాణాలు నిలుపుకోగలిగితే మానసికంగా వారు దృఢంగా వున్నట్టేనని, ఆ తర్వాత వారు దేన్నయినా సునాయాసంగా అధిగమిస్తారని మనస్తత్వ నిపుణులు చెబుతారు. వెలుపలి ప్రపంచంలో కోట్లాదిమంది పడుతున్న తపనకు బందీలైన ఆ 41 మంది కార్మికుల దృఢచిత్తం తోడవటం వల్లనే ఇదంతా సవ్యంగా పూర్తయింది. ఆ కార్మిక కుటుంబాల మాటేమోగానీ... అశేష ప్రజానీకం ఆశానిరాశాల్లో ఊగిసలాడిన తీరు మాత్రం మరిచిపోలేనిది. మినుకు మినుకుమంటున్న ఆశలు, అంతలోనే గంపెడు నిరాశలో ముంచే పరిణామాలూ ఈ పదిహేడురోజులూ ఎవరికీ కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఆ కార్మికులు బయటికిరావటం నూటికి నూరుపాళ్లూ సాధ్యమేనని మంగళవారం సాయంత్రానికిగానీ ధ్రువపడలేదు. బందీలను విడిపించటానికి భారీ యంత్రాలను వినియోగించి కొండను తొలుస్తున్న క్రమంలో ఈనెల 16న సంభవించిన భూకంపం అన్ని రకాల ప్రయత్నాలపైనా నీళ్లుజల్లింది. ఒక దశలో పైపును అమరుస్తుండగా భారీ పగుళ్ల శబ్దాలు వినబడ్డాయి. ఈలోగా 25 టన్నుల భారీయంత్రమైన అగర్ మెషిన్‌తో తవ్వుతుండగా శిథిలాల్లో ఇరుక్కున్న ఇనుప రాడ్లు తగిలి దాని బ్లేడ్లు తెగిపడ్డాయి. ఇక ర్యాట్‌హోల్ మైనింగ్ నిపుణులు రంగంలో దిగితే తప్ప ఇది పూర్తికాదని నిర్ధారించుకుని మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి వారిని రప్పించారు.

అయితే ఈ ఆనందోత్సాహాల సందడిలో అసలు విషయం మరుగున పడకూడదు. అపార ఖనిజ సంపద వున్న దేశాలన్నిటా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చటానికీ, ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేందుకూ ప్రభుత్వాలు తపిస్తున్నాయి. ఈ క్రమంలో పర్యావరణానికి కలుగుతున్న చేటు సరే, మనుగడ కోసం మరేదీ చేయలేక ప్రాణాలకు తెగించి గనుల్లో పనిచేస్తున్న బడుగు జీవులు సమిధలవుతున్నారు. చాన్నాళ్ల క్రితమే ఎన్‌జీటీ నిషేధించిన ర్యాట్ హోల్ మైనింగ్ సిల్‌క్యారాలో కార్మికుల ప్రాణాలు కాపాడటానికి దోహదపడిన మాట నిజమే అయినా...ఇప్పటికీ చట్టవిరుద్ధంగా అలాంటి మైనింగ్ సాగుతున్నదని ఈ ఎపిసోడ్ నిరూపించింది. కేవలం ఒక మనిషి పాకుకుంటూ వెళ్లగలిగేంత కంత తవ్వుకుంటూ భూగర్భం మూలల్లో వున్న బొగ్గు లేదా ఇతర ఖనిజాలనూ సేకరించటం ఈ కార్మికుల పని. ఈ క్రమంలో ఎక్కడైనా పైకప్పు కూలిందంటే వాళ్ల బతుకులు ముగిసినట్టే. గనుల పరిసర ప్రాంతాల్లో వుంటున్నవారికే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నప్పుడు నేరుగా అందులోకి ప్రవేశించి నిత్యం ఆ దుమ్మూ ధూళితో సావాసం చేసేవారికి ఎంత ముప్పు కలుగుతుందో వేరే చెప్పనవసరం లేదు. ఇక భూమి కుంగిపోవటం, భూగర్భ జలాలు కలుషితం కావటం వంటి పర్యావరణ సమస్యలకు అంతే లేదు. ఇంతా చేసి ఇలాంటి కార్మికుల శ్రమంతా భారీ యంత్రపరికరాలపై పెట్టుబడులూ, అనుమతులు, రాయల్టీ చెల్లింపులూ లేకుండా చట్టవిరుద్ధంగా దోపిడీచేసే మైనింగ్ మాఫియాల పాలవుతోంది. కార్పొరేట్ల లాభార్జనకు దోహదపడుతోంది.

హిమశిఖరాలు ఆల్ప్స్ పర్వతశ్రేణిలా పురాతనమైనవి కాదు. అవి ఆరున్నరకోట్ల సంవత్సరాలనాటివైతే, హిమశిఖరాల వయసు నాలుగుకోట్ల సంవత్సరాలు మించదు. అందువల్లే వాటి భూగర్భంలో నిరంతర చలనం, ఒత్తిడి, అధిక ఉష్ణోగ్రత కొనసాగుతున్నాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీతో సహా 51 శాతం నేల కుంగుబాటు ప్రాంతంలో వున్నదని జర్నల్ ఆఫ్ ఎర్త్ సిస్టమ్స్ పత్రిక చాన్నాళ్ల క్రితం తెలిపింది. ఇక్కడి కొండల్లో మట్టి, రాళ్లు కలిసి వుండటం వల్ల ఈ కుంగుబాటు ప్రమాదం ఎక్కువ. గత కొన్నేళ్లుగా జోషీమఠ్ కుంగుబాటు, ఇతర ప్రాంతాల్లో సైతం భూమి నెర్రెలుబారటం ప్రమాదకర సంకేతాలందిస్తోంది. చార్‌ధామ్ యాత్రికులకూ, పర్యాటకులకూ అనుకూలంగా వుంటుందని 900 కిలోమీటర్ల మేర చార్‌ధామ్ హైవే నిర్మాణం చేపట్టారు. సిల్‌క్యారా సొరంగ నిర్మాణం దానిలో భాగమే. ఇవిగాక ఎన్నో జల విద్యుత్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టులను సమీక్షించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సిల్‌క్యారా ఉదంతం మనల్ని హెచ్చరిస్తోంది. అప్రమత్తం కావటం మనకే మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.తదియ ప.2.06 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆరుద్ర ప.3.31 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** తె.4.19 నుండి 5.59 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.07 వరకు, **అమృత ఘడియలు:** లేవు, సంకటహర చతుర్థి.

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

భద్రతా సవాళ్ల సమీక్ష లేనందునే...

సందర్భం



సి. ఉదయ్ భాస్కర్

స్వతంత్ర భారతావని ఎన్నో ఉగ్రదాడులను ఎదుర్కొంది. కానీ, పదిహేనేళ్ల క్రితం దేశ ఆర్థిక రాజధానిపై విరుచుకుపడ్డ ఐఎస్ఐ మూకల దాడి మాత్రం అత్యంత ఘోరమైందనడంలో ఎలాంటి సందేహమూ అవసరం లేదు. నిస్సహాయులైన, నిరాయుధులైన జన సామాన్యంపై పేట్రేగిన ఉగ్రమూక వందల ప్రాణాలను బలితీసుకున్న దుర్ఘటన అది. ఇంకోలా చెప్పాలంటే... భారతదేశ సార్వభౌమత్వం, భద్రతపై ఇంత స్థాయిలో ఎన్నడూ దాడి జరగలేదని చెప్పాలి. 2008 నవంబరు 26న జరిగిన ఈ ఉగ్రదాడి తొలిదశలో భారత భద్రతా వ్యవస్థ దాదాపుగా అచేతనమైందంటే కూడా అతిశయోక్తి కాబోదు. ఈ ఘటన జాతీయ భద్రత అంశంలోని సంస్థాగత లోపాలను ఎత్తి చూపింది. వాటిని సమీక్షించడానికి ఇప్పటికే సమయం మించిపోయింది.

దేశం మరోసారి 26/11 లాంటి ఘటనను ఎదుర్కోరాదంటే... అంతర్గత భద్రత సవాళ్లపై సమీక్షించుకోవడం మన తక్షణ అవసరం కావాలి. గడచిన పదిహేనేళ్లలో నేర్చుకున్న పాఠాలు, ఎదుర్కొన్న సవాళ్లను సమీక్షించుకుని భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ముంబై దాడుల్లో ఉగ్రవాదులు అనుసరించిన పద్ధతులు... సరిహద్దులకు అవతలి నుంచి వారికి అందిన సూచనల వంటివన్నీ మనకు పూర్తిగా అనూహ్యమైనవే. అదే సమయంలో ఢిల్లీ, ముంబైల్లోని జాతీయ స్థాయి భద్రతా వ్యవస్థలు సంపూర్ణంగా విఫలమయ్యాయి కూడా! మరీ ముఖ్యంగా నిఘా వ్యవస్థ తాలూకు వైఫల్యం సుస్పష్టం.

నిఘా లోపాలు

విచిత్రమైన విషయం ఏమిటంటే... 1999 నాటి కార్గిల్ యుద్ధంలోనూ సంస్థాగతమైన నిఘా లోపాలు బయటపడ్డాయి. దివంగత కె. సుబ్రమణ్యం నేతృత్వంలోని కార్గిల్ రివ్యూ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ''ఏజెన్సీల మధ్య సమన్వయానికి, నిర్దిష్ట లక్ష్యానికి అనుగుణంగా కలిసి పనిచేసేందుకు తగిన వ్యవస్థ లేకుండా పోయింది. అలాగే ఏజెన్సీలకు పనులు చెప్పేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు, సామర్థ్యాలను పరీక్షించేందుకు, నాణ్యతా ప్రమాణాలను సమీక్షించేందుకు కూడా తగిన వ్యవస్థలు లేవు. అన్ని నిఘా సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో చూసే ఏర్పాట్లు కూడా లేవు'' అని విస్పష్టంగా పేర్కొందీ కమిటీ.

26/11 దాడుల సందర్భంగా బట్టబయలైన నిఘా లోపాలు, లోటుపాట్లను కాసేపు పక్కన పెట్టినా... ఆ తరువాత కూడా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడం దురదృష్టకరం. ఈ రకమైన లోపాల కారణంగా భారత్ నివారించదగ్గ ఎదురుదెబ్బలు ఎన్నో చవిచూడాల్సి వస్తోంది. గల్వాన్ లోయ సంఘటన ఇక్కడ చెప్పుకోవాల్సిన ఒక అంశం. 2020లో జరిగిన ఈ ఘటనలో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సైనికులు భారతీయ సైనికులను ఒక రకంగా 'ఆశ్చర్యానికి' గురిచేస్తూ తీవ్రస్థాయి దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే.

మిలిటరీ సంస్కరణల ఫలితం?

భద్రత వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీకి ప్రాతినిధ్యం వహించే 'ద నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్' మిలిటరీ సంస్కరణలను అమలు చేసే విషయంలో దశాబ్దాల సమయం తీసుకుంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పోస్టును సృష్టించేందుకు 1990లలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆఖరికి ఇది 2019లో నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండగా సాకారమైంది. ఈ జాప్యం చెప్పే విషయం ఏమిటి? జాతీయ భద్రత అంశాల విషయంలో సంస్కరణలు, సంస్థాగత సమీక్షలకు కొంత నిరోధం ఉందీ అని! అది కూడా స్వప్రయోజనాల కోసం పాకులాడే వారి వల్ల అని అర్థమవుతుంది.



ముంబై 26/11 ఉగ్రదాడులకు పదిహేనేళ్లు

భారతీయ నిఘా ఏజెన్సీల్లో... ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (ఆర్ అండ్ ఏడబ్ల్యూ– క్లుప్తంగా 'రా'), నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఎన్టీఆర్ఓ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)లు ఉన్నాయి. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర హోంశాఖల కింద ఈ ఏజెన్సీలన్నీ పనిచేస్తాయి. వీటికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ప్రతి సాయుధ దళంలోనూ తమదైన ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్లు అదనం. అంతేకాదు... రెవెన్యూ, ఆర్థిక రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు, నిఘా పెట్టేందుకు ప్రత్యేకమైన విభాగాలు కూడా ఉన్నాయి. సమాచార రంగంలో వచ్చిన సరికొత్త మార్పులను పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వాలు రోజంతా తమ నిఘా కార్యక్రమాలను కొనసాగించాల్సిందే అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. చాలా ఏజెన్సీలను ఐపీఎస్‌ల నుంచి ఎంపిక చేసిన సీనియర్ స్థాయి అధికారులు నడుపుతూంటారు. సంస్కరణలు కష్టం అవుతూండేందుకు ఇది కూడా ఒక కారణం.

పాతికేళ్ల నివేదికలు...

మిలిటరీ సంస్కరణల విషయంలో దాదాపు 24 ఏళ్లుగా చాలా నివేదికలు వెలువడ్డాయి. కానీ... మిలిటరీ, నిఘా రంగాల్లో అమలైంది పిసరంతే! కొంచెం నిశితంగా శ్రద్ధ పెట్టి సమీక్షిస్తే ఉన్నత స్థాయిలోని పోలీసు వర్గాలు, రాజకీయ నాయకులు ఇప్పుడున్న పరిస్థితినే కొనసాగించాలనే స్వార్థంతో పనిచేస్తున్నట్లు ఇట్టే స్పష్టమవుతుంది. జాతీయ భద్రతకు ముప్పు అని స్పష్టంగా తెలిసినా, అర్థమవుతున్నా తేడా ఏమీ లేదు.

2024 ఎన్నికల సమయం దగ్గరపడింది. కాబట్టి వ్యవస్థాగతమైన సంస్కరణలకు ఇదే మంత మంచి సమయం కాదు. కానీ వచ్చే ప్రభుత్వం ఏదైనా ఈ విషయాన్ని కచ్చితంగా చేపట్టాల్సిందే. ఇప్పటివరకూ ఈ అంశంపై వెలువడ్డ నివేదికలన్నింటినీ కూలంకుషంగా సమీక్షించి ఒక టాస్క్‌ఫోర్స్ ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రకమైన చర్యలు తీసుకోవాలో నిర్ధారించుకుని ముందడుగు వేయాలి. ఈ టాస్క్‌ఫోర్స్‌లో తమ తమ రంగాల్లో ప్రతిభను ఇప్పటికే నిరూపించుకున్నవారు, వ్యక్తిగత నిబద్ధత ఉన్న వారిని ఎంపిక చేయడం ఈ సంస్కరణలపై చిత్తశుద్ధిని నిరూపించు కునేందుకు ప్రభుత్వానికి ఉన్న ఒక మార్గం. కార్యాచరణ ప్రణాళిక అన్నది ఆ తరువాత వెలువడుతుంది. ఈ సంస్కరణలకు పునాదులుగా నిలిచే అంశాలు ఇరవై ఏళ్లుగా నిఘా వర్గాల్లో నైపుణ్యం సాధించిన వారి నివేదికల ఆధారంగా ఉంటాయని నమ్ముతున్నాను. పారా మిలిటరీ ఓవర్‌సైట్, తగిన లీగల్ స్టాటస్, ఆపరేషన్లపై బాధ్య తల పంపిణీ, తరచూ వీటి ఆడిట్, శిక్షణ, నియామకాల వ్యవస్థ ప్రక్షాళన, నిఘా సమాచారాన్ని మరింత సమన్వయంతో విశ్లేషించేందుకు ఏర్పాట్లు, సాంకేతికపరమైన, మానవ సంబంధిత నిఘా వ్యవస్థల బలోపేతానికి తగినన్ని నిధులు... ఈ సంస్కరణల్లో కచ్చితంగా భాగం కావాల్సిన అంశాలు.

తక్షణ కర్తవ్యం

వృత్తిపరమైన నిబద్ధత, వ్యక్తిగతంగా నైతిక నియమాలున్న వారు నిఘా వ్యవస్థల్లో ఉండటం చాలా అవసరం. ఎందుకంటే ప్రజా పరిశీలనకు దూరంగా, పారదర్శకం కాని తెర వెనకాల ఈ వ్యవస్థలు పనిచేస్తూంటాయి మరి. కాబట్టి వీరి పనితీరును బహిరంగంగా సమీక్షించడం అసాధ్యమే కాదు, వాంఛనీయం కూడా కాదు. కెనడా ఇటీవలే భారతీయ నిఘా వ్యవస్థలపై కొన్ని ఆరోపణలు గుప్పించింది. అమెరికా కూడా ఈ అంశంలో తన ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్న నేపథ్యంలో ఈ రకమైన ఆరోపణలు ఏమంత మంచివి కాదు.

26/11 ఉగ్రదాడి మనలోని లోపాలు ఎన్నింటినో ఎత్తి చూపింది. వాటిని పరిష్కరించే విషయంలో ఇప్పటికే జరిగిన జాప్యం చాలు. ఈ విషయంలో వీలైనంత తొందరగా సంస్కరణల ప్రక్రియ ప్రారంభం కావడం దేశహితం దృష్ట్యా అవసరం.

వ్యాసకర్త డైరెక్టర్, సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్ని వంటలలో!



కూరగాయలకు ఇంత అద్భుతమైన, ఇంత విస్తారమైన రుచులు, పరిమళాలను ప్రపంచంలో భారత్ తప్ప ఏదీ తేలేదు. భూమ్మీద ఉన్న ప్రతి శాకాహారీ తెలుసుకోవాల్సిన విషయం ఇది.

– కబీర్ బేడీ, నటుడు

నగరం మనిషైతే...



రాత్రి దాకా ఢిల్లీ రోజుకు 20 గట్టి సిగరెట్లు కాల్చింది. ఇవ్వాళ మోతాదు తగ్గి పదిహేనింటికి వచ్చింది. త్వరలో మరింత మోతాదు తగ్గించుకుంటుందని ఆశ. అటుపై పూర్తిగా పొగ మానేస్తే మంచిది.

– మునీశ్ భరద్వాజ్, ఫిలింమేకర్

వాళ్లకూ విస్తరిస్తే సరి!



చాలామంది వేతనదారులు పన్నులను ద్వేషించడానికి కారణం, బదులుగా వారికి ఏమీ దక్కకపోవడం. 2022–23లో కేవలం 2.24 కోట్ల మంది పన్ను చెల్లించారు. దేశ జనాభాలో ఇది 1.6 శాతం. వీళ్లను కూడా ప్రభుత్వ పథకాలకు అర్హులను చేస్తే సరి. 5 లక్షల ఆరోగ్య బీమా, 5 కిలోల ఉచిత బియ్యం, పింఛన్ల వంటివి. చాలామంది తీసుకోరు. పైగా ప్రభుత్వం తమకోసం ఏదో చేస్తోందని సంతోషపడతారు. వీళ్ల వల్ల ఆ సేవల నాణ్యత కూడా పెరుగుతుంది.

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

బాగాలేదా?



నాకు ఇవ్వాళ బాగాలేదు. బాగాలేకపోవడం అనేది అంత బాగాలేని విషయం కాదు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ బాగుండరు. మీకు ఇవ్వాళ బాగాలేకపోతే మీ బాధను నేను పంచుకోగలను.

– సెరెనా విలియమ్స్, టెన్నిస్ క్రీడాకారిణి

అందరికీ వందనం



ఎవరో గుర్తుచేసేదాకా, సొరంగంలో చిక్కుకున్న వాళ్లని కాపాడినవారి మతమేంటో గమనించలేదు. ఆపత్కాలంలో ఆదుకున్నవాళ్లంతా మనకు దేవతలే. మీరు వీటిని ఎత్తిచూపడం మొదలుపెడితే– మతాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని నువ్వు ఎవరిని నిందిస్తావో వాళ్లలాంటి దోషివే అవుతావు.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

అదో లోకం!



సాధువులు, సన్యాసుల నేల ఇది. ఒక జత బట్టలతో మనుషులు జీవితాలు వెళ్లబుచ్చే దేశం ఇది. అలాంటిది ఒక బాలీవుడ్ కిడ్, ఇంకో బాలీవుడ్ కిడ్‌ను మెచ్చుకుంటోంది... ఎందుకు? ఒకసారి ఫంక్షన్‌కు వేసుకున్న దుస్తుల్ని మరోసారి కూడా వేసుకోవచ్చని 'సస్టెయినబిలిటీ' పాఠాలు చెప్పినందుకట! వీరు వాస్తవ పరిస్థితులకు ఎంత దూరంగా ఉంటారో!

– స్వాతీ గోయల్ శర్మ, జర్నలిస్ట్

మంచిదే మంచిది



పట్టభద్రుడిని అయ్యి, 30 ఏళ్లయిన తర్వాత నేను విద్యార్థులకు ఇవ్వగలిగే సలహా ఒక్కటే. సగటు కళాశాలలో మంచి కోర్సు, మంచి కళాశాలలో సగటు కోర్సు అనే అవకాశం ఉంటే, మంచి కళాశాలనే ఎంపిక చేసుకోండి. ఎక్కడ చదివారు అన్నదానితో పోల్చితే, ఏం చదివారు అన్నది ప్రాధాన్యం కాదు.

– జాయ్ భట్టాచార్య, క్విజ్ నిర్వాహకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

కథ సుఖాంతం

ఉత్తరాఖండ్‌లో హైవే నిర్మాణంలో భాగంగా నిర్మితమౌతున్న 'సిల్‌క్యారా టన్నెల్' కూలి 41 మంది కార్మికులు చిక్కుకున్న ఉదంతం సుఖాంతం కావడం ఆనందదాయకం. 17 రోజులపాటు బాహ్య ప్రపంచానికి దూరంగా బిక్కు బిక్కుమంటూ గడిపిన వారంతా క్షేమంగా, ఆరోగ్యంగా తిరిగి రావడంలో కీలక పాత్ర వహించిన రెస్క్యూ టీమ్స్‌కు అభినందనలు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన జాతీయ విపత్తు నిర్వహణ శాఖ, సంబంధిత రాష్ట్ర శాఖ, ఇతర శాఖలు చక్కటి సమన్వయంతో పనిచేశాయి. అయితే అడుగడుగునా ఊహించని అవాంతరాలూ, యంత్ర పరికరాల వైఫల్యాలూ ఎదురయ్యాయి. ఆపరేషన్ మొదట్లోనే కార్మికులతో కమ్యూనికేషన్ ఏర్పాటు చేయగలిగి, వారికి నిరంతరాయంగా ఆహారం, నీరు సరఫరా చేయగలగడంతో సహాయ చర్యల విజయంపై ఆశలు నిలిచాయి. పలుమార్లు ఆశ నిరాశల మధ్య ఊగిసలాట, అవసరానికి అనుగుణంగా మార్చుతూ పోయే ప్రణాళికలు, వాటి విజయాలూ, వైఫల్యాలూ ఉత్కంఠభరితంగా మారాయి.

అమెరికా నుండి తెప్పించిన డ్రిల్లింగ్ యంత్రం పని పూర్తవక ముందే బ్లేడ్ విరిగి మొరాయిస్తే ప్రభుత్వం నిషేధించిన ర్యాట్ హోల్ మైనింగ్ పద్ధతి ఆఖర్లో అక్కరకు వచ్చింది. ఆ పద్ధతి ప్రకారం ఎలుక కలుగు చేసినట్టు మనుష్యులు తవ్వుతూ పోతారు. అయితే మధ్యలో మట్టి జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ఆ రిస్కును దృష్టిలో పెట్టుకుని ఆ విధానాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇప్పుడు యంత్రం మొరాయించిన చోట ఆ విధానం అక్కరకు రావడం విశేషం. ఏదేమైనా చివరకు అంతా క్షేమంగా బయటపడడం ఆనందదాయకం. ఈ ఉదంతం ఎన్నో పాఠాల్ని నేర్పాలి. హిమాలయాల సానువుల్లో జరుపుతున్న నిర్మాణాల భద్రతపై మరింత లోతుగా అధ్యయనం చెయ్యాలి. జరిగిన ప్రమాదం మూలాల్లోకి చూడాలి. ఏమైనా భద్రతా ప్రమాణాల ఉల్లంఘన జరిగి ఉంటే సరిదిద్దాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని చూపిన రెస్క్యూ టీమ్స్‌కూ, సడలని ధైర్యంతో 17 రోజులు ప్రమాదంలో గడిపిన కార్మికులకూ అభినందనలు.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

ఈ పిల్లలకు ఏమైంది?

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

'విద్య అనేది వ్యక్తిలోని మంచిని బయటకు తీసుకురావడానికి కృషి చేస్తుంది' అంటాడు గ్రీకు తత్త్వవేత్త ప్లేటో. అయితే విద్యార్జన కాలంలో పిల్లలు పక్కదోవ పట్టకుండా ఆహ్లాదకర వాతావరణంలో చదువుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ వంటి ఆధునిక డివైస్‌లు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయనీ, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలనీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లల చేతిలో పాఠ్యపుస్తకం స్థానంలో సెల్ ఫోన్ చేరింది. ఆ మధ్య కాలంలో కేంద్రం చేసిన ఓ సంచలన ప్రకటన ఈ సందర్భంగా ప్రస్తావించాలి. 'మరుగుదొడ్డి' లేని ఇంట్లో విలువైన 'సెల్ ఫోన్' చేరింది అనేది ఆ ప్రకటన సారాంశం. అంటే మొబైల్ ఫోన్ జనానికి ఎంతగా అందుబాటులోకి వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

మూడేళ్ల క్రితం కరోనా రూపంలో ఓ భయంకరమైన విపత్తు ప్రపంచాన్ని చుట్టుముట్టడంతో సెల్‌ఫోన్ వాడకం విద్యార్థులకు అనివార్యం అయ్యింది. కరోనా పోయినా దానికి అలవాటు పడిన పిల్లలు మాత్రం దాన్ని వదల్లేకుండా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువతపై సెల్‌ఫోన్ చూపిస్తున్న దుష్ప్రభావాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన సంఘటనలోని అంశాలు భయం గొలిపేవిధంగా వున్నాయి. నలుగురు మైనర్ విద్యార్థులు 'సెల్ ఫోన్' లోని అశ్లీల వీడియోలు చూస్తూ వారు కూడా అలానే చేసి వీడియో తీసి 'ఫేస్‌బుక్'లో అప్‌లోడ్ చేయాలని నిర్ణయించుకొని ఓ మైనర్ అమ్మాయిని ఎంచుకోవటం, ఆ తరువాత జరిగిన పరిణామాలూ మనందరికీ తెలిసిన విషయమే.

తరగతి గదిలో గురువు చెప్పే అంశాలపై శ్రద్ధ పెట్టాల్సిన విద్యార్థులు ఏకాగ్రత కోల్పోయి నిత్యం 'సెల్‌ఫోన్'పై దృష్టిపెట్టి విలువైన సమయం వృథా



చేస్తున్నారనేది పరిశోధకుల అభిప్రాయం. 'సెల్ ఫోన్' చూడడం వల్ల విద్యార్థుల దృష్టి మందగిస్తుంది. ఆందోళనకు గురి అవుతారు. ఒంటరితనానికి అలవాటవుతారు. సరిగా నిద్రపోలేరు. అనైతిక కార్యకలాపాలూ, తద్వారా ఆరోగ్య సమస్యలూ వస్తాయని శాస్త్రీయ నివేదిక ఒకటి వెల్లడించింది. మొబైల్ ఫోన్ వల్ల 'నోమోఫోబియా' అనే మానసిక వ్యాధికి పిల్లలు గురౌతారని వైద్యులు హెచ్చరించడం ఆలోచించాల్సిన విషయం.

ఆ మధ్యకాలంలో మలేసియన్ ఆన్‌లైన్ జర్నల్ వారు చేసిన అధ్యయనంలో విద్యార్థులు సుమారు 3–6 గంటల విలువైన సమయాన్ని సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారని తేలింది. ఇక ఈ సందర్భంగానే ఇక్కడ మరొక విషయం ప్రస్తావించాలి.

మనిషి జీవితంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించేది 'కౌమారం' (13–21 ఏళ్ల మధ్య వయసు). ఈ దశలోనే విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం చేయాలి. అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల్లో వస్తున్న శారీరక మానసిక పరమైన మార్పులను పసిగట్టి సానుకూల దృక్పథంతో దిశానిర్దేశం చేయాలి.

విద్య పరమావధి వ్యక్తిత్వ వికాసం. వ్యక్తిలో మూర్తిమత్వ వికాసం సమగ్రంగా, సంపూర్ణంగా సమర్థంగా జరగడానికి బాల్యం నుంచి... తరగతి గది నుండి వీడ్కోలు తీసుకొనే స్థాయి వరకు ఒక క్రమ పద్ధతిలో పిల్లవాడికి లభించే సలహా, సహాయం ఎంతగానో తోడ్పడతాయి. కాబట్టి విద్యార్థి క్రియాశీలక భవిష్యత్తుకు ఆటంకం కల్పించే వస్తువుల పట్ల (సెల్‌ఫోన్, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు) జాగరూకత లేకపోతే పిల్లల భవిష్యత్తు చీకటిమయం అయిపోతుంది.

డిగ్రీ లోపు విద్యార్థులకు తరగతి గదిలోకి సెల్ ఫోన్ అనుమతించకుండా కఠిన ఆంక్షలు విధించాలి. లేనిపక్షంలో విద్యార్థి ఏకాగ్రత దెబ్బతిని మధ్యలోనే చదువు నుండి నిష్క్రమించే అవకాశం కూడా ఉంటుంది.

వ్యాసకర్త రాజనీతి శాస్త్ర అధ్యాపకులు
మొబైల్: 99080 59234

సదాశివ బ్రహ్మేంద్రులు

మహాత్ములు, సిద్ధులను అందించిన గొప్ప భూమి మన భూమి. నాది నీది అనే స్వార్థభావమే లేకుండా జీవించిన మహాత్ములలో యోగులు, సిద్ధులు, మునులు, జ్ఞానులు, అవధూతలు అంటూ అనేకులున్నారు.

మన దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న కాలమది. ఓ ఆంగ్లేయాధికారి తన గుర్రం మీద అడవిమార్గంలో పోతున్నాడు. ఓ బండ మీద నగ్నంగా కూర్చొని అమాయకంగా ఎటో చూస్తున్న మనిషిని చూశాడు. ఆయనను చూసి ఆంగ్లేయాధికారి జాలి పడ్డాడు. ఆయనను మానసిక రోగి అనుకున్నాడు. గుర్రాన్ని వేగంగా పోనిచ్చాడు.



జ్యోతిర్మయం

కొంత దూరం వెళ్ళిన తర్వాత ఆ మనిషి ఎదురుగా ఓ బండ మీద కూర్చుని ఉండటం చూశాడు అధికారి. ఆయనకు ఆశ్చర్యం వేసింది. అతనెలా తన కన్నా ముందరే వచ్చి ఇప్పుడు బండ మీద కూర్చున్నాడు అని అనుకుంటూ ముందుకు కదిలాడు. కొన్ని గంటలు ప్రయాణించిన తరువాత దాహం వేసి నీటి కోసం వెతికాడు. కానీ ఎక్కడా నీటి జాడ లేదు. దాహంతోనే ప్రయాణాన్ని కొనసాగించాడు. అలా పోతున్న అధికారికి ఓ మనిషి నడుచుకుంటూ వెళ్ళడం చూశాడు. ఎక్కడైనా నీరు దొరుకుతుందేమోనని ఆయనను అడిగి తెలుసుకోవాలనుకుని ముందుకు వెళ్ళాడు. గుర్రం ఆపి కిందకు దిగి అతని వంక చూసి కంగు తిన్నాడు ఆ అధికారి. కారణం – దారిలో అతను రెండు సార్లు చూసిన ఆ మనిషే ఇతడు. ఈయన ఎవరో మహాత్ముడు అయి ఉంటాడని నమస్కరించాడు. అధికారి వంక కరుణతో చూశాడాయన. అధికారి తేరుకునేలోగా ఆ మనిషి కాస్తంత ముందుకు పోయి కనిపించకుండాపోయాడు. అయితే అధికారి దాహం తీరిపోయింది. ఏ అలసటా లేదు. ఈ విషయాన్ని ఆ అధికారి ఒక సన్నిహితుడితో చెప్పడంతో పాటు తన డైరీలో రాసుకున్నాడు. ఇంతకూ ఆ అద్భుతమైన మనిషి మరెవరో కాదు, రెండు వందల సంవత్సరాలకు పైనే ఈ భూమ్మీద జీవించి పలువురి జీవితాలు వికసించడానికి కారణమైన శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు. ఆయన జీవసమాధి ఆలయం కరూర్ సమీపంలోని నెరూరులో ఉంది.

– యామిజాల జగదీశ్

● రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి తడి లేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా గ్లిజరిన్, అలోవెరా జెల్, కొబ్బరి నూనె... వీటిలో ఏదైనా ఒకటి రాసి పది నిమిషాలు మర్దన చేయాలి. తరువాత లైట్ ఆపేసి పది నిమిషాలు శ్వాస మీద దృష్టి కేంద్రీకరించాలి. రోజూ ఇలా చేయడం వల్ల శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అంది రక్త ప్రసరణ జరుగుతుంది. ఫలితంగా ముఖం మెరుపులీనడమే గాక, చర్మం రంగు కూడా అందంగా మారుతుంది.



● రెండు టేబుల్ స్పూన్ల పటికపొడిలో టీస్పూను పసుపు, అర టీ స్పూను నిమ్మరసం, టీస్పూను రోజ్ వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖంపైన పూతలా వేయాలి. పూర్తిగా ఆరిన తరువాత వేళ్లతో సర్కిల్స్‌లా ఐదు నిమిషాలు రుద్దిన తరువాత నీటితో కడిగేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ముఖం మీద ఉండే అవాంఛిత రోమాలు రాలిపోతాయి.

న్యూస్ మేకర్



గోవాకు చెందిన దిశా నాయక్ చరిత్ర సృష్టించింది. విమానాశ్రయాల్లో అగ్ని ప్రమాదాలను నివారించే భారీ వాహనం 'క్రాష్ ఫైర్ టెండర్'ను నడిపే తొలి భారతీయ వనితగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ప్రమోట్ అయ్యింది. గోవా వాసులు సరే, విమానయాన రంగం కూడా ఆమెను ప్రశంసగా చూస్తోంది.

ఎయిర్‌పోర్ట్ ఫైర్ ఫైటర్

అగ్నిప్రమాదాలు ప్రాణాంతకం. ఎయిర్‌పోర్ట్‌లో జరిగే అగ్ని ప్రమాదాలు మరీ తీవ్రం. సెకన్ల వ్యవధిలో చావు బతుకులు నిర్ణయమవుతాయి సరిగ్గా స్పందించకపోతే. అందుకే ప్రత్యేకంగా 'ఏరోడ్రోమ్ రెస్క్యూ అండ్ ఫైర్ ఫైటింగ్' (ఎ.ఆర్.ఎఫ్.ఎఫ్.) సర్వసమయాల్లోనూ సిద్ధంగా ఉంటుంది ప్రతి ఎయిర్‌పోర్ట్‌లో. అయితే ఈ విభాగంలో స్త్రీల ప్రాతినిధ్యం చాలా తక్కువ. 2021 వరకూ గోవాలో ఒక్క మహిళ కూడా ఈ విభాగంలో లేదు. కాని మొదటిసారి దిశా నాయక్ ఈ ఉద్యోగంలో చేరి గోవాలో తొలి ఎయిర్‌పోర్ట్ ఫైర్‌ఫైటర్‌గా నిలిచింది. ఇప్పుడు ఆమె 'క్రాష్ ఫైర్ టెండర్' నడిపే ఫైర్‌ఫైటర్‌గా ప్రమోట్ అయ్యింది. దాంతో మన దేశంలో క్రాష్ ఫైర్ టెండర్‌ను ఆపరేట్ చేసే తొలి సర్టిఫైడ్ ఉమన్ ఫైర్‌ఫైటర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది.

క్రాష్ ఫైర్ టెండర్ (సి.ఎఫ్.టి.) అంటే?

ఇది హైటెక్ ఫైర్ ఇంజిన్. అగ్నిమాపక దళంలో కనిపించే ఫైర్ ఇంజిన్‌కు, దీనికి చాలా తేడా ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌లో, విమానాలు ల్యాండ్ అయ్యేటప్పుడు ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే మంటలార్పేలా ఈ ఫైర్ ఇంజిన్‌ను తయారు చేస్తారు. దీనిని నడపడానికి, మంటలు ఆర్పేలా ఆపరేట్ చేయడానికి తీవ్ర శిక్షణ అవసరం. సాధారణంగా మగవారు రాణించడానికే కొంత శ్రమ పడతారు. అలాంటిది దిశా నాయక్ అన్ని పరీక్షలు పాసై సి.ఎఫ్.టి.ని ఆపరేట్ చేసే మహిళా ఫైర్‌ఫైటర్ అయ్యింది.

యూనిఫామ్ ఉండే ఉద్యోగం చేయాలని

గోవాలోని పెర్నెమ్‌కు చెందిన దిశా నాయక్‌కు బాల్యం నుంచి యూనిఫామ్ ఉండే ఉద్యోగం చేయాలని కోరిక. అయితే చదువు పూర్తయ్యాక అలాంటి ఉద్యోగం ఏమీ దొరకలేదు. 2021లో గోవాలోని 'మనోహర్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్'లో ఫైర్‌ఫైటర్ ఉద్యోగాలకు పోస్టులు పడ్డాయి. ఎయిర్‌పోర్ట్ అగ్నిమాపక దళం లో అప్పటికి ఎవరూ అమ్మాయిలు లేకపోయినా దిశా అప్లై చేసింది. 'మా అమ్మాయి చిన్నప్పటి నుంచి చాలా చురుకు. మోటర్ సైకిల్ నడిపేది. రన్నింగ్ బాగా చేసేది. ఆమె ఫైర్‌ఫైటర్‌గా చేరతానంటే రాణిస్తుందనే నమ్మకంతోనే ప్రోత్సహించాం' అంటారు తల్లిదండ్రులు. వారి ప్రోత్సాహంతో జూన్ నెలలో ఉద్యోగంలో చేరింది దిశా.



● తల్లిదండ్రులతో...

అంచెలంచెలుగా ఎదిగి

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి దిశాలోని చురుకుదనం, అంకితభావం పై అధికారులు గమనించారు. కేవలం సహాయక సిబ్బందిగా ఉండటం కంటే క్రాష్ ఫైర్ టెండర్‌ను నడిపేందుకు ఆమె ఆసక్తి చూపడం గమనించి ఆమెను ట్రైనింగ్‌కి పంపారు. తమిళనాడులోని నమక్కల్‌లో ఆరునెలల పాటు శిక్షణ తీసుకుంది దిశ. ఎయిర్‌పోర్ట్‌లో అగ్నిప్రమాదాలు సంభవించే తీరు, ఏ ప్రమాదంలో సి.ఎఫ్.టి.ని ఎలా ఉపయోగించాలి... అక్కడ ఆమెకు నేర్పించారు. తిరిగి వచ్చాక ఉన్నతాధికారులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఆమె ప్రావీణ్యాన్ని నిర్ధారించి సి.ఎఫ్.టి ఆపరేటర్‌గా ప్రమోట్ చేశారు. 'ఆమె అన్నిరకాల పరీక్షల్లో ఉత్తమంగా నిలిచింది' అని తెలిపారు.

అన్నివిధాలా సిద్ధంగా

'అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే సంఘటనాస్థలికి చేరుకోవడం కంటే చేరుకున్నాక ఏం చేయాలన్నదే ఎక్కువ ముఖ్యం. ఎయిర్‌పోర్ట్ ఫైర్‌ఫైటర్‌గా పని చేసేవారికి ఎయిర్‌పోర్ట్‌లోని అన్ని ప్రవేశమార్గాలు, కీలకమైన ద్వారాలు, ముఖ్యస్థానాలు మైండ్‌లో ప్రింట్ అయి ఉండాలి. ప్రమాదం జరిగితే ఎక్కడికి చేరి ఎలా కాపాడాలన్నదే ముఖ్యం. ఈ ఉద్యోగంలో క్షణాల్లో యూనిఫామ్‌లోకి మారి వెహికిల్‌లో కూచోవాలి. శారీరక బలంతో పాటు మానసిక బలం ప్రదర్శించాలి. సాంకేతిక జ్ఞానం కూడా తప్పనిసరి' అని తెలిపింది దిశ.

ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ కొన్ని విషయాల్లో బిడియం, సిగ్గుతో వెనకబడే ఉన్నారు స్త్రీలు. ముఖ్యంగా పీరియడ్స్, లోదుస్తుల గురించి మాట్లాడాలంటే భయం. ఎవరిదైనా బ్రా, పెట్టీకోట్‌లు కొద్దిగా బయటకు కనిపిస్తుంటే... చెప్పడానికి కూడా ఇబ్బంది పడుతుంటారు. ఇలా మాట్లాడ్డానికి ఇబ్బంది పడే అంశాన్నే కెరీర్‌గా ఎంచుకుంది రిచాకర్. అమ్మాయిల నుంచి మహిళలు ధరించే 'బ్రా'ల బ్రాండ్‌ను ఎంతో ధైర్యంగా మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఎటువంటి బిడియం లేకుండా తీసుకొచ్చిన ఈ బ్రాండ్ నేడు కోట్ల టర్నోవర్‌తో దూసుకుపోతోంది.

బ్రాండెడ్ కెరీర్



జంషెడ్‌పూర్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది రిచాకర్. తండ్రి టాటా స్టీల్ కంపెనీ ఉద్యోగి కాగా తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి విభిన్నంగా ఆలోచించే మనస్తత్వం రిచాది. డిగ్రీ అయ్యాక ఐటీ కంపెనీలో కొన్నేళ్లపాటు ఉద్యోగం చేసింది. శాప్ రిటైల్ కన్సల్టింగ్, స్పెన్సర్స్‌లో ఉద్యోగం చేశాక... సొంతంగా వ్యాపారం చేయాలన్న కోరికతో నర్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా చేసింది. ఒకపక్క ఉద్యోగానుభవం, మరోపక్క మేనేజ్‌మెంట్ స్టడీస్ ద్వారా నేర్చుకున్న జ్ఞానంతో సొంతంగా వ్యాపారం పెట్టడానికి పూనుకుంది. ఇందుకోసం మహిళల లోదుస్తుల వ్యాపారం ఎంచుకుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ''సమాజంలో లోదుస్తుల గురించి మాట్లాడాలంటే భయడతారు. ఈ వ్యాపారం అవసరమా? వద్దు'' అని నిరుత్సాహపరిచారు. తల్లిదండ్రులు అలా చెప్పినప్పటికీ రిచా ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. తన వ్యాపారం ప్రారంభ పనుల్లో మునిగిపోయింది.

రేడియంట్ మి

మహిళలు ధరించే బ్రాలను సొంతంగా డిజైన్ చేసి, తయారు చేసి, విక్రయించడంపై దృష్టిపెట్టింది. కొన్నిరోజులకి తన పని మీద నమ్మకం ఏర్పడడంతో 2011లో 'జివామే' పేరుతో బ్రా బ్రాండ్‌ను ఏర్పాటు చేసింది. జివామే అంటే హిబ్రూలో 'రేడియంట్ మి' అని అర్థం. కాలేజీ అమ్మాయిల నుంచి పిల్లల తల్లుల వరకు అందరూ సౌకర్యంగా ధరించే బ్రాలను విక్రయించడం మొదలు పెట్టింది. కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తుండడంతో ఐదు వేల డిజైన్లు, యాభై బ్రాండ్లు వంద రకాల సైజుల్లో లోదుస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్‌ల ద్వారా అందిస్తోంది జివామే.

కోట్ల టర్నోవర్‌తో...

లోదుస్తులు ధరించిన మహిళలు సౌకర్యంగా... కాన్ఫిడెంట్‌గా ఉండడమే లక్ష్యంగా లోదుస్తులను అందుబాటులో ఉంచుతుండడంతో జివామే బ్రాండ్ మార్కెట్లోకి వచ్చిన ఏడాదిలోనే పెట్టుబడిదార్లను ఆకర్షించింది. దీంతో 2012లో మూడు మిలియన్ల డాలర్లు, మరుసటి ఏడాది ఇది రెట్టింపు అయ్యింది. 2015 నాటికి నలభై మిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చాయి. దీంతో కంపెనీ ఆరువందల కోట్లపైకి ఎగబాగి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

డైరెక్టర్‌గా...

కోట్ల టర్నోవర్‌తో దూసుకుపోతోన్న సమయంలో కొన్ని కారణాలతో 2017 సీఈవో పదవి నుంచి తప్పుకుని, డైరెక్టర్‌గా కొనసాగుతోంది రిచా కర్. ప్రస్తుతం రిచా నెట్ వర్త్ దాదాపు 750 కోట్లు ఉండొచ్చని అంచనా. మంచి లాభాల్లో దూసుకుపోతోన్న జివామే బ్రాండ్‌ను 2020 లో రిలయన్స్ రిటైల్ కొనుగోలు చేసింది. తన కలను నిజం చేసుకున్న 43 ఏళ్ల రిచా కర్ ప్రస్తుతం తన భర్త కేదార్ గవాన్‌తో కలిసి అమెరికాలో నివాసముంటోంది.

'' ఒక స్త్రీ మనసును మరో స్త్రీ మాత్రమే అర్థం చేసుకుంటుంది. అందుకే మూసపద్ధతులను దాటుకుని మహిళలు సౌకర్యంగా ధరించే లో దుస్తుల బ్రాండ్‌ను తీసుకొచ్చాను. జివామేను మార్కెట్లోకి తేవడానికి, దానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకు రావడానికి చాలా సవాళ్లను, ఒత్తిళ్లనూ ఎదుర్కోవలసి వచ్చింది. వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోబట్టే ఇవాళ ఈ స్థాయికి రాగలిగాను. ఇంట్లో... సమాజంలో మనల్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తారు. అయినా మన మీద మనం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. అప్పుడు అమ్మాయిలు దేనిలో తక్కువ కాదు. మనసులో ఏదైనా నిర్ణయించుకుంటే అది కచ్చితంగా సాధించ గలుగుతారు'' అని చెబుతూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది రిచాకర్.

ఇంటిప్స్



● క్యారట్స్ ఎండిపోయినట్లు, వాడిపోయినట్లుగా ఉంటే ఒక గిన్నెలో వేసి, క్యారట్స్ మునిగేలా నీళ్లు పోయాలి. ఈ గిన్నెమీద మూతపెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. పన్నెండు గంటల తరువాత నీటిలో నుంచి క్యారట్స్ తీసి చూస్తే తాజాగా ఉంటాయి. ఇప్పుడు తొక్క తీసి చక్కగా వాడుకోవచ్చు. క్యారట్ మీద నల్లటి మచ్చలు ఏర్పడినప్పుడు కూడా ఈ చిట్కా చక్కగా పనిచేస్తుంది.

● ఎంత కడిగినా పాల బాటిల్స్ వాసన వస్తుంటాయి. ఇలాంటప్పుడు పాల బాటిల్‌లో టేబుల్ స్పూను వంటసోడా, కొన్ని నీళ్లు పోసి రాత్రంతా ఉంచాలి. ఉదయం బాటిల్‌ను షేక్ చేసి కడిగితే పాల వాసన పోతుంది. ఇదే విధంగా పాల బాటిల్‌లో కొద్దిగా వెనిగర్ వేసి షేక్ చేసి పక్కన పెట్టాలి. ఆరు గంటల తరువాత వేడి నీటితో కడగాలి. పాల వాసన పోతుంది.

● 200 ఎమ్‌ఎల్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల వైట్ వెనిగర్, రెండు టేబుల్ స్పూన్ల పంచదార వేసి కలపాలి. ఈ నీటిని కుండీల్లోని మొక్కల మట్టి పైన, ఆకులపైన చల్లాలి. ఈ నీరు కీటక నివారిణిగా పనిచేయడమేగాక, మొక్కలకు పునరుజ్జీవాన్ని ఇస్తుంది.



ఆత్మబలం

భవిష్యత్తుకు ప్రేరణ



● ప్రేరణ

'మీ కూతురు ఇక నడవలేదు. వినలేదు' అంటూ వైద్యుడి నోటి నుంచి వచ్చిన మాట విన్న తరువాత ఉజ్వల, ఆమె భర్త తమ జీవితాలను అర్ధంతరంగా చాలించాలనుకున్నారు. నిరాశే తప్ప ఆశ కనిపించని ఆ కఠిన సమయంలో హెలెన్ కెల్లర్ ఆత్మకథ చదివిన ఉజ్వల ఆత్మస్థైర్యం తెచ్చుకొని, జీవితాన్ని వెలుగుమయం చేసుకుంది. కూతురికి ఉజ్వల భవిష్యత్ ఇచ్చింది...

ఆ రోజులు ఎలాంటివి అంటే... పాప నవ్విన ప్రతిక్షణం ఆ దంపతులకు పండగే. అలాంటి ఆనందమయ రోజుల్లో ఆరు నెలల పాప ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. ఈ ప్రమాదం వల్ల పాప పక్షవాతానికి గురైంది. వినికిడి శక్తి కోల్పోయింది.

'పాప ఇక ఎప్పటికీ నడవలేదు' అన్నట్లుగా చెప్పాడు డాక్టర్.

ఆ ఇల్లు ఒక్కసారిగా చీకటిలోకి వెళ్లిపోయింది.

'ఆత్మహత్య తప్ప మన జీవితానికి మరో పరిష్కారం లేదు' అనుకున్నారు ఉజ్వల, ఆమె భర్త. ఆ సమయంలో ఒకరోజు తన సోదరి దగ్గర మనసులోని బాధను బయట పెట్టింది ఉజ్వల. సోదరి ఏం మాట్లాకుండా హెలెన్ కెల్లర్ ఆత్మకథ పుస్తకం 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' చేతిలో పెట్టి 'ఇది ఒకసారి చదువు... ఇంతకుమించి ఏమీ చెప్పను' అన్నది.

'ప్రతి నిమిషం నిరాశే' లాంటి ఆ రోజుల్లో ఒకరోజు ఉజ్వల హెలెన్ కెల్లర్ ఆత్మకథ చదవడం మొదలుపెట్టింది. ఎన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'గుడ్ ఇంగ్లీష్'పై హెలెన్ పట్టుసాధించిన విధానం నుంచి జీవితంలోని నిరాశామయ సమయాల్లోనూ ధైర్యంగా ముందుకు వెళ్లడం వరకు 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుంది.

నయాగరా జలపాతం దగ్గర ఉన్నప్పుడు ఆ జలపాతం అందాలను హెలెన్ మనోనేత్రంతోనే చూసిన విధానం అపురూపంగా అనిపించింది. ఆ పుస్తకం చదవడం పూర్తిచేసిన తరువాత తన మనసులో కమ్మిన నిరాశ మేఘాలు దూదిపింజల్లా ఎగిరిపోయాయి. 'నా బిడ్డ కనీసం చూడగలుగుతుంది కదా' అనుకుంది ఉజ్వల. తనలో సానుకూల శక్తికి అక్కడే బీజం పడింది.

'ప్రియాంక'గా ఉన్న పాప పేరును 'ప్రేరణ' గా మార్చింది. మార్పు మొదలైంది. అది ఆశావహమైన మార్పు.

మరోవైపు... నడవడం కష్టం అనుకున్న పాప వైద్యం, వ్యాయామాల వల్ల నడవడం ప్రారంభించింది. అయితే వినికిడి లోపం మాత్రం పోలేదు. ప్రేరణను స్పీచ్ అండ్ హియరింగ్-ఇంపేర్డ్ స్కూలులో చేర్పించింది.

ప్రేరణకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న ఆసక్తిని గమనించి పుణెలోని 'సాధన నృత్యాలయ'లో చేర్పించింది ఉజ్వల. 'నృత్యాలయలో చేర్పించిన మాటేగానీ ప్రేరణ ఎలా డ్యాన్స్ చేయగలుగుతుంది? గురూజీ చెప్పే ముద్రలను ఎలా అర్థం చేసుకోగలదు... ఇలాంటి సందేహాలెన్నో నాలో ఉండేవి. అయితే గురూజీ షమిత మహాజన్‌లో మాత్రం ఎలాంటి సందేహం లేదు. ప్రేరణను ఎలాగైనా మంచి నృత్యకారిణిగా తయారు చేయాలనే పట్టుదల ఆమె కళ్లలో కనిపించింది' అంటుంది ఉజ్వల.



● తల్లితో...

షమిత మహాజన్ దగ్గర నృత్యంలో పాఠాలు నేర్చుకోవడం మొదలు పెట్టింది ప్రేరణ.

మొదటి రెండు సంవత్సరాలు బాగానే కష్టపడాల్సి వచ్చింది ప్రేరణ.

'మాటల ద్వారా ప్రేరణకు నాట్యానికి సంబంధించిన ముద్రలను నేర్పించడం కష్టం. చాలా ఓపిక ఉండాలి. గురూజీ ఎప్పుడూ ఓపిక కోల్పోలేదు. గురూజీ చెప్పేదాన్ని లిప్-రీడింగ్ ద్వారా అర్థం చేసుకోవడం మొదలు పెట్టింది ప్రేరణ' అని గతాన్ని గుర్తు చేసుకుంటుంది ఉజ్వల.

ఎంతోమంది సీనియర్ డ్యాన్సర్‌ల ముందు ప్రేరణ ఆరంగేట్రం ఇచ్చింది. సింగిల్ మిస్టేక్ కూడా చేయలేదు.

'నాట్యకారిణిగా నీకు ఉజ్వల భవిష్యత్ ఉంది' అని పెద్దలు ప్రేరణను ఆశీర్వదించారు.

'చీకటిగా ఉన్న నా ఆత్మగదుల్లోకి ఒక కాంతికిరణం ప్రసరిస్తే ఎలా ఉంటుంది?' అని తన ఆత్మకథ చివరిలో ప్రశ్నిస్తుంది హెలెన్ కెల్లర్.

అది అచ్చంగా ఆత్మస్థైర్యంతో తెచ్చుకున్న అపూర్వ విజయంలా ఉంటుంది. అందుకు ఉదాహరణ ప్రేరణ.

ఒక ద్వారం మన కోసం...

బాధ, ఆవేశంలో ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాలు ప్రమాదకరంగా ఉంటాయి. ప్రశాంతమైన హృదయంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మన కోసం ఎక్కడో ఒక చోట ఒక ద్వారం తెరుచుకొనే ఉంటుంది. ఆవేదన, ఆవేశాలతో ఆ ద్వారం దగ్గరకు చేరలేము.

- ఉజ్వల సహానే

పురస్కారం



ఆర్మీ ఆఫ్ జెండర్ చాంపియన్స్

● ఫలితం వచ్చే వరకు ప్రయత్నం ఆగదు



● గ్రామ సమావేశంలో...

పేదరికంలో పుట్టిన ఢిల్లీకి చెందిన సఫీనా హుసేన్ చదువును నమ్ముకొని ఉన్నత స్థాయికి చేరింది. లండన్‌లో చదువుకున్న సఫీనా అమెరికాలో ఉద్యోగం చేసింది. ఆ తరువాత మన దేశానికి తిరిగి వచ్చి పేదింటి ఆడపిల్లలు బడి బాట పట్టడానికి 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. ఎన్నో రాష్ట్రాలలో వేలాదిమంది ఆడపిల్లలు చదువుకోగలిగేలా చేసింది.

తాజాగా... ప్రపంచవ్యాప్తంగా విద్యారంగంలో కృషి చేస్తున్న వారికి 'వరల్డ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ఫర్ ఎడ్యుకేషన్, ఖతర్' వారు ఇచ్చే 'వైజ్'ప్రైజ్‌కు ఎంపికైంది. ఈ ప్రైజుకు ఎంపికైన ఫస్ట్ ఇండియన్ సఫీనా హుసేన్ గురించి...

'**అ**బ్బాయిని స్కూలుకు పంపిస్తున్నారు కదా. మరి అమ్మాయిని ఇంటిపనులకే పరిమితం చేస్తున్నారేమిటి?' అని అడిగినప్పుడు ఆ ఇంటిపెద్ద నవ్వుతూ ఇచ్చిన సమాధానం....

'ఆడపిల్లలకు చదువెందుకు. ఏదో ఒకరోజు పెళ్లి చేయాల్సిందే కదా' ఇంచుమించు ప్రతి ఇంటి నుంచి ఇలాంటి సమాధానమే వినిపించింది.

'ఆడపిల్లలకు విద్య' అనే నినాదం ప్రాధాన్యతకు నోచుకోని ఎన్నో ప్రాంతాలను చూసింది సఫీనా. దీనికి పేదరికం ఒక కారణం అయితే, ఆర్థికస్థాయి బాగున్నా 'ఆడపిల్లకు చదువెందుకు' అనే నిర్లిప్తత మరోకారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఇంటి ఆడపిల్ల బడికి వెళ్లాలనే లక్ష్యంతో 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది సఫీనా.

'ఒక సమస్య గురించి మాట్లాడేటప్పుడు దానితో మమేకం కావాలి' అంటున్న సఫీనాకు పేదరికం అనేది అపరిచిత సమస్య కాదు. ఢిల్లీలోని ఒక పేదకుటుంబంలో పుట్టింది. ఎన్నో కష్టాల మధ్య కూడా 'చదువు' అనే ఆయుధాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ఆ కుటుంబం నుంచి లండన్‌లో చదువుకున్న తొలి వ్యక్తి అయింది. లండన్ నుంచి అమెరికాకు వెళ్లి స్వచ్ఛంద సేవారంగంలో పని చేసిన సఫీనా 2005లో స్వదేశానికి తిరిగి వచ్చింది.

'చదువుకోవడం వల్ల నేను ఎంతో సాధించాను. దేశదేశాలు తిరిగాను. చదువుకోకపోతే నా పరిస్థితి ఊహకు కూడా అందనంత దయనీయంగా ఉండేది' అనుకున్న సఫీనా హుసేన్ పేదింటి ఆడపిల్లల చదువు కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ప్రభుత్వ సంస్థల నుంచి వివరాలు సేకరించింది. చదువుకు సంబంధించి జెండర్-గ్యాప్ ఉన్న 26 జిల్లాల గురించి తెలుసుకుంది. అందులో తొమ్మిది రాజస్థాన్‌లో ఉన్నాయి.

రాజస్థాన్‌లో ఆడపిల్లల చదువుకు దూరంగా ఉన్న ప్రాంతాలను మొదట ఎంపిక చేసుకుంది సఫీనా బృందం. గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకులతో 'ఆర్మీ ఆఫ్ జెండర్ చాంపియన్స్'ను ఏర్పాటు చేసి 'దయచేసి మీ అమ్మాయిని స్కూల్‌కు పంపించండి' అంటూ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. 'ఆడపిల్లలకు చదువు' అనే అంశంపై గ్రామ సమావేశాలు ఏర్పాటు చేశారు. సఫీనా ఆమె బృందం కృషి వృథా పోలేదు. ఎన్నో గ్రామాల్లో ఎంతోమంది ఆలోచన తీరులో మార్పు వచ్చింది. తమ ఇంటి ఆడపిల్లలను స్కూలుకు పంపించడం ప్రారంభించారు.

చాలా బడులలో ఆడపిల్లల కోసం టాయిలెట్ సదుపాయాలు లేవు. అలాంటి బడులలో ప్రత్యేక టాయిలెట్‌లు నిర్మించేలా చేశారు. బడిలో అకాడమిక్ పాఠాలు మాత్రమే కాకుండా లైఫ్‌స్కిల్స్‌కు సంబంధించిన పాఠాలు కూడా చెప్పేవారు.

'ఆడపిల్లలకు చదువు దూరం కావడం అనేది ఆర్థిక సమస్యతో ముడిపడి ఉన్న అంశం కాదు. అది పితృస్వామిక భావజాలానికి సంబంధించింది. మేము పనిచేసిన కొన్ని ప్రాంతాలలో ప్రజలు ఇంటి ఆడపిల్ల కంటే గొర్రెలు, మేకలను విలువైన ఆస్తిగా భావించడం చూశాం. ముందు వారి ఆలోచన తీరులో మార్పు తీసుకు రావాలనుకున్నాం. అది అంత తేలిక కాదని తెలిసినా రంగంలోకి దిగాం. ప్రభుత్వ సంస్థల నుంచి లోకల్ వాలెంటీర్స్ వరకు కలిసి పనిచేశాం. అయితే మేము నిరాశతో వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి రాలేదు' అంటుంది సఫీనా.

'ఆడపిల్లలకు చదువు అందని ప్రాంతాలు ఏమిటి?' అనే అంశంపై ఒకప్పుడు ప్రభుత్వ సంస్థల డాటాపైన ఆధారపడిన సఫీనా బృందం ఇప్పుడు డాటా ఎనాలటిక్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలాంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. జియో-ట్యాగ్‌డ్ టార్గెట్ విలేజెస్ నుంచి మొబైల్ ఫోన్స్‌లో డాటా సేకరిస్తున్నారు. తమ పనితీరును మరింత మెరుగుపరుచుకొని ఉత్తమఫలితాలు సాధించడానికి వారికి ఇది ఉపయోగపడుతుంది.

గతాన్ని గట్టిగా గుర్తు పెట్టుకున్న సఫీనా హుసేన్ ఎన్నో రాష్ట్రాలలో ఎంతోమంది పేదింటి అమ్మాయిల ఉజ్వల భవిష్యత్ కోసం 'ఎడ్యుకేట్ గర్ల్స్' ద్వారా కృషి చేస్తోంది.

అయినా వెనకడుగు వేయలేదు



'ఎడ్యుకేట్ గర్ల్స్'తో తొలి అడుగులు వేసినప్పుడు 'మీలాగే చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు' అని నిరుత్సాహపరిచారు కొందరు. అయితే అలాంటి మాటలను మేము సీరియస్‌గా తీసుకోలేదు. 'ఫలితం వచ్చేవరకు మా ప్రయత్నం' అనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. బయటి వాళ్లు చెప్పే మాటల కంటే తమ ఊరి వాళ్లు చెప్పే మాటలకే గ్రామస్థులు ప్రాధాన్యత ఇస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో స్థానికులతో కలిసి ఆర్మీ ఆఫ్ జెండర్ ఛాంపియన్స్‌ను ప్రారంభించి ఆడపిల్లల విద్యకు సంబంధించి ఇంటింటి ప్రచారం నిర్వహించాం.

- సఫీనా హుసేన్, ఫౌండర్, ఎడ్యుకేట్ గర్ల్స్



'అథ్లెటిక్స్‌ను మరింత మార్కెటింగ్ చేయాలి'

భారత్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లను మరింత ఆకర్షణీయంగా మార్చాల్సిన అవసరం ఉందని స్టార్ అథ్లెట్, ఒలింపిక్ స్వర్ణపతక విజేత నీరజ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఎక్కువ మంది అభిమానులకు చేరువయ్యేందుకు తగినంత మార్కెటింగ్ కూడా చేయాలని అతను అన్నాడు. 'డైమండ్ లీగ్, కాంటినెంటల్ టూర్స్, వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ వంటి పెద్ద ఈవెంట్లను భారత్‌లో ప్రసారం చేయాలి. ప్రస్తుతం హైలైట్స్ మాత్రమే మనకు అందుబాటులో ఉంటున్నాయి. రాత్రి 1-2 వరకు మేల్కొని అభిమానులు అథ్లెటిక్స్ చూసేందుకు సిద్ధమైనా, వారికి ఆ అవకాశం ఉండటం లేదు' అని నీరజ్ అన్నాడు. కెన్యా, గ్రెనడాలాంటి దేశాలు కూడా ప్రపంచ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తుండగా మనం ఎందుకు చేయలేమని నీరజ్ వ్యాఖ్యానించాడు. 'నేను వరల్డ్ అథ్లెటిక్స్ అధికారులను ఎప్పుడు కలిసినా వారు భారత్‌లో ఇలాంటి ఈవెంట్ నిర్వహించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అదే జరిగితే ఎక్కువ మంది అథ్లెటిక్స్‌ను చూసి ఆకర్షితులవుతారనేది నా నమ్మకం' అని నీరజ్ చెప్పాడు.

కేన్ విలియమ్సన్ సెంచరీ

న్యూజిలాండ్ 266/8



సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (104; 11 ఫోర్లు) సెంచరీతో కదం తొక్కాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. ఓపెనర్లు లాథమ్ (21; 3 ఫోర్లు), కాన్వే (12) విఫలమవగా, ఆతిథ్య బంగ్లా బౌలర్లు పట్టు బిగించడంతో కివీస్ వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. ఈ దశలో విలియమ్సన్... డరైల్ మిచెల్ (41; 3 ఫోర్లు, 1 సిక్స్), గ్లెన్ ఫిలిప్స్ (42; 5 ఫోర్లు, 1 సిక్స్)లతో జట్టును నడిపించాడు. ఈ క్రమంలో అతను టెస్టు కెరీర్‌లో 29వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం పూర్తయిన కాసేపటికే విలియమ్సన్‌ను తైజుల్ ఇస్లామ్ బౌల్డ్ చేయడంతో 262 పరుగుల వద్ద ఏడో వికెట్‌గా నిష్క్రమించాడు. ఆట ముగిసే సమయానికి జేమీసన్ (7 బ్యాటింగ్), కెప్టెన్ టిమ్ సౌతీ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 4 వికెట్లు పడగొట్టాడు. షోరిఫుల్, మెహదీహసన్ మిరాజ్, నయీమ్ హసన్, మొమినుల్ తలా ఒక వికెట్ తీశారు. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులకు ఆలౌటైంది.

క్వార్టర్ ఫైనల్లో శివథాపా



షిల్లాంగ్: జాతీయ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బాక్సర్లు శివ థాపా, అమిత్ పంఘాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన 63.5 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ శివథాపా 5-0తో సంతోష్ (కర్ణాటక)పై ఏకపక్ష విజయం సాధించాడు. సర్వీసెస్ బాక్సర్ అమిత్ 4-1తో పంజాబ్‌కు చెందిన జైసందీప్ సింగ్‌ను ఓడించాడు. గురువారం జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో శివ... ఢిల్లీ బాక్సర్ శశాంక్ ప్రధాన్‌తో, పంఘాల్... మొహమ్మద్ ఆరిఫ్ (జమ్మూకశ్మీర్)తో తలపడతారు. మిగతా ప్రిక్వార్టర్స్ పోటీల్లో 2021 ఆసియా చాంపియన్ సంజీత్ (92 కేజీలు) 5-0తో సావన్ గిల్ (చండీగఢ్)పై, ఆశిష్ కుమార్ (హిమాచల్ ప్రదేశ్; 80 కేజీలు) 5-0తో నితీశ్ కుమార్ (చండీగఢ్)పై గెలుపొందారు.

ద్రవిడ్ బృందానికే జై

- హెడ్ కోచ్‌గా కొనసాగనున్న రాహుల్ ద్రవిడ్
- ఇతర సహాయక సిబ్బందికీ మళ్లీ అవకాశం
- బీసీసీఐ అధికారిక ప్రకటన



ముంబై: వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టుకు వరుస విజయాలతో ఫైనల్ వరకు చేర్చిన శిక్షణా బృందంపై బీసీసీఐ నమ్మకముంచింది. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సహా ఇతర ముగ్గురు కోచ్‌ల కాంట్రాక్ట్‌ను పొడిగిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పారస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌లకు కూడా మళ్లీ అవకాశం దక్కింది. వీరందరి కాంట్రాక్ట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. పొడిగింపుపై అప్పటి వరకు బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే బృందాన్ని మరి కొంత కాలం కొనసాగించడమే సరైందిగా బోర్డు భావించింది. ముందుగా దీనికి సంబంధించి ద్రవిడ్‌కు సమాచారం అందించింది. ద్రవిడ్ అంగీకరించకపోతే మరో ప్రత్యామ్నాయం వైపు బోర్డు చూసే ఆలోచనలో ఉండగా...ద్రవిడ్ కోచ్‌గా కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేశాడు. వీరి కాంట్రాక్ట్ ఎప్పటి వరకు అనే విషయంపై ఇంకా స్పష్టత లేకపోయినా... వచ్చే ఏడాది జూన్-జూలైలో జరిగే టి20 ప్రపంచ కప్ వరకు ఉండే అవకాశం ఉంది. మరో వైపు వన్డే, టి20లకు మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా పేరుపై కూడా చర్చ జరిగినా...నెహ్రా విముఖత చూపడంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టినట్లు సమాచారం.

అందుకే కొనసాగింపు...

గత రెండేళ్లుగా ద్రవిడ్, అతని సహచర కోచింగ్ బృందం భారత జట్టులో తీసుకొచ్చిన మార్పులు, ఏర్పరచిన మంచి వాతావరణం మున్ముందూ కొనసాగించాలని బీసీసీఐ అనుకుంది. కొత్తగా వచ్చే కోచ్‌తో ఇవన్నీ ఒక్కసారి మారిపోతే కష్టమని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. కోచ్ మారితే అతనితో పాటు ఇతర సహాయక సిబ్బంది కూడా కొత్తగా వచ్చే అవకాశం ఉంటుంది. ద్రవిడ్ బృందం భవిష్యత్తులో ఎప్పటి వరకు కొనసాగుతుందో ఇప్పుడే చెప్పలేకపోయినా... ఇదే జట్టు సహకారంతో కనీసం మరో ఐసీసీ టోర్నీలో జట్టు పాల్గొనడమే సరైందని వారు భావించారు. 'రాహుల్ ద్రవిడ్‌కు బోర్డు అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. మూడు ఫార్మాట్‌లలో భారత జట్టు అద్భుతంగా ఆడుతూ అగ్రస్థానంలో ఉంది. ద్రవిడ్ దూరదృష్టి, ఆలోచన, ప్రణాళిక అందుకు కారణం. వరల్డ్ కప్‌లో ఫైనల్‌కు ముందు వరుసగా పది మ్యాచ్‌లు గెలవడం అసాధారణ ప్రదర్శన. అందుకు హెడ్‌కోచ్‌ను తప్పకుండా అభినందించాలి. మున్ముందు మరిన్ని విజయాలు సాధించేందుకు వారికి అన్ని విధాలా సహకారం అందిస్తాం' అని బీసీసీఐ కార్యదర్శి జై షా అన్నారు. తనకు కొనసాగింపు లభించడం పట్ల ద్రవిడ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'భారత జట్టుతో నా ప్రయాణంలో ఎన్నో మధుర క్షణాలు ఉన్నాయి. ఇందులో ఎన్నో విజయాలు, పరాజయాలతో ఎత్తుపల్లాలు చవిచూశాం. ఆటగాళ్లు, మా శిక్షణా బృందం మధ్య మంచి అనుబంధం ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లో మేం నెలకొల్పిన మంచి సంస్కృతి పట్ల గర్వంగా ఉన్నాం. అద్భుతమైన ప్రతిభ ఉన్న మా జట్టుకు సరైన మార్గనిర్దేశనం చేసి మంచి ఫలితాలు సాధించేలా చేయడంలో సఫలమయ్యాం. నాపై నమ్మకం ఉంచి మళ్లీ అవకాశం కల్పించిన బోర్డుకు కృతజ్ఞతలు. ప్రపంచకప్ తర్వాత రాబోయే కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ద్రవిడ్ తన స్పందనను తెలియజేశాడు.

రికార్డు ఇలా...

రాహుల్ ద్రవిడ్ 2021 నవంబర్ 17నుంచి తొలి సారి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. రెండేళ్ల పదవీ కాలాన్ని అతనికి బోర్డు నిర్దేశించింది. వ్యక్తిగత సాన్నిహిత్యం ఉన్న సీనియర్ ఆటగాళ్లతో పాటు అంతకు ముందు వరకు ద్రవిడ్ కోచింగ్‌లో అండర్-19, భారత్ 'ఎ' జట్లకు ఆడిన ఆటగాళ్లు చాలా మంది జట్టులో ఉండటంతో కోచింగ్‌లో ద్రవిడ్ పని సులువైంది. అతను కోచ్‌గా ఉన్న సమయంలోనే భారత జట్టు టెస్టు, వన్డే, టి20ల్లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. అయితే మూడు అవకాశాలు లభించినా ఒక్క సారి కూడా ఐసీసీ టోర్నీని మాత్రం గెలవలేకపోయింది. 2022 టి20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్, 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ ఓటమిపాలైంది. అయితే ఫైనల్‌కు ముందు వరుసగా పది మ్యాచ్‌లలో సంపూర్ణ ఆధిపత్యంతో విజయం సాధించింది. ఈ ఏడాది ఆసియా కప్‌లో భారత్ విజేతగా నిలిచింది. రెండో సారి కోచ్‌గా ఇప్పుడు ద్రవిడ్ బాధ్యతలు డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనతో మొదలవుతాయి. ఈ టూర్‌లో 3 టి20లు, 3 వన్డేలతో పాటు 2 టెస్టులు ఆడుతుంది. సఫారీ గడ్డపై ఇప్పటి వరకు టెస్టు సిరీస్ నెగ్గని రికార్డు భారత్‌కు ఉంది. అనంతరం స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడుతుంది.

శ్రీకాంత్ మరో పరాజయం

- మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి జోడీ ముందంజ
- సయ్యద్ మోడి ఓపెన్ బ్యాడ్మింటన్



లక్నో: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. మాజీ ప్రపంచ నంబర్‌వన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ ఈ ఏడాది తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోతున్నాడు. సొంతగడ్డపై జరుగుతోన్న సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ టోర్నీలోనూ శ్రీకాంత్ ఆటకు మొదటి రౌండ్లోనే తెరపడింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ శ్రీకాంత్ 21-23, 8-21తో చైనీస్ తైపీకి చెందిన చియా హావొ లీ చేతిలో వరుస గేముల్లో పరాజయం చవి చూశాడు. ఇతర మ్యాచ్‌ల్లో కిరణ్ జార్జ్ 21-16, 14-21, 21-13తో భారత్‌కే చెందిన క్వాలిఫయర్ చిరాగ్ సేన్‌పై గెలుపొందగా, సమీర్ వర్మ 9-21, 21-7, 17-21తో వాంగ్ జు వి (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. ప్రియాన్షు రజావత్ 21-17, 21-19తో డిమిత్రి పనరిన్ (కజకిస్తాన్)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో క్లిష్టమైన డ్రా ఎదురవడంతో మాళ్విక బన్సోద్ తొలి రౌండ్లోనే ఇంటిదారి పట్టింది. ఆమె 21-18, 17-21, 10-21తో జపాన్ స్టార్ నజొమి ఒకుహర చేతిలో ఓడిపోయింది. భారత సహచరుల మధ్య జరిగిన పోరులో ఉన్నతి హుడా 15-21, 21-19, 21-18తో ఆకర్షి కశ్యప్‌పై గెలుపొందగా, క్వాలిఫయర్ కేయూర 8-21, 16-21తో ఎనిమిదో సీడ్ సంగ్ షు యున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ గాయత్రి గోపీచంద్-ట్రిసా జాలీ జోడీ ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. తొలి రౌండ్లో గాయత్రీ-ట్రిసా జాలీ జోడీ 21-9, 21-16తో భారత్‌కే చెందిన అపూర్వ-సాక్షి గెహ్లోవత్ జంటపై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్ మొదటి రౌండ్లో కోన తరుణ్-శ్రీకృష్ణ ప్రియ జంటకు 14-21, 15-21తో నితిన్ కుమార్-నవధ మంగళం జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.

మళ్లీ ఓడిన హైదరాబాద్, ఆంధ్ర

విజయ్ హజారే ట్రోఫీ

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మరో పరాజయాన్ని చవిచూసింది. బుధవారం గ్రూప్ 'బి' మ్యాచ్‌లో సర్వీసెస్ 6 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 210 పరుగుల వద్ద ఆలౌటైంది. రాహుల్ బుద్ధి (87 బంతుల్లో 80; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), తన్మయ్ అగర్వాల్ (45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. సర్వీసెస్ 40.5 ఓవర్లలో 4 వికెట్లకు 211 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పలివాల్ (101 బంతుల్లో 77 నాటౌట్; 6 ఫోర్లు), వినీత్ ధన్కర్ (76 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో సర్వీసెస్‌ను గెలిపించారు.

విహారి, హెబ్బర్ రాణించినా...

చండీగఢ్: గ్రూప్ 'డి'లో ఆంధ్ర జట్టు కూడా వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడింది. రాజస్తాన్ 38 పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. ముందుగా రాజస్తాన్ 50 ఓవర్లలో 290 పరుగుల వద్ద ఆలౌటైంది. అభిజిత్ తోమర్ (115 బంతుల్లో 124; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, రామ్ చౌహాన్ (68 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. పిన్నింటి తపస్వికి 4 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆంధ్ర 47.4 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌటైంది. హనుమ విహారి (80 బంతుల్లో 60; 9 ఫోర్లు), అశ్విన్ హెబ్బర్ (89 బంతుల్లో 68; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించినా... మిడిలార్డర్ వైఫల్యంతో ఆంధ్ర ఓటమిపాలయ్యింది. అనికేత్ చౌదరి 4 వికెట్లతో దెబ్బ తీసాడు.

భారత పేస్ బౌలర్ ముకేశ్ కుమార్ పెళ్లి పీట లెక్కాడు. తన మిత్రురాలు దివ్యాసింగ్‌ను అతను వివాహమాడాడు. భారత్ తరఫున ఒక టెస్టు, 3 వన్డేలు, 7 టి20లు ఆడిన ముకేశ్ తన వివాహం కారణంగా మంగళవారం ఆసీస్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. శుక్రవారం జరిగే నాలుగో టి20 కోసం అతను జట్టుతో జతకలుస్తాడు.



సినిమా

ఆ రోజే వార్?



• ఎన్టీఆర్

'వార్ 2' సినిమా చిత్రీకరణలో కాస్త ఆలస్యంగా పాల్గొననున్నారట ఎన్టీఆర్. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వార్ 2'. హిట్ ఫిల్మ్ 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లో మొదలైంది. ఈ సినిమా గురించి చర్చించడానికి ఎన్టీఆర్, అయాన్ ముఖర్జీ తరచూ సమావేశమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో జనవరిలో జాయిన్ కానున్నారట ఎన్టీఆర్. ఇక ఈ సినిమాను 2025 జనవరి 24న విడుదల చేయాలనుకున్నప్పటికీ తాజాగా ఆగస్టు 14కి విడుదల చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందని బాలీవుడ్ సమాచారం. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం 'దేవర'తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తొలి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

కౌంట్‌డౌన్ స్టార్ట్



• రామ్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమా రిలీజ్ కౌంట్‌డౌన్‌ని ఆరంభించారు మేకర్స్. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. సినిమా విడుదల తేదీలో ఎలాంటి మార్పు ఉండదని మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. రిలీజ్ డేట్‌ని స్పష్టం చేయడానికి వందరోజుల కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. రామ్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సీఈఓ: విషురెడ్డి.

ఇక షురూ



• కమల్ హాసన్

'కల్కి 2898 ఏడీ' షూట్‌కు టైమ్ అయ్యింది అంటున్నారట కమల్‌హాసన్. ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ వారంలో ఈ సినిమా చిత్రీకరణలో కమల్‌హాసన్ పాల్గొంటారని, ఆయనపై కొన్ని కీలక సన్నివేశాలను నాగ్ అశ్విన్ ప్లాన్ చేశారని టాక్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

టీజర్ ఆసక్తికరంగా ఉంది

- 'దిల్' రాజు



• మోహన్ వడ్లపట్ల, 'దిల్' రాజు

సంబీత్ ఆచార్య, జో శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఎమ్4ఎమ్'. నిర్మాత మోహన్ వడ్లపట్ల ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్విన్ గ్రూప్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన 'దిల్' రాజు మాట్లాడుతూ- ''టీజర్ ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''దర్శకుడిగా కొత్త అవతారం ఎత్తాను. నెక్స్ట్ హాలీవుడ్‌లోనూ ఓ సినిమాను నిర్మించబోతున్నాను. రాహుల్ అడబాల, జో శర్మలు ఈ చిత్రకథ రాయడంలో సహకరించారు'' అన్నారు మోహన్ వడ్లపట్ల. ఎంఆర్‌సీ చౌదరి, రాహుల్ అడబాల మాట్లాడారు.

ఇలాంటి సినిమా తీయాలంటే ధైర్యం కావాలి

- సుద్దాల అశోక్‌తేజ

బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించారు. ఈ సినిమాలోని 'పోతుగడ్డ మీద..' పాటను విడుదల చేశారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో బాబీ సింహా మాట్లాడుతూ- ''భీమ్స్‌గారి సంగీతం, సుద్దాల అశోక్‌తేజగారి సాహిత్యంలో ఏదో తెలియని భావోద్వేగం ఉంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కూడా మేం అంతే భావోద్వేగానికి లోనయ్యాం'' అన్నారు. ''సుద్దాల అశోక్‌తేజ, భీమ్స్‌గార్లు ఊరికే ఎమోషన్ కాలేదు. మా పూర్వీకుల చరిత్రలో అంతటి ఆవేదన నిండి ఉంది. భీమ్స్‌గారు పాడిన పాట వింటే పోతుగడ్డ మీద పుట్టిన భూమి బిడ్డల ఆత్మ ఘోషిస్తున్నట్లు ఉంటుంది'' అన్నారు యాటా సత్యనారాయణ. ''సుద్దాల హనుమంత, జానకమ్మల బిడ్డను కాకుంటే నా పాటలో ఇంత ఎమోషన్ ఉండేది కాదు. రజాకార్ ఉద్యమంలో మా అమ్మా నాన్న పాల్గొన్నారు. స్వాతంత్ర్యం కోసం వారు నైజాంకు వ్యతిరేకంగా పోరాడారు. రజాకార్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కమ్యూనిటీ నుంచి వచ్చిన భీమ్స్ ఉండటం నాకు కలిసొచ్చింది. ఈ తరహా సినిమా తీయాలంటే డబ్బులు ఉంటే సరిపోదు.. ధైర్యం కావాలి. ఆ ధైర్యం గూడూరు నారాయణరెడ్డికి ఉంది'' అన్నారు సుద్దాల అశోక్‌తేజ. ''మా తాతగారు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ సమాజం ఎంత కష్టానికి గురైందో, ఎన్ని కన్నీళ్లను చూసిందో... వారందరి స్వరాలకు నేను స్వరాన్ని సమకూర్చానని చెప్పాలి'' అన్నారు భీమ్స్ సిసిరోలియో. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనుష్య త్రిపాఠి, కొరియోగ్రాఫర్ స్వర్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పోతిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.



• భీమ్స్, సుద్దాల అశోక్‌తేజ, స్వర్ణ, బాబీ సింహా

దూత ఓ కొత్త అనుభూతి



• విక్రమ్ కె. కుమార్

''థ్యాంక్యూ' సినిమా తర్వాత 'దూత' వెబ్ సిరీస్ గురించి నాగచైతన్యతో చెప్పాను. హారర్, థ్రిల్లర్ నేపథ్యం అంటే నాకు భయం అన్నాడు. కథ వినమన్నాను. ఆ తర్వాత కథ నచ్చడంతో చేస్తానని చెప్పాడు. సూపర్ నేచురల్, ఊహాతీతమైన అంశాలతో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తుంది'' అని డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ అన్నారు. హీరో నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ 'దూత'. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవానీశంకర్, ప్రాచీ దేశాయ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శరత్ మరార్ నిర్మించిన ఈ సిరీస్ డిసెంబరు 1 నుంచి అమేజాన్‌లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఎనిమిది ఎపిసోడ్స్‌గా ప్రసారం కానుంది. ఈ సందర్భంగా విక్రమ్ కె. కుమార్ చెప్పిన విశేషాలు.

- 'దూత' పూర్తిగా కల్పిత కథ. 'దూత' అంటే ఏదైనా సమాచారాన్ని చేరవేసేవాడు. ఇందులో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ సాగర్ పాత్రలో నాగచైతన్య అద్భుతంగా నటించాడు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అంటేనే సవాల్‌తో కూడుకున్నది. సంచలనం సృష్టించిన ఓ ఘటన తాలూకు వాస్తవాలను సాగర్ ఎలా పాఠకుల ముందు ఉంచాడు? ఆ తర్వాత అతని జీవితంలో ఎలాంటి మలుపులు ఎదురయ్యాయి? అనేది ప్రేక్షకులు అంచనా వేయలేరు. తన కంఫర్ట్ జోన్ నుండి బయటకి వచ్చి, ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రని సవాల్‌గా తీసుకుని చేశాడు నాగచైతన్య.
- 'దూత'లో మూడు సినిమాలు తీసేంత కథ ఉంది. అందుకే వెబ్ సిరీస్‌గా తీశాం. పైగా సినిమాగా తీస్తే మన ప్రేక్షకులకు మాత్రమే చేరువ అవుతుంది. ఓటీటీలో ప్రసారం చేయడం ద్వారా ఇతర దేశాల్లోని వారు కూడా మన ఇండియన్ వెబ్ సిరీస్‌లు చూసే అవకాశం ఉంటుంది.
- షార్ట్ ఫిలిం, వెబ్ ఫిల్మ్, సినిమా.. దేని కష్టం దానికి ఉంటుంది. అయితే సినిమా తీయడం సులభమే.. కానీ, మంచి మూవీ తీయడం చాలా కష్టం.

కథ మొదలెట్టినాడు చూడరయ్యా...



• తేజా సజ్జా, ప్రశాంత్ వర్మ

తేజా సజ్జా, అమృతా అయ్యర్ హీరో హీరోయిన్లుగా వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హను-మాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళం, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భాషల్లో జనవరి 12న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఆవకాయ ఆంజనేయ కథ మొదలెట్టినాడు చూడరయ్యా.. శక్తినంత కూడగట్టి సెట్టు దులిపినాడు అంజయ్యా..' పాటను విడుదల చేశారు. అనుదీప్ సంగీత సారథ్యంలో సింహాచలం మన్నెల సాహిత్యం అందించిన ఈ పాటను సాహితీ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో తేజా సజ్జా మాట్లాడుతూ- ''మనకి ఆపద వస్తే ఆంజనేయస్వామి... ఆకలేస్తే ఆవకాయ.. ఇది మన సంస్కృతిలోనే బలంగా పాతుకుపోయి ఉంది. ఇదొక భావోద్వేగం. అలాంటి మన సంస్కృతిని కమర్షియల్ పంథాలో గొప్పగా చూపించేందుకు ప్రశాంత్‌గారు ప్రయత్నించారు'' అన్నారు. ''ఆవకాయ ఆంజనేయ' పాటతోనే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ సినిమాలోని ప్రతి పాట కథను ముందుకు తీసుకువెళ్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ చూడదగ్గ చిత్రం ఇది. 'హను-మాన్' అసలు సిసలైన సంక్రాంతి సినిమా'' అన్నారు ప్రశాంత్ వర్మ.

అందుకే సవాల్‌గా అనిపించింది



• కార్తీక్ రాజు

''అథర్వ' క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ నేపథ్యంలోని సినిమాలన్నీ ఒకే తరహాలో ఉంటాయి. కానీ, ఎలాంటి ఆధారాలు లేని ఓ కేసుని హీరో ఎలా పరిష్కరించాడు? అనేది ఈ సినిమాలో సరికొత్త పాయింట్''అని హీరో కార్తీక్ రాజు అన్నారు. మహేశ్ రెడ్డి దర్శకత్వంలో కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కార్తీక్ రాజు మాట్లాడుతూ- ''ఈ సినిమాలో హీరో పాత్రకు ఆస్తమా ఉంటుంది. అందుకే పోలీస్ కావాలని ఉన్నా కాలేకపోతాడు. చివరకు పోలీస్ విభాగంలోని క్లూస్ టీమ్‌లో జాయిన్ అవుతాడు. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్లో నటిస్తున్నప్పుడు హావభావాలు చాలా ముఖ్యం. మన నటన మీదే సినిమా ఆధారపడి ఉంటుంది. అందుకే ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది. ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఓ సినిమా పూర్తి చేశాను. డిసెంబర్ 7 నుంచి కొత్త సినిమా ప్రారంభిస్తున్నాను'' అన్నారు.

నాలోని మరో కోణాన్ని చూస్తారు

- సుధీర్



• విరాజ్, బెక్కం వేణుగోపాల్, అరుణ్, సుధీర్, డాలీషా, విజేష్, జేడీ

''కాలింగ్ సహస్ర'లో సవాల్‌తో కూడుకున్న మంచి పాత్ర ఇచ్చిన అరుణ్‌గారికి థ్యాంక్స్. నాలోని మరో కోణాన్ని చూపించే పాత్ర ఇది. ఇకపై కొత్త కథలతో మంచి చిత్రాలు చేస్తాను. 'కాలింగ్ సహస్ర' మీకు నచ్చితే పది మందికి చెప్పండి'' అని 'సుడిగాలి' సుధీర్ అన్నారు. అరుణ్ విక్కీరాలా దర్శకత్వంలో 'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకి నటుడు జేడీ చక్రవర్తి, దర్శకులు దశరథ్, 'బొమ్మరిల్లు' భాస్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుధీర్ మాట్లాడుతూ-''మా సినిమాను మంచి థియేటర్లలో విడుదల చేసేందుకు సాయం చేసిన బెక్కం వేణుగోపాల్‌గారికి ధన్యవాదాలు. నా 'గాలోడు' సినిమా అభిమానుల వల్లే హిట్ అయింది. ఎన్ని జన్మలు ఎత్తినా వారి రుణం తీర్చుకోలేను'' అన్నారు. ''సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు విజేష్ తయాల్, వెంకటేశ్వర్లు కాటూరి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	728	66,902
నిఫ్టీ ▲	207	20,097

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 7.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,282	▲	41
డోజోన్స్	35,417	▲	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▼	08
డాక్స్	16,161	▲	168
షాంఘై	3,022	▼	17
నికాయ్	33,321	▼	87

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో


	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.57	84.24
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.73	107.11
€	యూరో	ఎస్‌బీఐ	90.23	93.33
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.82	57.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.29	56.66
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.82	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.57	12.54

బుల్ @ 4 ట్రిలియన్

బీఎస్ఈ సరికొత్త రికార్డ్

4 లక్షల కోట్ల డాలర్లకు మార్కెట్ క్యాపిటలైజేషన్ | అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ సరసన చోటు

లిస్టెడ్ కంపెనీల విలువ @ రూ. 338 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: విలువలో తాజాగా బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ(బీఎస్ఈ) సరికొత్త రికార్డ్ సాధించింది. ఎక్స్ఛేంజీలో లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 338 లక్షల కోట్లను అధిగమించింది. తద్వారా 4 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో బీఎస్ఈ చేరింది. వెరసి అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ సరసన భారత్ నిలిచింది. బుధవారం(29న) మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 728 పాయింట్లు జంప్‌చేసి 66,902 వద్ద ముగిసింది. దీంతో ఒక్క రోజులో మార్కెట్ విలువకు రూ. 2,35,308 కోట్లమేర జమయ్యింది. ఫలితంగా మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) రూ. 3,38,67,591 కోట్లకు చేరింది. రూపాయి ప్రస్తుత మారకపు విలువ ప్రకారం తొలిసారి 4 లక్షల కోట్ల డాలర్లను తాకింది. ఈ ఏడాది సెప్టెంబర్ 15న సెన్సెక్స్ 67,927 పాయింట్లను అధిగమించడం ద్వారా చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఇప్పటివరకూ సెన్సెక్స్ 6,061 పాయింట్లు (10%) ఎగసింది. దీంతో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 51 లక్షల కోట్ల మేర బలపడింది. కాగా.. 2007లో ట్రిలియన్ డాలర్ల విలువను అందుకున్న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 2 ట్రిలియన్ డాలర్లకు చేరేందుకు దశాబ్దకాలం పట్టింది. ఆపై 2021 మే 24న తొలిసారి 3 ట్రిలియన్ డాలర్లకు చేరి రికార్డ్ సృష్టించింది. అప్పటినుంచి 4 ట్రిలియన్లకు చేరుకునేందుకు రెండున్నరేళ్లే పట్టడం గమనార్హం!

స్పీడ్ ఎందుకంటే: గత వారం పరిమిత శ్రేణిలోనే కదిలిన మార్కెట్లు యూఎస్ వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు తగ్గడంతోపాటు, యూఎస్ బాండ్ల ఈల్డ్స్ నీరసించడంతో జోరందుకున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. క్యూ2 ఫలితాలు, వృద్ధి అంచనాలు, ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తుండటం, ఐపీవోల జోరు వంటి అంశాలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు తెలియజేశారు.

విలువ జోరు తీరిలా..

విలువ	తేదీ
1 ట్రిలియన్	28-5-2007
2 ట్రిలియన్లు	10-7-2017
3 ట్రిలియన్లు	24-5-2021
4 ట్రిలియన్లు	29-11-2023

(విలువ: డాలర్లలో)

గ్లోబల్ టాప్-5లో చోటు

దేశం	విలువ (డాలర్లలో)
అమెరికా	47.78 ట్రిలియన్లు
చైనా	9.74 ట్రిలియన్లు
జపాన్	6.02 ట్రిలియన్లు
హాంకాంగ్	4.78 ట్రిలియన్లు
భారత్	4.06 ట్రిలియన్లు

మళ్లీ 20 వేల పైకి నిఫ్టీ

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ
- సెన్సెక్స్ లాభం 728 పాయింట్లు

ముంబై: సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీతో స్టాక్ సూచీలు బుధవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 728 పాయింట్లు పెరిగి 66,902 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207 పాయింట్లు బలపడి 47 ట్రేడింగ్ సెషన్ల(సెప్టెంబర్ 18) తర్వాత తొలిసారి 20,000 స్థాయిపై 20,097 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే జోరును కొనసాగించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 772 పాయింట్లు ఎగసి 66,946 వద్ద, నిఫ్టీ 215 పాయింట్లు బలపడి 20,105 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. బ్యాంకింగ్, ఆటో, ఐటీ, ఫైనాన్స్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. కన్జూమర్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.78%, 0.40% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.72 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.2,361 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. ఆసియా మార్కెట్లు వారం గరిష్టానికి చేరుకున్నాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి.

- అధిక వెయిటేజీ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.50%, ఇన్ఫోసిస్ 1%, టీసీఎస్ 1%, రిలయన్స్ అరశాతం చొప్పున రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి.
- సెన్సెక్స్ 30 షేర్లలో నెస్లే 0.60%, టైటన్ 0.43%, బజాజ్ ఫిన్ సర్వ్ 0.30%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.01% మాత్రమే నష్టపోయాయి.

వారెవ్వా ఇరెడా..

మినీరత్న కంపెనీ ఐఆర్ఈడీఏ లిస్టింగ్ సూపర్ హిట్ అయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.32)తో పోలిస్తే 56% ప్రీమియంతో రూ.50 వద్ద లిస్టయ్యింది. ప్రారంభం నుంచే కొనుగోళ్ల మద్దతు లభించడంతో 87% ఎగసి ఇంట్రాడే గరిష్టం రూ.60 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 3.81 కోట్ల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.16,124 కోట్లుగా నమోదైంది.

రుణ వ్యాపారాన్ని ప్రారంభించిన జియో ఫైనాన్స్

వ్యక్తిగత, కన్జ్యూమర్, వర్తక రుణాలు ● మై జియో యాప్‌పై డిజిటల్‌గా ఆఫర్




న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో ఫైనాన్స్ తన రుణ వితరణ వ్యాపారాన్ని ప్రారంభించింది. తొలుత పర్సనల్ లోన్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్, మర్చంట్ ట్రేడ్ క్రెడిట్ ఫెసిలిటీని ఆరంభించింది. జియో ఫైనాన్స్, మై జియో మొబైల్ అప్లికేషన్స్ ద్వారా వేతన జీవులు, స్వయం ఉపాధిలో ఉన్న వారికి డిజిటల్ పర్సనల్ లోన్స్ ఆఫర్ చేస్తోంది. పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ఉంటే చాలు. రుణాన్ని వేగంగా పొందొచ్చు. కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్ కింద ఖరీదైన మొబైల్ ఫోన్లు, ఏసీలు, కెమెరా కొనుగోళ్లకు రుణాలను అందిస్తోంది. మర్చంట్ వెబ్‌సైట్లపై నోకాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కింద ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసుకోవచ్చు. ''జియో ఫైనాన్స్ కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రుణాలను అందిస్తోంది. తయారీదారులు, ఓఈఎంలు లేదా డీలర్లు ఈ రుణాలపై వడ్డీని భరిస్తారు. దీంతో నో కాస్ట్ ఈఎంఐ ప్రయోజనాన్ని వినియోగదారులు పొందొచ్చు. కాకపోతే కస్టమర్లు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది''అని జియో ఫైనాన్స్ పేర్కొంది.

ఇన్వెంటరీ కొనుగోళ్లకూ రుణాలు

వ్యాపారస్థులకు రుణాలను కూడా జియో ఫైనాన్స్ ప్రారంభించింది. అన్ సెక్యూర్డ్ మర్చంట్ ట్రేడ్ క్రెడిట్ ఫెసిలిటీని తన ప్లాట్‌ఫామ్‌పై నమోదైన వర్తకులకు అందించనుంది. జియో ఫైనాన్షియల్ రిలయన్స్ నుంచి విడిపోయి ఎక్స్ఛేంజ్‌లలో లిస్టయింది. ఇన్సూరెన్స్ బ్రోకింగ్, మ్యూచువల్ ఫండ్స్ సేవలను సైతం ఈ సంస్థ త్వరలోనే అందించనుంది.

చార్లీ ముంగర్ కన్నుమూత

బెర్క్‌షైర్ వైస్ చైర్మన్‌గా కీలక బాధ్యతలు



కాలిఫోర్నియా: అమెరికా దిగ్గజ సంస్థ బెర్క్‌షైర్ హాథ్‌వే వైస్ చైర్మన్ చార్లీ ముంగర్ (99) కన్నుమూశారు. బెర్క్‌షైర్ హాథ్‌వే సామ్రాజ్యాన్ని ఇన్వెస్ట్‌మెంట్ గురు వారెన్ బఫెట్ నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ముంగర్ మరణంపై ప్రపంచవ్యాప్తంగా పలువురు వ్యాపార దిగ్గజాలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తినిస్తూ, వెన్నంటి నిలవకపోయి ఉంటే హాథ్‌వే ఈ స్థాయికి ఎదిగేది కాదని బఫెట్ వ్యాఖ్యానించారు. 1924 జనవరి 1న జన్మించిన ముంగర్ 1940లలో యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌లో విద్యాభ్యాసం చేశారు. అయితే, అక్కడ గణితంలో బ్యాచిలర్స్ డిగ్రీని మధ్యలోనే వదిలేసి, రెండో ప్రపంచ యుద్ధంలో ఆర్మీ ఎయిర్ కోర్‌లో వాతావరణ శాస్త్రవేత్తగా పని చేశారు. తర్వాత 1948లో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1959లో బఫెట్‌ను కలిసిన తర్వాత నుంచి ఇద్దరి మధ్య దశాబ్దాల పాటు స్నేహం కొనసాగింది. పెట్టుబడులపై ఇద్దరు కలిసి తమ ఆలోచనలను పంచుకునేవారు. ఇన్వెస్ట్ చేసేవారు. ఆ బంధం మరింత బలపడి 1978లో బెర్క్‌షైర్‌లో ముంగర్ వైస్ చైర్మన్‌గా చేరారు. సంస్థ వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. పెట్టుబడి అవకాశాలను మదింపు చేసేందుకు సైకాలజీ, భౌతిక శాస్త్రం, గణిత సూత్రాలను ఉపయోగించేవారు. వ్యాపారాలకు విలువ కట్టడం, మనుషుల స్వభావాలను తెలుసుకోవడం గురించి చార్లీ తనకు ఎంతో నేర్పించారని బఫెట్ వ్యాఖ్యానించారు. ముంగర్ సంపద ఒక దశలో రెండు బిలియన్ డాలర్లకు చేరింది.

ఐదేళ్లు ప్రీమియం.. జీవితాంతం ఆదాయం

ఎల్ఐసీ కొత్త ప్లాన్ జీవన్ ఉత్సవ్ ● ఏటా 10 శాతం ఆదాయం



న్యూఢిల్లీ: జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ 'జీవన్ ఉత్సవ్' పేరుతో ప్రత్యేక బీమా పథకాన్ని ఆవిష్కరించింది. ఇది నాన్ లింక్డ్ (ఈక్విటీయేతర), నాన్ పార్టిసిపేటింగ్, మనీ బ్యాక్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం. ఈ ప్లాన్‌లో నిర్ణీత కాలం తర్వాత నుంచి ఏటా 10 శాతం చొప్పున (సమ్ అష్యూర్డ్‌లో) వెనక్కి వస్తుంది. కనీస బీమా రూ.5,00,000. గరిష్ట బీమా కవరేజీకి పరిమితి లేదు. 5-16 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లింపుల కాలాన్ని ఎంపిక చేసుకోవచ్చు. గరిష్టంగా 65 ఏళ్ల వరకు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. రెగ్యులర్ ఇన్‌కమ్ లేదా ఫ్లెక్సీ ఇన్‌కమ్‌లో ఒక ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. పాలసీ చెల్లింపుల కాలంలో మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్‌కు తోడు, గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు. ప్రతి వెయ్యి రూపాయలకు ఏటా రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్ లభిస్తుంది. ఇలా ప్రీమియం చెల్లింపుల కాలం వరకు ఏటా జమ అవుతుంది. ప్రీమియంను సకాలంలో చెల్లించడంలో విఫలమైతే గ్యారంటీడ్ అడిషన్స్‌ను దాని కింద సర్దుబాటు చేస్తారు. రెగ్యులర్ ఇన్‌కమ్ ఆప్షన్‌లో ప్రీమియం చెల్లింపుల కాల వ్యవధి ముగిసిన మూడేళ్లు లేదా ఆరేళ్ల తర్వాత నుంచి ఏటా 10% ఆదాయం లభిస్తుంది. ఉదాహరణకు 5 ఏళ్లు ఎంపిక చేసుకుంటే 8 ఏళ్లు లేదా 11వ ఏట నుంచి ఏటా 10% ఆదాయం అందుకోవచ్చు. పదేళ్ల ప్రీమియం చెల్లింపుల కాలం ఎంపిక చేసుకుంటే 13వ ఏట నుంచి ఆదాయం వస్తుంది. ఫ్లెక్సీ ఇన్‌కమ్ ఆప్షన్‌లోనూ ఏటా 10% ఆదాయం అందుకోవచ్చు.

భవిత

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

స్కాలర్‌షిప్స్

» పీఎం-యూఎస్‌పీ స్కాలర్‌షిప్పులకు ప్రకటన
» ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

ఆర్థిక పరిస్థితులు సహకరించక ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇలాంటి వారు తమ చదువులను కొనసాగించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. అర్హులైన విద్యార్థులకు ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా ప్రోత్సాహన్(పీఎం-యూఎస్‌పీ) పేరిట ఉపకార వేతనాలు చెల్లిస్తారు. సెంట్రల్ సెక్టార్ స్కీమ్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ పేరుతో వీటిని అందిస్తున్నారు. ఆ వివరాలు..

పీఎం-యూఎస్‌పీ

ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా ప్రోత్సాహన్(పీఎం-యూఎస్‌పీ)కు దరఖాస్తు చేయాలంటే.. అండర్ గ్రాడ్యుయేషన్ లేదా ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫస్ట్ ఇయర్ కోర్సుల్లో చేరినవారు అర్హులు. యూజీ నుంచి పీజీ వరకు ఐదేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్పులను అందిస్తారు. బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాలుగేళ్ల వరకు ఈ ఉపకార వేతనం లభిస్తుంది. సాధారణ డిగ్రీలు, ఇంటిగ్రేటెడ్ పీజీలు చదువుతున్నవారికి ఏడాదికి రూ.12వేలు చొప్పున మొదటి మూడేళ్లు వారి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పీజీలో చేరినప్పుడు సంవత్సరానికి రూ.20వేలు చొప్పున రెండేళ్లు అందిస్తారు. బీటెక్ విద్యార్థులకైతే నాలుగో ఏడాది రూ.20వేలు ఇస్తారు.

82వేల మందికి

పీఎం-యూఎస్‌పీ కింద దేశవ్యాప్తంగా మొత్తం 82 వేల స్కాలర్‌షిప్‌లు అందించనున్నాయి. వీటిని రాష్ట్రాలవారీగా విభజించారు. ఇందుకు రాష్ట్రాల వారీగా 18-25 ఏళ్ల వయసు జనాభాను ప్రాతిపదికన తీసుకుంటారు. రాష్ట్రాలవారీ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డులో పదోతరగతి ఉత్తీర్ణత శాతంతోనూ మదింపు చేస్తారు. రాష్ట్రాలవారీగా కేటాయించిన స్కాలర్‌షిప్పులో సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్ విద్యార్థులకు 3:2:1 విధానంలో ఎంపిక చేస్తారు. అలాగే మొత్తం స్కాలర్‌షిప్పుల్లో 50 శాతం అమ్మాయిలకు కేటాయిస్తారు.

అర్హతలు

- 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా 10+2 కోర్సుల ఉత్తీర్ణులు ఈ స్కాలర్‌షిప్పుల దరఖాస్తుకు అర్హులు.
- ఇంటర్ లేదా ప్లస్ 2లో 80 పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించాలి. అంటే.. ఆ బోర్డు పరిధిలో టాప్ 20 పర్సంటైల్ సాధించిన ఉండాలి.
- రెగ్యులర్ విధానంలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే అర్హులు. కుటుంబ వార్షికాదాయం రూ.4.5 లక్షలకు మించకుండా ఉండాలి. ఇతర ఏ ఉపకార వేతనం పొందనివారే దీనికి అర్హులు.
- స్కాలర్‌షిప్పులకు ఎంపికైన విద్యార్థులు ఆ తర్వాత ఏడాదిల్లోనూ వీటిని పొందడానికి అంతకముందు విద్యా సంవత్సరంలో కనీస హాజరు కలిగి ఉండాలి. నిర్దేశిత మార్కుల శాతం సైతం తప్పనిసరి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం సంబంధిత స్కాలర్‌షిప్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో పూరించాలి. అవసరమైన పత్రాలను జత చేయాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** డిసెంబర్ 31, 2023
- **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

బీటెక్ తర్వాత.. పయనమెటు!

» క్యాంపస్ ఆఫర్స్‌తోపాటు ఆఫ్ క్యాంపస్ హైరింగ్స్
» ఉన్నత విద్యలో ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీకి అవకాశం
» విదేశాల్లో ఎంఎస్, మేనేజ్‌మెంట్ కోర్సులకు మార్గం
» ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు

ఇంజనీరింగ్ పూర్తిచేసుకుంటే ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయని భావిస్తారు. దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది బీటెక్ పట్టాలతో జాబ్ మార్కెట్లోకి అడుగు పెడుతున్నారు. వీరిలో క్యాంపస్ ఆఫర్స్ దక్కేది చాలా తక్కువ మందికి మాత్రమే! మరి మిగతా వారి పరిస్థితి ఏంటి? బీటెక్ తర్వాత అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు.. విదేశీ విద్యకు మార్గాలేమిటి? మరికొద్ది నెలల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు ఉపయోగపడేలా బీటెక్ తర్వాత ఉన్నత విద్య, ఉపాధి మార్గాలపై ప్రత్యేక కథనం..



బీటెక్ విద్యార్థుల్లో అధిక శాతం మంది క్యాంపస్ ఆఫర్స్‌వైపు దృష్టి పెడతారు. లేదంటే విదేశీ విద్యను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ రెండింటికే పరిమితం కాకుండా.. విస్తృత కోణంలో ఆలోచిస్తే.. మరెన్నో అవకాశాలు అందుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ప్రస్తుతం బీటెక్ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల పరంగా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఆఫ్-క్యాంపస్ విధానంలో ఉద్యోగ ప్రయత్నాలు చేసే అభ్యర్థులు టెక్నికల్ స్కిల్స్‌తోపాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచుకోవడంపైనా దృష్టిపెట్టాలి.

ఉన్నత విద్య

బీటెక్ తర్వాత ఉన్నత విద్య లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు ఎంటెక్‌వైపు అడుగులు వేస్తారు. ఇందు కోసం గేట్ పరీక్ష అందుబాటులో ఉంది. దాన్నే తమ తొలి లక్ష్యంగా భావిస్తున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర యూనివర్సిటీల్లో బీటెక్ అర్హతతోనే గేట్ స్కోర్ ఆధారంగా ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ (ఎంఎస్ బై రీసెర్చ్, ఎంటెక్ బై రీసెర్చ్ వంటివి) కోర్సుల్లో చేరే వీలుంది.

బీటెక్ అర్హతతో పీహెచ్‌డీ చేయాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో మార్గం.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పలు పరిశోధన సంస్థల్లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్-పీహెచ్‌డీలో చేరొచ్చు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన అభ్యర్థులకు తొలి రెండేళ్లు నెలకు రూ.25 వేలు చొప్పున; మూడో ఏడాది నుంచి నెలకు రూ.28 వేలు చొప్పున ఫెలోషిప్ సైతం లభిస్తుంది. ఈ పరీక్షను ప్రతి ఏటా రెండుసార్లు (జూన్/డిసెంబర్) నిర్వహిస్తారు.

మేనేజ్‌మెంట్ కోర్సులు

ఉన్నత విద్య పరంగా బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి కోర్సు.. మేనేజ్‌మెంట్ పీజీ/ఎంబీఏ. ఇందుకోసం ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). ప్రతిష్టాత్మక ఐఐఎంలు, ఇతర ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి మార్గం.. క్యాట్. రాష్ట్రాల స్థాయిలో ఐసెట్ ద్వారా ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఐసెట్‌కు సంబంధించి.. ఏప్రిల్/మేలో పరీక్షలు నిర్వహిస్తారు.

విదేశీ విద్య

ఇంజనీరింగ్ కోర్సుల ఉత్తీర్ణులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ తదితర దేశాల్లో ఉన్నత విద్య అవకాశాలను అన్వేషిస్తున్నారు. వీరు ఆయా దేశాల్లో ఎంఎస్, మేనేజ్‌మెంట్ పీజీ వంటి కోర్సుల్లో చేరుతున్నారు. సదరు విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందేందుకు పలు ప్రామాణిక టెస్టుల్లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది.

- **జీఆర్ఈ:** ఫారిన్ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో పీజీలో చేరాలనుకునే విద్యార్థులు జీఆర్ఈ (గ్రాడ్యుయేట్ రికార్డ్స్ ఎగ్జామినేషన్)లో స్కోర్ పొందాల్సి ఉంటుంది.
- **జీమ్యాట్:** విదేశాల్లో మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశానికి కీలకమైన పరీక్ష.. జీమ్యాట్ (గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్).
- **టోఫెల్:** స్టడీ అబ్రాడ్ అభ్యర్థులు తప్పనిసరిగా ప్రతిభ చూపాల్సిన పరీక్ష.. టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఫారెన్ లాంగ్వేజ్). ఇది అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ నైపుణ్యాలను పరీక్షించేందుకు ఉద్దేశించిన పరీక్ష.

సర్కారీ కొలువులు

పీఎస్‌యూ జాబ్స్

బీటెక్ విద్యార్థులకు ప్రభుత్వ కొలువుల పరంగా పీఎస్‌యూ జాబ్స్ చక్కటి మార్గంగా చెప్పొచ్చు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే.. గేట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. గేట్ స్కోర్ ఆధారంగా పలు ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) ఎంట్రీ లెవల్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. అందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి.

యూపీఎస్సీ నోటిఫికేషన్స్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల సంస్థ యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలో ర్యాంకు ఆధారంగా ఇండియన్ రైల్వేస్, టెలికమ్యూనికేషన్స్, ఎనర్జీ డిపార్ట్‌మెంట్ తదితర శాఖల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఈ పరీక్షకు నోటిఫికేషన్ జనవరి/ఫిబ్రవరిలో వెలువడుతుంది.అభ్యర్థులు ఇప్పటి నుంచే బీటెక్ స్థాయిలోని సబ్జెక్ట్‌లను అకడమిక్,కాంటెంపరరీ అప్రోచ్‌తో సన్నద్ధమైతే విజయావకాశాలు మెరుగవుతాయి.

సివిల్ సర్వీసెస్

ఇంజనీరింగ్ అభ్యర్థుల ముందున్న మరో అవకాశం.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. దేశ అత్యున్నత సర్వీసులుగా పేరొందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్-ఎ, గ్రూప్-బి తదితర పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా సివిల్స్ పరీక్షను నిర్వహిస్తుంది. మూడంచెల్లో(ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియలో ఏటా గణనీయ సంఖ్యలో ఇంజనీరింగ్ అభ్యర్థులు విజయం సాధిస్తున్నారు.

రాష్ట్రాల స్థాయిలో ఉద్యోగాలు

రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పలు శాఖల్లో (ట్రాన్స్ కో, జెన్ కో, ఇరిగేషన్ అండ్ క్యాడ్, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్టీసీ) బీటెక్ అర్హతగా అసిస్టెంట్ ఇంజనీర్స్ పోస్టుల భర్తీ జరుగుతుంది. ఈ ప్రక్రియను పబ్లిక్ సర్వీస్ కమిషన్లు చేపడతాయి. కోర్ సబ్జెక్టులపై పట్టుతో ఈ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

కేంద్ర ఆరోగ్య శాఖలో 487 ఉద్యోగాలు

జాబ్స్ ఇన్ఫో

కేంద్ర ప్రభుత్వ కొలువులు కోరుకునే వారికి చక్కటి అవకాశం! డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. భారత ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన ఈ సంస్థ.. వివిధ నగరాల్లోని వైద్య సంస్థల్లో 487 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నైలలో ఈ ఉద్యోగాలు ఉన్నాయి. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు

రీసెర్చ్ అసిస్టెంట్, టెక్నీషియన్, ల్యాబొరేటరీ అటెండెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ వర్కర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ క్లర్క్, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, యానిమల్ అటెండెంట్, లైబ్రరీ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్స్ (స్టాఫ్ నర్స్), పారామెడికల్ వర్కర్, వర్క్‌షాప్ అటెండెంట్ విభాగాల్లో 487 పోస్టులున్నాయి.

అర్హతలు

- **హెల్త్ ఇన్‌స్పెక్టర్:** ఈ విభాగంలో మొత్తం 70 పోస్టులున్నాయి. ఏదైనా డిగ్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్/హెల్త్ ఇన్‌స్పెక్టర్/శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ డిప్లొమా పాసవ్వాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **ఫీల్డ్ వర్కర్:** ఇందులో మొత్తం 140ఖాళీలున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ట వయోపరిమితి 25 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **ల్యాబొరేటరీ అటెండెంట్:** ఈ విభాగంలో 69 ఉద్యోగాలున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణత సాధించి.. మెడికల్ ల్యాబొరేటరీ టెక్నిక్స్/యానిమల్ కేర్/ల్యాబరేటరీ యానిమల్ కేర్/ప్రొడక్షన్ ఆఫ్ ఇమ్యునోబయలాజికల్ అండ్ యానిమల్ కేర్/వెటర్నరీ ల్యాబొరేటరీ టెక్నాలజీలో ఏడాది పాటు ట్రెనింగ్ సర్టిఫికేట్ లేదా ఏడాది డిప్లొమా ఉండాలి. గరిష్ట వయోపరిమితి 27 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- **నర్సింగ్ ఆఫీసర్:** ఈ విభాగంలో 16 పోస్టులు ఉన్నాయి. బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ పాసవ్వాలి. నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్/నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రిజిస్టర్ అవ్వాలి. 50 పడకల హాస్పిటల్‌లో ఏడాది పాటు పనిచేసిన అనుభవం ఉండాలి. గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.

రాత పరీక్ష ఇలా

ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 60 ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రశ్నలన్నీ కూడా సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచే వస్తాయి. గతంలో చదివిన సబ్జెక్టులే అయినా అందులోని ముఖ్యాంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. ప్రతి ప్రశ్నకు ఒక నిమిషం మాత్రమే సమయం ఉంటుంది. కాబట్టి మొదట తమకు బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.11.2023
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ రెండో వారం, 2023
- **డాక్యుమెంట్ వెరిఫికేషన్:** డిసెంబర్ నాలుగోవారం, 2023
- **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ అండ్ ఎన్‌సీఆర్, చెన్నై, బెంగళూరు, ముంబయి, లక్నో, రాంచీ, చండీగఢ్, గువహటి, కోల్‌కతా.
- **వెబ్‌సైట్:** https://aiihph.gov.in

ఓటేద్దాం రండి!

ముహమ్మద్ ఫసియొద్దీన్

ఓటు ఎంతో విలువైనది.. వెలకట్టలేనిది. రాష్ట్ర భవిష్యత్, ప్రజల తలరాతను నిర్దేశించే శక్తివంతమైన ఆయుధం ఓటే. ప్రజలు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయండి. వచ్చే ఐదేళ్లలో మీ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగలిగే ప్రభుత్వాన్ని ఎన్నుకోండి. ఐదేళ్లకోసారి మాత్రమే ప్రజాక్షేత్రంలోకి వచ్చే నేతలకు మీ శక్తియుక్తులను తెలియజేయండి.

ఓటరుకు 21 సెకన్లు

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఒక్కో ఓటరు ఓటేసేందుకు సగటున 21 సెకన్ల సమయం కేటాయించనున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. మొత్తం 10 గంటల పాటు పోలింగ్ జరుగుతుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,550 మంది, మిగిలిన చోట్లలో గరిష్టంగా 1,500 మంది ఓటర్లు ఓటేసేందుకు ఏర్పాట్లు చేశారు.

36,000 సెకన్ల పాటు పోలింగ్

పోలింగ్ కేంద్రంలో మొత్తం 36 వేల సెకన్ల పాటు పోలింగ్ జరగనుండగా, ఒక్కో ఓటరు ఓటేసేందుకు సగటున 21 సెకన్ల చొప్పున మొత్తం 31,500– 32,550 సెకన్ల సమయం పట్టనుంది. ఓటరు పోలింగ్ కేంద్రంలో ప్రవేశించిన వెంటనే తొలుత అతడి పేరు ఓటరు జాబితాలో ఉందా లేదా అని ఓ పోలింగ్ అధికారి పరిశీలించి నిర్ధారిస్తారు. ఆ తర్వాత మరో అధికారి ఓటరు ఎడమచేతి చూపుడు వేలుకు సిరా చుక్క పెడతారు. అనంతరం మరో అధికారి ఈవీఎం కంట్రోల్ యూనిట్‌ను సిద్ధం చేసి ఓటరు ఓటేసేందుకు బ్యాలెట్ యూనిట్ ఉండే కంపార్ట్‌మెంట్‌లోకి పంపిస్తారు. ఈ మూడు ప్రక్రియలు 14 సెకన్లలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్లపై నిషేధం !

పోలింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్లు, కార్డ్ లెస్ ఫోన్లు, వైర్ లెస్ సెట్లతో ప్రవేశంపై నిషేధం ఉంది. పోలింగ్ కేంద్రానికి చుట్టూ 100 మీటర్ల పరిసరాల పరిధిలోకి ఇలాంటి పరికరాలు తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తూ సెల్ఫీలు తీసుకోవడానికి సైతం వీలు లేదని గతంలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కేవలం ఎన్నికల పరిశీలకులు, సూక్ష్మ పరిశీలకులు, ప్రిసైడింగ్ అధికారులు, భద్రత అధికారులు మాత్రమే ఎన్నికల కేంద్రంలో మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లవచ్చు. అయితే వాటిని సైలెంట్ మోడ్‌లో ఉంచాల్సిందే. ఓటర్లు పోలింగ్ బూత్‌లో ప్రవేశించి ఓటు ఎవరికి వేశారో మొబైల్ ఫోన్ కెమెరాల్లో చిత్రీకరించే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. వీవీ ప్యాట్ యంత్రాల డిస్‌ప్లే స్క్రీన్‌పై ఓటు ఎవరికి వేశారో ఏడు క్షణాల పాటు కనిపించనుంది. దీనిని ఫోన్‌తో ఫొటో తీసే అవకాశం ఉండటంతో మొబైల్ ఫోన్లపై నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

నిర్ణీత సమయం దాటిన తర్వాత లైనులో ఉంటే ఓటుహక్కు కల్పిస్తారా?

రాష్ట్రంలోని 13 వామపక్ష ప్రభావిత ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 106 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా పోలింగ్ కేంద్రం ముందు లైనులో నిలబడిన వారికి ఓటేసేందుకు అవకాశం కల్పిస్తారు. పోలింగ్ సమయం ముగిసిన వెంటనే లైనులో ఉన్న వారికి పోలింగ్ అధికారులు టోకెన్లు ఇస్తారు.

వికలాంగులు, వృద్ధులు ఓటేసేందుకు వాహన సదుపాయం కోసం ఎవరిని సంప్రదించాలి.

స్థానిక బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ)ని సంప్రదిస్తే ఆటో ద్వారా ఓటర్లను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తరలించనున్నారు.

పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో.. ఎలా తెలుసుకోవాలి ?

రాష్ట్రంలోని ఓటర్లందరికీ ఎన్నికల సంఘం ఫొటో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు జారీ చేసింది. ఈ ఓటర్ స్లిప్పుల వెనకభాగంలో పోలింగ్ కేంద్రం రూటు మ్యాప్‌ను పొందుపరిచింది. ఈ రూట్ మ్యాప్‌తో సులువుగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవచ్చు.

కొత్త ఎపిక్ కార్డు నంబర్ ఎలా తెలుసుకోవాలి?

గతంలో కేంద్ర ఎన్నికల సంఘం 13/14 అంకెల సంఖ్యతో ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేయగా, గత కొంత కాలంగా 10 అంకెల సంఖ్యతో కొత్త ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేస్తోంది. పాత ఓటరు గుర్తింపు కార్డు నంబర్ ఆధారంగా మీ కొత్త ఓటరు గుర్తింపు కార్డు నంబర్ తెలుసుకోవచ్చు. ఇందుకోసం మీరు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్ https://ceotserms2. telangana. gov. in/ ts& search/ Non& Standard& Epic. aspx ను సందర్శించి మీ పాత ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా కొత్త ఎపిక్ కార్డు నంబర్‌ను తెలుసుకోవచ్చు.

ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ఓటేయవచ్చు!

ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులుంటే ఓకే

ఎపిక్ కార్డులో స్వల్ప తేడాలున్నా ఓటేయవచ్చు

ఎపిక్‌తో గుర్తింపు ధ్రువీకరణ కాకుంటే ప్రత్యామ్నాయ గుర్తింపు తప్పనిసరి	ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పును గుర్తింపుగా పరిగణించరాదు

రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈసీ కొత్త మార్గదర్శకాలు

ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్)లోని వివరాల్లో స్వల్ప తేడాలున్నా, ఓటరు గుర్తింపు నిర్ధారణ అయితే ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వేరే నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు గుర్తింపు కార్డును చూపించి, మరో నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే వారికి సైతం ఓటు హక్కు కల్పించాలని సూచించింది. అయితే, ఆ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో పేరు ఉంటేనే ఈ సదుపాయం కల్పించాలని కోరింది. ఓటరు గుర్తింపు నిర్ధారణ విషయంలో ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది.

ఎపిక్‌లో లోపాలుంటే వేరే గుర్తింపు తప్పనిసరి..

ఓటరు గుర్తింపు కార్డులో ఫొటోలు తారుమారుకావడం, ఇతర లోపాలతో ఓటరు గుర్తింపు ధ్రువీకరణ సాధ్యంకానప్పుడు, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో(కింద జాబితాలో చూడవచ్చు) ఏదైనా ఒకదానిని ఆధారంగా చూపాల్సి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. ప్రవాస భారత ఓటర్లు తమ పాస్‌పోర్టును తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని తెలిపింది. పోలింగ్‌కు కనీసం 5 రోజుల ముందు పోలింగ్ కేంద్రం పేరు, తేదీ, సమయం, ఇతర వివరాలతో ఓటర్లకు పోలింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను జారీ చేయాలని ఆదేశించింది. అయితే, వీటిని ఓటరు గుర్తింపుగా పరిగణించరాదని స్పష్టం చేసింది. ఓటరు గుర్తింపు కార్డు లేనిపక్షంలో, ఉన్న గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానిపక్షంలో పోలింగ్ రోజు ఈ కింది జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో ధ్రువీకరణ పత్రాలను తీసుకువస్తే ఓటు హక్కు కల్పించాలని ఆదేశించింది.



- ఆధార్‌కార్డు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు
- బ్యాంకు/తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
- కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా(ఆర్జీఐ).. నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్ (ఎన్పీఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు
- భారతీయ పాస్‌పోర్టు
- ఫొటో గల పెన్షన్ పత్రాలు
- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగి గుర్తింపు కార్డులు
- ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు
- కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు(యూడీఐడీ)

ఓటరు జాబితాలో పేరు తొలగించినా ఓటేయవచ్చు !

పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేకంగా అబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్(ఏఎస్‌డీ) ఓటర్ల జాబితా రూపొందించి సంబంధిత పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే వ్యక్తి పేరు ఓటరు జాబితాలో లేకపోతే, ఆ వ్యక్తి పేరును ఏఎస్‌డీ ఓటర్ల జాబితాలో వెతకాలి. ఏఎస్‌డీ ఓటర్ల జాబితాలో ఆ వ్యక్తి పేరుంటే ఓటరు గుర్తింపు కార్డు/ లేదా ఇతర గుర్తింపు కార్డుల ఆధారంగా ఆ వ్యక్తి గుర్తింపును ప్రిసైడింగ్ అధికారి ముందుగా నిర్ధారించుకుంటారు. అనంతరం ఆ వ్యక్తి పేరును ఫారం 17ఏలో నమోదు చేసి సంతకంతో పాటు వేలిముద్ర తీసుకుంటారు. ఈ క్రమంలో తొలి పోలింగ్ అధికారి సదరు ఏఎస్‌డీ ఓటరు పేరును పోలింగ్ ఏజెంట్లకు గట్టిగా వినిపిస్తారు. సదరు ఓటరు నుంచి నిర్దిష్ట ఫార్మాట్‌లో డిక్లరేషన్ తీసుకోవడంతో పాటు ఫొటో, వీడియో తీసుకుంటారు. అనంతరం అతడికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

జాబితాలో పేరు ఉందా? లేదా? ఎలా తెలుసుకోవాలి ?

కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వెబ్‌సైట్ https://electoralsearch.eci.gov.in/ ద్వారా ఓటరు వివరాలు/ ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్)/ మొబైల్ నంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తోంది. మొబైల్ ఫోన్ నంబర్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా జాబితాలో పేరు సెర్చ్ చేయడం చాలా సులువు. గతంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా పేరును సెర్చ్ చేయడానికి వీలుంటుంది. ఓటరు పేరు, తండ్రి పేరు/ వయసు ఇతర వివరాలను కీ వర్డ్స్‌గా వినియోగించి సెర్చ్ చేసినప్పుడు అక్షరాల్లో స్వల్ప తేడాలున్నా జాబితాలో పేరు కనిపించదు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌తో సకల సదుపాయాలు

ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటర్లకు సకల సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవడం, ఓటర్ల జాబితాలో పేరు వెతకడం, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవడం, బీఎల్ఓ/ఈఆర్వోతో అనుసంధానం కావడం, ఈ– ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి సేవలను పొందవచ్చు.



మీ ఓటును వేరేవాళ్లు వేసేశారా? అయితే.. టెండర్ ఓటేయవచ్చు!

ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికి మీ ఓటు వేరేవారు వేసేశారా? అయితే దిగులుపడాల్సిన అవసరం లేదు. మీకు టెండర్ ఓటు వేసే హక్కును ఎన్నికల సంఘం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం) ద్వారా కాకుండా పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పిస్తారు. టెండర్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు ఫారం–17బీలో రికార్డు చేస్తారు. ఈ ఫారంలోని 5వ కాలమ్‌లో ఓటరు సంతకం/వేలి ముద్రను తీసుకున్న తర్వాత వారికి బ్యాలెట్ పత్రం అందజేస్తారు. ప్రత్యేక ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఓటరు బ్యాలెట్ పత్రాన్ని తీసుకెళ్లి తాము ఓటేయదలచిన అభ్యర్థికి చెందిన ఎన్నికల గుర్తుపై స్వస్తిక్ ముద్రను వేయాల్సి ఉంటుంది. ఓటేవరికి వేశారో బయటకు కనబడని విధంగా బ్యాలెట్ పత్రాన్ని మడిచి కంపార్ట్‌మెంట్ బయటకి వచ్చి ప్రిసైడింగ్ అధికారికి అందజేయాలి. ఆ బ్యాలెట్ పత్రాన్ని టెండర్ ఓటుగా ప్రిసైడింగ్ అధికారి మార్క్ చేసి ప్రత్యేక ఎన్వలప్‌లో వేరుగా ఉంచుతారు.

చాలెంజ్ ఓటు అంటే ..?

ఓటేసేందుకు వచ్చిన వ్యక్తి గుర్తింపును అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు రూ.2 చెల్లించి సవాలు చేయవచ్చు. ఓటరు గుర్తింపును నిర్ధారించడానికి ప్రిసైడింగ్ అధికారి విచారణ జరుపుతారు. ఓటరు గుర్తింపు నిర్ధారణ జరిగితే ఓటేసేందుకు అవకాశం కల్పిస్తారు. దొంగ ఓటరు అని నిర్ధారణ అయితే సదరు వ్యక్తిని ప్రిసైడింగ్ అధికారి పోలీసులకు అప్పగించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

అనుచితంగా ప్రవర్తిస్తే పోలింగ్ బూత్ నుంచి గెంటివేతే

స్పష్టం చేస్తున్న నిబంధనలు

పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రంలో అనుచితంగా ప్రవర్తించిన లేదా చట్టపర ఆజ్ఞలను పాటించడంలో విఫలమైన వ్యక్తులను ప్రిసైడింగ్ అధికారి బయటకు పంపించవచ్చు అని కేంద్ర ఎన్నికల సంఘం గతంలో స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 132 కింద ఈ మేరకు అధికారాలు ప్రిసైడింగ్ అధికారికి ఉన్నాయని పేర్కొంది. మద్యం సేవించినా లేదా మాదక ద్రవ్యాలను వినియోగించిన వ్యక్తులను పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించకుండా నిలువరించేందుకు అనుమతి కోరుతూ గత శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా నాటి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) రజత్‌కుమార్ రాసిన లేఖకు స్పందిస్తూ అప్పట్లో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. మద్యం సేవించి పోలింగ్ కేంద్రానికి వచ్చే వ్యక్తుల ఓటు హక్కును నిరాకరించడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. మద్యం లేదా మాదక ద్రవ్యాల మత్తులో విచక్షణ కోల్పోయి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియకు ఆటంకం కలిగించే వ్యక్తులను మాత్రం పోలీసుల సహాయంతో బయటకు పంపించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

పోలింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుంది ?

పోలింగ్ కేంద్రంలో ప్రవేశించిన వ్యక్తికి ఆ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో పేరు ఉందా? లేదా ? అన్న విషయాన్ని ఏదైనా గుర్తింపుకార్డు ఆధారంగా తొలి పోలింగ్ అధికారి పరిశీలిస్తారు. రెండో పోలింగ్ అధికారి ఆ ఓటరు ఎడుమ చేతి చూపుడు వేలుకు సిరా చుక్క అంటించి, ఓ స్లిప్పు అందజేస్తారు. ఫారం–17ఏలో వివరాలు నమోదు చేసి ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో పోలింగ్ అధికారి వద్ద ఆ స్లిప్పును డిపాజిట్ చేసి, సిరా చుక్క అంటించిన వేలును చూపిస్తే ఓటేసేందుకు పోలింగ్ బూత్‌లోకి పంపిస్తారు. అక్కడ మూడో పోలింగ్ అధికారి ఓటు వేసేందుకు సాంకేతికంగా ఈవీఎంను సిద్ధం చేసి పెడతారు.



ఈవీఎంలో ఓటు ఎలా వేయాలి ?

ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ పరికరాలుంటాయి. ప్రిసైడింగ్ అధికారి నియంత్రణలో కంట్రోల్ యూనిట్ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మాత్రం ఓటరు ఓటు వేసే కంపార్ట్‌మెంట్‌లో ఉంటాయి. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి పేరు పక్కన ఉన్న నీలిరంగు మీటను నొక్కగానే..ఆ అభ్యర్థి పేరు, మీట మధ్యలో ఉండే రెడ్ లైట్ వెలుగుతుంది. ఆ వెంటనే ఓటు ఎవరికి పడిందో తెలిపేందుకు అభ్యర్థి పేరు, క్రమసంఖ్య, ఎన్నికల గుర్తుతో ఓ స్లిప్పు వీవీప్యాట్‌పై ప్రింట్ అవుతుంది. 7 సెకండ్ల పాటు వీవీప్యాట్ డిస్‌ప్లే విండోపై ఈ స్లిప్ ఓటరుకు ప్రదర్శితమవుతుంది. ఆ తర్వాత వీవీ ప్యాట్‌లోని డ్రాప్ బాక్స్‌లోకి స్లిప్ పడిపోతుంది. ఆ వెంటనే ఓటు విజయవంతంగా పడినట్టు బీప్ శబ్దం వినిపిస్తుంది.

అక్కడ భారీగా బందోబస్తు

119 స్థానాల్లోని 27 శాసనసభ నియోజకవర్గాల్లో 614 పోలింగ్ కేంద్రాలపై వామపక్ష ప్రభావం ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటికే మూడు దఫాలుగా పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత చేపట్టాల్సిన బందోబస్తుపై ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. ఓటింగ్ రోజు పక్కాగా 144 సెక్షన్ అమలు, పోలింగ్ తర్వాత చీకటి పడకముందే ఈవీఎంలను భద్రంగా స్ట్రాంగ్‌రూంకు తరలించడం, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా రక్షణ కల్పించనున్నారు. మావోయిస్టుల తీవ్ర ప్రభావమున్న 13 నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్ ముగించనున్నారు.



మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో డ్రోన్ పెట్రోలింగ్

వెబ్‌కాస్టింగ్‌తో ప్రత్యక్ష ప్రసారం



ప్రతి కదలిక ప్రత్యక్ష వీక్షణ

ఓటు హక్కు వినియోగించుకునే దృశ్యం ప్రత్యక్ష ప్రసారం కానుంది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా 3.26 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే దృశ్యాలు పోలింగ్ కేంద్రాల నుంచి ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. ఓటర్లే కాదు.. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, భద్రత సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల ప్రతి కదలికను ఎన్నికల సంఘం లైవ్‌గా వీక్షించనుంది. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 27,094 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియను ఆద్యంతం 'లైవ్ వెబ్‌కాస్ట్' చేయనున్నారు. ఎక్కడ ఎలాంటి అపశ్రుతి చేసుకున్నా, ఎవరైనా ఆటంకం సృష్టించినా, ఏమైనా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నా క్షణాల్లో ఎన్నికల సంఘం సంబంధిత పోలింగ్ కేంద్రంలోని పరిస్థితులను లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా వీక్షిస్తుంది. వెంటనే స్థానిక పోలింగ్ అధికారులకు సూచనలు జారీ చేస్తుంది. ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లు, హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ), జిల్లా కేంద్రాల నుంచి జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు, నియోజకవర్గ కేంద్రాల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా టీవీ తెరలపై ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. సాంకేతికంగా ప్రత్యక్ష ప్రసారం సాధ్యం కాని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మాత్రం సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు కానుంది.

- లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు చూసేందుకు ఏర్పాట్లు
- పోలింగ్ కేంద్రంలో ప్రవేశించిన ఓటరును పోలింగ్ అధికారి గుర్తించే ప్రక్రియ.
- ఓటరు వేలి మీద సిరా చుక్క రాయడం
- ఓటరును గుర్తించిన అనంతరం ఈవీఎంకు సంబంధించిన కంట్రోల్ యూనిట్‌ను ప్రిసైడింగ్ అధికారి స్టార్ట్ చేయడం
- ఓటు వేసేందుకు పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటరు ప్రవేశించే దృశ్యం. అయితే, ఓటు ఎవరికి వేశారన్న రహస్యాన్ని కాపాడేందుకు ఈవీఎం బ్యాలెట్ యూనిట్ కనిపించని విధంగా కెమెరా ఏర్పాట్లు చేస్తారు.
- పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ ఏజెంట్ల కదలికలు
- పోలింగ్ ముగింపు సమయంలో ఇంకా ఓటేసేందుకు వరుసలో నిలబడిన ఓటర్లకు టోకెన్లు/స్లిప్పులు అందించే ప్రక్రియ.
- పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు(బ్యాలెట్ యూనిట్/కంట్రోల్ యూనిట్), వీవీ ప్యాట్‌లను సీల్ వేసే దృశ్యంతో పాటు పోలింగ్ ఏజెంట్లకు 17సీ కాపీలు అందజేసే దృశ్యం.
- కనీసం 7-8 అడుగులకు మించిన ఎత్తులో కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.
- కెమెరాను గోడకు స్టాండ్ ఆధారంగా, లేదా స్థిరంగా ఉండే విధంగా ఓ చోట బిగిస్తారు.
- వెబ్ కెమెరా/సీసీటీవీ నిఘా పరిధిలో మీరు ఉన్నారని పోలింగ్ కేంద్రం వద్ద హెచ్చరిక నోటీసులు అతికిస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.